మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 22 | గురువారం | 18-12-2025 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## అంతటా గుత్తాధిపత్యం

మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ ద్వంద్వాధిపత్యం సృష్టిస్తోంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ 05

## ఇథనాల్ ప్లాంట్ మాకొద్దు

## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ముర్ము

- 22 వరకు నగరంలో శీతాకాల విడిది
- విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- ఈనెల 20, 21న ఉపరాష్ట్రపతి పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్

శీతాకాలం విడిదిలో భాగంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 2.25 గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతిద్రౌపది ముర్ముకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బొల్లారంలో రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు అక్కడే బస చేయనున్న రాష్ట్రపతి అదే రోజు సాయంత్రం 4.40 గంటలకు తిరిగి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలు దేరి వెళ్లనున్నారు.

**రాష్ట్రపతి పర్యటన వివరాలు :** శీతాకాలం విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బుధవారం రాష్ట్రపతి నిలయానికి చేరుకున్న రాష్ట్రపతి గురువారం సైతం రాష్ట్రపతి నిలయంలో గడపనున్నారు. 19వ తేదీన ఉదయం 11.00 గంటలకు రామోజీ ఫిల్మ్ సిటీలో జరగనున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఛైర్మన్ల జాతీయ సదస్సును రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. అనంతరం రామోజీ ఫిల్మి సిటీ సందర్శించనున్న రాష్ట్రపతి తిరిగి 5.30 గంటలకు రాష్ట్రపతి నిలయం చేరుకోనున్నారు. 20వ తేదీన గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో సాయంత్రం 4.30గంటలకు జరగనున్న టైమ్‌లెస్ విస్‌డమ్ ఆఫ్ తరువాయి 2లో







# ఆధారాల్లేవ్

- ఐదుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ కొట్టివేసిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- అరికెపూడి గాంధీ, మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్‌కు ఊరట

ప్రజాపక్షం/హైదరాబాద్

ఐదుగురు ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లను శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం కొట్టివేశారు. అనర్హత వేటుకు తగిన ఆధారాలు లేవని స్పష్టం చేశారు. 10వ షెడ్యూల్‌లోని పేరా6 ప్రకారం ట్రిబ్యునల్ ఛైర్మన్‌గా స్పీకర్‌కు అప్పగించిన అధికారాలను వినియోగించుకుని, తెలంగాణ శాసనసభ సభ్యుల అనర్హత (ఫిరాయింపు ఆధారంగా) నియమాలు 1986 ప్రకారం తుది నిర్ణయం ప్రకటించినట్లు స్పీకర్ వెల్లడించారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మహిపాల్ రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,ప్రకాశ్ గౌడ్‌లపై వేసిన అనర్హత పిటిషన్లను తరువాయి 2లో



స్పీకర్ నిర్ణయం

### ప్రజాస్వామ్య స్ఫూర్తి, రాజ్యాంగానికి విరుద్ధం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ 03

## పల్లె పోరులో హస్తం హవా

### మూడు విడతల్లోనూ విజయబావుటా

- 6800ల సర్పంచ్ స్థానాలు కైవసం
- 3500 బిఆర్‌ఎస్, 700 బిజెపి, 1600లకు పైగా ఇతరులు...
- 100 స్థానాల్లో సిపిఐ విజయం

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. మొత్తం మూడు విడతల్లో పోలింగ్ జరుగగా అన్నింటిలోనూ అధికార పార్టీ జోరు కొనసాగించింది. మెజారిటీ గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. బుధవారం జరిగిన మూడో విడత ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. కడపటి వార్తలు అందేసరికి కాంగ్రెస్ 2200 పైగా, బిఆర్‌ఎస్ 1100, బిజెపి 200 పైగా, ఇతరులు 500 సర్పంచ్ స్థానాల్లో గెలుపొందాయి. సిపిఐ 30 స్థానాల్లో విజయం సాధించింది. మూడు విడతల్లో కలిపి మొత్తంగా కాంగ్రెస్ 6,800, బిఆర్‌ఎస్ 3,500, బిజెపి 700, ఇతరులు 1600లకు పైగా స్థానాల్లో గెలుపొందారు. 100 మంది సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు. మూడో విడతలో 85.77 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 1 గంటకు ముగియగా, 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. ముందుగా బ్యాలెట్ ఓట్లు, అనంతరం వార్డు మెంబర్లు, సర్పంచ్ ఓట్లను లెక్కించి ఫలితాలను వెంటనే ప్రకటించారు. ఫలితాలు వెలువడుతున్న కొద్దీ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మూడో విడతలో భాగంగా 182 మండలాల్లోని 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డులకు పోలింగ్ జరిగింది. ఈ విడతలో తరువాయి 2లో

## ఈనెల 22న కొలువుతీరనున్న కొత్త పాలకవర్గాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికలు జరిగిన గ్రామాల్లో ఈనెల 22వ తేదీన కొత్త పాలకవర్గాలు కొలువు తీరనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకరణ తేదీలో మార్పు జరిగింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20వ తేదీన జరగాల్సిన ప్రమాణస్వీకార తరువాయి 2లో



## మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

- నేషనల్ హెరాల్డ్ కేసులో 'ఇడి' దుర్వినియోగంపై కాంగ్రెస్ డిమాండ్
- 'సత్యమేవ జయతే, సత్యం గెలుస్తుంది' అంటూ పార్లమెంట్ వద్ద పార్టీ ఎంపిలు నినాదాలు

**న్యూఢిల్లీ :** దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగపరుస్తుందని కాంగ్రెస్ విమర్శించింది. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు కోర్టు ఉపశమనం కల్పించిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపిలు బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కేసులో పార్టీ అగ్ర నాయకులపై దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన మనీలాండరింగ్ అభియోగాన్ని ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించడంతో నిజం గెలిచిందని ఆ పార్టీ ఎంపి పేర్కొన్నారు. 'సత్యమేవ జయతే, సత్యం గెలుస్తుంది' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం మెట్ల ముందు వరుసలో నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా



నినాదాలు చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్, ఎఐసిసి జనరల్ సెక్రటరీ ముకుల్ వాస్నిక్, ఎంపిలు శశి థరూర్, తారిఖ్ అన్వర్, కుమారి సెల్జా, కె. సురేష్, మాణికం ఠాగూర్ తరువాయి 2లో

## 'ప్రైవేటు'కు అణురంగం తలుపులు బార్లా..

**ప్రతిపక్షాల వాకౌట్ : బిల్లుకు లోక్‌సభ ఆమోదం**

**న్యూఢిల్లీ:** ప్రైవేటు భాగస్వాములకు అణురంగం తలుపులు బార్లా తెరుస్తూ లోక్‌సభ బుధవారం ఒక బిల్లును ఆమోదించింది. ప్రతిపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశం 100 గిగావాట్స్ అణు ఇంధన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రైవేటు సంస్థలు అణురంగంలోకి ప్రవేశించేందుకు వీలుగా రూపొందించిన ఈ బిల్లుకు కేంద్రం సంక్షిప్త పదాల్లో "శాంతి" బిల్లు (ద సస్టెయనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) గా నామకరణం చేసింది. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. వారి నిరసనలు, వాకౌట్ల మధ్య ఏకపక్షంగా తరువాయి 2లో



## భారత్, ఇథియోపియా రెండూ సహజ భాగస్వాములు

ప్రధాని నరేంద్రమోదీ కీలక ప్రసంగం




05

## చమురు నౌకల దిగ్బంధం

- వెనిజులాను చుట్టుముట్టిన అమెరికా సైన్యం
- భూమి, చమురు, ఖనిజాలు మాకు స్వాధీనం చేయాలి : ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** దక్షిణ అమెరికాపై ఆధిపత్యంకోసం కయ్యానికి కాలు దువ్వుతున్న డోనాల్డ్ ట్రంప్ తాజాగా వెనిజులా దేశంలోపలికి, బయటకు చమురు వాణిజ్య నౌకలు రాకపోకలు సాగించకుండా దిగ్బంధించారు. వెనిజులాను నావికాదళంతో చుట్టుముట్టి యుద్ధవాతావరణం సృష్టించారు. "వెనిజులా భూమి, అందులో ఉన్న చమురు, ఖనిజాలు ఆస్తులన్నీ మావి, అందువల్ల మా ఆస్తులను మాకు స్వాధీనం చెయ్యాలి, గతంలో వీటిని మా నుండి దొంగిలించారు, అవన్నీ మావి, వెనిజులా వాటన్నింటినీ మాకు స్వాధీనం చేసేవరకూ ప్రపంచంలోనే అతిపెద్ద దైన యుద్ధ విమానవాహక నౌక కరీబియన్‌లోనే తిష్టవేసి ఉంటుంది" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. వెనిజులాపై ట్రంప్ ఇప్పటికే ఎన్నో ఆంక్షలు విధించారు. ఇప్పుడు తాజాగా చమురు నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడంవల్ల ఇప్పటికే సంక్షోభంలో ఉన్న ఆ దేశ ఆర్థికవ్యవస్థ ఇక కుప్పకూలిపోయే దశకు వస్తుంది. వెనిజులాపై సైనిక ముట్టడి ద్వారా యుద్ధానికి అవకాశాలున్నాయని 2017 ఆగస్టు నెలలోనే ట్రంప్ మొదటిసారి ప్రకటన చేశారు. విశ్లేషకుల అంచనా ప్రకారం వెనిజులా ప్రతిరోజూ 10 లక్షల బ్యారల్స్ చమురు ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 8.50 లక్షల బ్యారల్స్ విదేశాలకు తరువాయి 12లో



## డివిజన్ల విభజనపై స్టేకు హైకోర్టు నిరాకరణ

- వివరాల్ని వెబ్‌సైట్‌లో పెట్టాలి
- అభ్యంతరాలను చెప్పేందుకు 2 రోజుల గడువు పెంపు

ప్రజాపక్షం/హైదరాబాద్

జీహెచ్ఎంసీ డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంపుదల చేస్తూ వెలువడిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను సవాల్ చేసిన పలు పిటిషన్లను విచారించిన హైకోర్టు మధ్యంతర ఆదేశాల జారీకి నిరాకరించింది. ఆ ప్రక్రియలో జోక్యానికి నిరాకరించింది. అయితే, వార్డుల విభజన, జనాభా లెక్కలు, వార్డు మ్యాప్‌లను పబ్లిక్ డొమైన్లో పెట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్‌ను అధికారులను ఆదేశించింది. 24 గంటల్లోగా పబ్లిక్ డొమైన్లో పెట్టాలంది. వాటిని పరిశీలించే ప్రజలు, పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పేందుకు మరో రెండు రోజుల గడువు ఇవ్వాలని తరువాయి 2లో

## తుది విడతలో గెలుపొందిన సిపిఐ సర్పంచ్‌లు



బాడిష మౌనిక, లక్ష్మీపురం (భద్రాది) | గరిక ఉపేందర్, సీతంపేట (భద్రాది) | కంగల అంజలి, హేమంచంద్రాపురం (భద్రాది) | నూనావత్ హతిరామ్, లాలూ తండా (భద్రాది) | వజ్జ ఈశ్వరమ్మ, చేతకొండ (భద్రాది) | తాటి లక్ష్మణ్, మైలారం (భద్రాది) | మాలోత్ రామనాథం, కోయగూడెం (భద్రాది) | పగిడ రాంబాబు, పునుకుడుచెలక (భద్రాది) | వజ్జ ఉమా, వెంకటాపురం (భద్రాది) | మలకం ఉమామహేశ్వరి, బంగారు చెలక(భద్రాది)



కొర్సా వీరబాబు, అనిశెట్టిపల్లి (భద్రాది) | గుగులోత్ అరుణ, 2 ఇంక్లైన్ (భద్రాది) | గుగులోత్ బీబు, సీతారాంపురం (భద్రాది) | ఈసం కళ్యాణి, లోతువాగు (భద్రాది) | జర్పుల దేవి, అశోక్‌నగర్ (భద్రాది) | గుగులోత్ ప్రేమ్‌చంద్, హమాలీ కాలనీ (భద్రాది) | టి.ప్రతిమా విజేందర్‌రెడ్డి, ఖానాపూర్ (నల్లగొండ) | పి.రాములమ్మరాములు, రహమంతాపూర్ (నల్లగొండ) | వరికుప్పల స్వప్న, శేశాయికుంట (నల్లగొండ) | పట్లావత్ భారతీ ధర్మ, పతులతుతండా (నల్లగొండ)



కె.పద్మ అయ్యప్ప, కానుగుబండ (సూర్యాపేట) | కట్టా కల్యాణి, రంగాపురం (సూర్యాపేట) | ముత్యాల అంజయ్య, మహమ్మదాబాద్ (యాదాద్రి) | కె.వినోద శ్రీనివాస్, కోతులాపురం (యాదాద్రి) | పవార్ రాష్ట్రపాల్, గుండెగావ్ (నిర్మల్) | బిసముల నాగరాజు, రాంపూర్ (నారాయణపేట) | సృజన్‌కుమార్, అంతకపేట (సిద్దిపేట) | కోరం కోటమ్మ, బాజుమల్లాయిగూడెం (ఖమ్మం)

బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ తుది విడత ఎన్నికల్లో కడపటి వార్తలు అందేసరికి 28 మంది సిపిఐ అభ్యర్థులు విజయం సాధించగా మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.




# ప్రపంచం
WORLD NEWS

## తల్లిదండ్రుల్ని చంపింది కొడుకే
### రాబ్ రైనర్ హత్యపై కేసు నమోదు

**లాస్‌ఏంజెల్స్ :** ప్రముఖ హాలీవుడ్ నటుడు, చిత్ర నిర్మాత రాబ్ రైనర్ (78), ఆయన భార్య మిచెల్ సింగర్ రైనర్ (68 ) హత్యలో అరెస్టయిన వారి కుమారుడు నిక్ రైనర్ (32)పై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేశారు. డిస్ట్రిక్ అటార్నీ నాథన్ హోచ్‌మన్ బుధవారం ఈ విషయం చెప్పారు. అతడే నేరస్థుడని రుజువైతే మరణశిక్ష,పెరోల్ లేకుండా జీవితకాల ఖైదీగా ఉండాల్సి వస్తుందని ఆయన చెప్పారు. రాబ్ రైనర్ దంపతులు హత్యకు గురైన రెండు రోజుల తర్వాత కొడుకు నిక్ రైనర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. తల్లిదండ్రులను నిక్ రైనర్ అనేకసార్లు కత్తితో పొడిచి చంపాడు. రాబ్ రైనర్ చిత్ర నిర్మాత, హాలీవుడ్ నటుడు కాగా ఆయన భార్య మిచెల్ సింగర్ రైనర్ కూడా నటి, ఫోటోగ్రాఫర్, నిర్మాత, ఫోటోగ్రఫీ,ప్రొడక్షన్ కంపెనీ రైనర్ లైట్ వ్యవస్థాపకురాలు. రాబ్ రైనర్ 1980,1990 దశకాలలో మరపురాని చిత్రాలు నిర్మించారు. 1970వ దశకంలో సంచలనాత్మకమైన టీవీ సిట్ కామ్'''ఆల్ ఇన్ ద ఫ్యామిలీ''లో మీట్ హెడ్ పాత్ర పోషించి భారీ విజయాన్ని అందుకున్నాడు. తిరుగులేని నటుడుగా జైత్రయాత్రసాగించాడు.

## చర్చలు విఫలమైతే బలప్రయోగమే
### పుతిన్ హెచ్చరిక



**మాస్కో :** శాంతి చర్చలు విఫలమైతే ఉక్రేన్‌లో తమ భూభాగాలను సైనిక చర్య ద్వారా స్వాధీనం చేసుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. రష్యాతో భారీ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని కొన్ని పశ్చిమదేశాలకు చెందిన నాయకులు చెబుతున్నారని పేర్కొంటూ దీనిని యుద్ధోన్మాదంగా, పచ్చి అబద్ధాలుగా ఆయన అభివర్ణించారు. పుతిన్‌ను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ బుధవారం ఈ విషయం వెల్లడించింది. వాస్తవానికి తమ దేశం దౌత్యమార్గాల ద్వారా లేదా సైనిక మార్గంలోనో ఉక్రేన్‌లో తమ లక్ష్యాలు సాధించాలని కోరుకుంటున్నదని, ఈ ప్రాంతంలో ఒక బఫర్ జోన్ (ఎవరికీ చెందని భూభాగం) సృష్టించాలని కూడా తాము భావిస్తున్నామని చెప్పారు. ''మొదట మా లక్ష్యాన్ని నిస్సందేహంగా ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్ ద్వారా సాధిస్తాం, ఆ తర్వాత దీర్ఘకాలికంగా ఈ సమస్యలకు ఉన్న మూల కారణాలను దౌత్య మార్గాలలో పరిష్కరిస్తాం'' అని పుతిన్ చెప్పినట్లు రాయిటర్స్ వెల్లడించింది. తమ ఎదుటిపక్షం, వారికి మద్దతుగా ఉండి పెంచి పోషిస్తున్న విదేశీభాగస్వాములు గనుక ముమ్మర చర్చలకు ఇష్టపడకపోతే తమ చరిత్రాత్మకమైన భూభాగాలను విముక్తి చేసేందుకు సైనిక మార్గాన్నే ఎంచుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం క్రిమియా ప్రాంతం రష్యా అధీనంలో ఉంది. డాన్‌బాస్‌లోని 90 శాతం భూభాగం, ఖెర్సన్, ఝపోరిఝియాలలో ఉన్న 75 శాతం భూభాగం రష్యా అధీనంలో ఉన్నాయి.

# హసీనాను అప్పగించండి
### ఢాకాలో భారత్ కార్యాలయంవద్ద నిరసన ప్రదర్శన

**ఢాకా :** పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనాను తిరిగి తమ దేశానికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఉన్న గుల్షన్‌లో భారత్ హైకమీషనర్ కార్యాలయం వద్ద వేలాదిమంది బుధవారం మధ్యాహ్నం భారీ ప్రదర్శన చేశారు. బారికేడ్లు తొలగించి అల్లరి సృష్టించారు. ''జులై ఓయిక్యా'' పేరుతో వందలాదిమంది భారీ ప్రదర్శన చేశారు.

హసీనాతోపాటు ఆమె మంత్రివర్గంలో పనిచేసిన, ఉరిశిక్షకు గురైన కమల్‌ను కూడా తమ దేశానికి అప్పగించాలని వీరంతా డిమాండ్ చేశారు. రాంపురా బ్రిడ్జ్ ప్రాంతం నుండి వందలమంది ప్రదర్శనగా బయలుదేరి గుల్షన్‌కు చేరుకున్నారు. కానీ పోలీసులు వారిని ముందుకు వెళ్ళకుండా ఉత్తర బద్దా వద్ద అడ్డుకోవడంతో ఆగ్రహం చెందిన ప్రదర్శకులు రోడ్లపైనే ఉన్నచోటనే బైఠాయించారు. బారికేడ్లను ధ్వంసం చేశారు. ''ఢిల్లీ న...ఢాకా... ఢాకా... ఢాకా...'' అంటూ నినాదాలు చేశారు. హసీనాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.





## మరో 20 దేశాలపై ప్రయాణ నిషేధం





**న్యూయార్క్ :** అమెరికాకు వలస వెళ్ళేందుకు అవకాశం లేకుండా ట్రంప్ యంత్రాంగం మరో 20దేశాలకు ఆంక్షల నిషేధాన్ని విస్తరించింది. వీళ్ళకు అమెరికా వెళ్ళే అవకాశం లేదు. వీరిలో అధికార, అనధికార వలసలన్నీ ఉన్నాయి. ఇందులో పాలస్తీనియన్లు కూడా ఉన్నారు. అమెరికా జాతీయ భద్రత, అమెరికా ప్రజల ప్రయోజనాలు కాపాడే ఉద్దేశంతోనే ఆంక్షలను విస్తరించినట్లు ట్రంప్ యంత్రాంగం ప్రకటించింది. ఈ ప్రయాణ నిషేధాజ్ఞలు విధిస్తూ బుధవారం ఒక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేశారు. అమెరికాకు వలస వచ్చి ఉంటున్న ఆఫ్ఘనిస్థాన్ జాతీయుడు ఒకరు గతనెలలో వైట్‌హౌస్ సమీపంలో ఇద్దరు జాతీయ భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపిన ఘటన తర్వాత ఈ ఆంక్షలను మరింత కట్టుదిట్టం చేశారు. దరఖాస్తులలో తీవ్ర లోపాలు ఉంటే లేదా సరైన కోరిన సమాచారం ఇవ్వకపోతే వాటిని పూర్తిగా పక్కన పడేస్తారు. 19 తృతీయ ప్రపంచదేశాలకు చెందిన పౌరులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించకుండా పక్కనపడేసింది. వారి గ్రీన్‌కార్డులు, పౌరసత్వాలు, వీసా పొడిగింపుల దరఖాస్తులను తాత్కాలికంగా బుట్టదాఖలు చేసింది. 15 దేశాలపై పాక్షిక ఆంక్షలు, ప్రవేశ పరిమితులను విధించింది. మరో నాలుగు దేశాల(బుర్కినాఫాసో, మాలీ, నిగర్, దక్షిణ సూడాన్, సిరియా)పై పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది.

# బాండీ బీచ్ ఉగ్రవాదిపై 59 నేరాలతో కేసు

**సిడ్నీ :** ఆస్ట్రేలియా సిడ్నీ నగరం బాండీ బీచ్‌లో యూదుల హనుక్కా ఉత్సవవేడుకల ప్రారంభంనాడు (డిసెంబరు 14) జరిగిన కాల్పుల ఘటనను ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్ ఉగ్రవాద చర్యగా ప్రకటించారు. ఆస్ట్రేలియాలో మారణాయుధాల వినియోగంపై చర్యలను మరింత కఠినతరం చేసేందుకు ఆ దేశ పార్లమెంటు చర్చకు సన్నద్ధం కాగా, కాల్పులో మరణించినవారి అంత్యక్రియల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఆస్ట్రేలియా యూదు మతస్థులు తీవ్ర విచారంలో మునిగిపోయారు. ఇజ్రాయెల్‌–పాలస్తీనా ఘర్షణలు వివాదం నేపథ్యంలో పరాయిదేశంలో యూదులే లక్ష్యంగా జరిగిన ఈ కాల్పులదాడి ప్రపంచవ్యాప్తంగా ప్రముఖవార్తగా మారింది. బాండీబీచ్‌లో జరిగిన కాల్పుల్లో పదేళ్ళ బాలికతోపాటు 16 మంది మరణించారు. మరోవైపు భారత్ హైదరాబాద్ టోలీచౌకీలో జన్మించిన బాండీబీచ్ ఉగ్రవాది సాదిజ్ అక్రమ్ (50) కాల్పుల్లో మరణించగా అతడి కుమారుడు నవీద్ అక్రమ్ (24) పై 15 హత్యా నేరాలు సహా మొత్తం 59 నేరారోపణలు చేస్తూ ఆస్ట్రేలియా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులు రుజువైతే నవీద్ అక్రమ్‌కు జీవితకాల జైలుశిక్ష పడుతుందని ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమీషనర్ క్రిస్సీ బారెన్ బుధవారం పత్రికాగోష్ఠిలో ప్రకటించారు. ఘటనాస్థలం వద్ద హతుడు సాజిద్ కారు నుండి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సామూహిక కాల్పుల ఘటనలో అంతర్జాతీయ సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని, దేశంలో ఉన్న యూదులకు పూర్తి భరోసా ఇస్తున్నామని ఆమె చెప్పారు. కాల్పుల్లో హతుడైన సాజిద్ అక్రమ్‌పై కూడా 40 హత్యా నేరాల కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నవీద్ తీవ్రంగా గాయపడి పోలీసు నియంత్రణ మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి స్పృహ రాగానే సౌత్ వేల్స్ పోలీసులు అతడికి సమాచారం చెప్పి కేసులు నమోదు చేశారు. బాంబులు పాతపెట్టినందుకు, కాల్పులు జరిపినందుకు, ఉగ్రవాద చర్యలకు పాల్పడినందుకు, యూదు మతస్థుల్లో భయభ్రాంతులు సృష్టించేందుకు ప్రయత్నం చేసినందుకు, ఇంతర దేశాల్లో శిక్షణపొంది దేశద్రోహ చర్యలు పాల్పడినందుకు ప్రధానంగా కేసులు నమోదు చేశారు.



సాజిద్ అక్రమ్ హైదరాబాద్ నుండి చదువు నిమిత్తం 1998లో ఆస్ట్రేలియా వెళ్ళి అక్కడే యూరప్ అమ్మాయిని పెళ్ళిచేసుకుని స్థిరపడ్డాడు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాదుల మతోన్మాద భావజాలాన్ని వంటబట్టించుకుని ఆ స్ఫూర్తితో యూదుల ఉత్సవంపై కాల్పులు జరిపాడు. ప్రపంచంలో అత్యధికంగా యూదులు నివసించే ప్రాంతాలలో ఒకటైన ఆస్ట్రేలియాలో వారు చేకుంటున్న హనుక్కా పర్వదినం సందర్భంలో పాలస్తీనాలో ఇజ్రాయెల్ చేసిన దారుణ దురాగతాలకు ప్రతీకార చర్యగా తండ్రీ కొడుకులు ఈ కాల్పుల చర్యకు పాల్పడ్డారు. ఐతే వారిద్దరు ఈ కాల్పుల చర్యకు ముందుగా ఫిలిప్పైన్స్ వెళ్ళి శిక్షణ పొంది వచ్చారని వెలువడిన వార్తలను ఆ దేశ ప్రభుత్వం ఖండించింది. వారు తమ దేశానికి వచ్చి శిక్షణ పొందిన ఆధారాలు ఏమీ లేవని ఫిలిప్పైన్స్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంకోవైపు హైదరాబాద్‌లో ఉన్న సాజిద్ అక్రమ్ బంధువులు కూడా అతగాడి ఉగ్రవాద భావజాలం గురించిగానీ, పొందిన శిక్షణ వివరాల గురించి గానీ తమకు తెలియదని నేషనల్ ప్రెస్‌కు చెప్పారు. రెండున్న దశాబ్దాలుపైగా అతడి కుటుంబంతో చాలా పరిమితమైన సంబంధాలే ఉన్నాయని వారు వివరణ ఇచ్చారు. 2022లో సాజిద్ చివరిసారి రెండువారాలపాటు హైదరాబాద్‌లో పర్యటించాడు. అతడికి భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల మూలాలు లేవని తెలంగాణ పోలీస్ అధికారులు కూడా ధృవీకరించారు.

## తలుపులు బార్లా.. (మొదటి పేజీ తరువాయి)

బిల్లు ఆమోదం పొందింది. ఈ బిల్లు పౌర హక్కులను నీరుగారుస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. 2010 నాటి అణు హాని నుండి పౌరులకు స్వేచ్ఛ చట్టం కింద ఉన్న నిబంధనలను ఈ కొత్త బిల్లు నీరుగారుస్తుందని హెచ్చరించాయి. ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలకు ఎలాంటి చట్టపరమైన హక్కులూ లేకుండా పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తూ బిల్లును ప్రతిఘటించారు. మంత్రి జితేంద్ర ఈ బిల్లును ఒక ''మైలురాయి శాసనం''గా అభివర్ణించారు. దేశ అభివృద్ధి ప్రయాణానికి ఈ బిల్లు ఒక సరికొత్త దిశానిర్దేశం చేస్తుందన్నారు. ''భౌగోళిక రాజకీయాలలో భారతదేశం పాత్ర పెరుగుతోంది, మనం అంతర్జాతీయంగా ఒక సహకారశక్తిగా, అంతర్జాతీయ సంస్థలో ఒక కీలక శక్తిగా ఉండాలంటే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రామాణికతలను అందుకోవాలి, అంతర్జాతీయ వ్యూహాలను అందిపుచ్చుకోవాలి, వాటిని మనదేశంలో అమలు చేయాలి, వాటితో మన అవసరాలు పెంచుకోవాలి, ఈ ప్రపంచం కాలుష్యం వెదజల్లని శుద్ధ ఇంధనం దిశగా వెళుతోంది, మనం కూడా అందులో భాగస్వాములుగా ఉంటూ దేశ భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా 100 గిగావాట్స్ అణు ఇంధన సామర్థ్యాన్ని రాబోయే 22 సంవత్సరాలలో సమకూర్చుకోవాలి'' అని జితేంద్ర సింగ్ ఉద్ఘాటించారు.

## రాష్ట్రపతి ముర్ము (మొదటి పేజీ తరువాయి)

భారత్ పాత్‌వేస్ ఆఫ్ ఫీస్ అండ్ ప్రొగెస్ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొననున్న రాష్ట్రపతి తిరిగి రాత్రి 8 గంటలకు రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు.. 21వ తేదీన రాష్ట్రపతి నిలయంలో జరగనున్న వివిధ కార్యక్రమాల్లో రాష్ట్రపతి పాల్గొంటారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు ఎట్ హోంలో పాల్గొనున్నారు. 22 తేదీన సాయంత్రం 4గంటలకు వరకు రాష్ట్రపతి నిలయంలో ఉండనున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము సాయంత్రం 4.15 గంటలకు అధికారులు, మంత్రులతో ఇతర ప్రముఖలతో గ్రూప్ ఫోటోలు దిగనున్నారు. అనంతరం ఆమె 4.30గంటలకు హకీంపేట్ ఎయిర్‌పోర్ట్ బయలుదేరి వెళ్లి అక్కడి నుంచి 4.40 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లనున్నారు.

**ఈనెల 20,21 తేదీల్లో హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి పర్యటన**

భారత ఉప రాష్ట్రపతి సి.పి.రాధ కృష్ణన్ ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. 20వ తేదీన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొనున్న ఆయన అక్కడి నుంచి నేరుగా రామోజీ ఫిలిం సిటీకి వెళ్లనున్నారు. అక్కడ జరగనున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆ రాత్రికి లోక్‌భవన్‌లో బస చేస్తారు. 21వ తేదీ ఉదయం కన్హా శాంతి వనంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ధ్యాన దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని అక్కడి నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకొని తిరిగి న్యూఢిల్లీ తిరిగి వెళ్లనున్నారు.

**ఉప రాష్ట్రపతి ఏర్పాట్లపై సమిక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ రెండు రోజుల హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు సంబంధిత ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు, ఉప రాష్ట్రపతి ప్రయాణించే మార్గంలో రహదారుల నిర్వహణ, ప్రోటోకాల్ తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. ఉప రాష్ట్ర పతి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సిఎస్ సబంధింత అధికారులను ఆదేశించారు.

## కొత్త పాలకవర్గాలు(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం, ఇప్పుడు డిసెంబర్ 22వ తేదీకి వాయిదా పడింది.

ముహూర్తాల కారణంతోనే మార్పు !

డిసెంబర్ 20వ తేదీన బాధ్యతలు చేపట్టడానికి సరైన ముహూర్తాలు లేవని, కాబట్టి తేదీని మార్చాలని కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధుల నుంచి ప్రభుత్వానికి పెద్ద ఎత్తున విజ్ఞప్తులు అందాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన పంచాయతీ రాజ్ శాఖ, సానుకూలంగా స్పందిస్తూ బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని రెండు రోజులు ముందుకు జరిపింది.

**ప్రమాణస్వీకార తేదీ : డిసెంబర్ 22, 2025.**

ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగే మొదటి సమావేశంలోనే నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. రాజ్యాంగం పట్ల విధేయత చూపుతూ, భగవంతుని సాక్షిగా లేదా సత్యనిష్ఠతో ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేయనున్నారు. ఈ మార్పుతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజున కొత్త సర్పంచులు,వార్డుసభ్యులు తమపాలనను అధికారికంగా ప్రారంభించనున్నారు.

### పంచాయతీ పోలింగ్ సరళిని ఎన్నికల కమిషనర్‌తో కలసి
# సిఎస్, డిజిపి పరిశీలన

**ప్రజాపక్ష/హైదరాబాద్ :** రాష్ట్రంలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం మూడవ విడత పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డిలు రాష్ట్ర ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో పాటు పరిశీలించారు.

ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్ టెక్నాలజీని మరింత విరివిగా ఉపయోగించి ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో టెక్నాలజీ వాడటం వల్ల గ్రామాలలో శాంతిభద్రత సమస్య తగ్గుతుందని, దీని వలన ప్రజలలో ఎన్నికలపై నమ్మకం కలిగి పోలింగ్ శాతం పెరిగే అవకాశముంటుందని ఆయన పేర్కొన్నారు. మొదటి, రెండు దశలలో జరిగిన పోలింగ్‌తో పోలిస్తే మూడవ దశలో పోలింగ్ శాతం పెరిగే అవకాముందని ఆయన తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్లను, అధికారులను, పోలింగ్‌సిబ్బందిని సిఎస్ అభినందించారు. కాగా గ్రామ పంచాయతీరాజ్ ఎన్నికలకు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ విస్తృత బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మందా మకరందం తదితరులు పాల్గొన్నారు.

## రాజీనామా చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

ఈ నిరసనలో పాల్గొన్నారు.

**ప్రతీకార రాజకీయాలు బట్టబయలు : ఖర్గే**

నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మోపిన మనీలాండరింగ్ ఆరోపణలను స్వీకరించడానికి ఢిల్లీ కోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రభుత్వం ఏజెన్సీలను దుర్వినియోగం చేస్తోందని, దీనిపై కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారని మండిపడింది. ఇక తమ బలం ఏమిటో పార్టీ కార్యకర్తలు చూపిస్తారని, తమ నాయకత్వంపై జరుగుతున్న 'ప్రతీకార రాజకీయాలను' బట్టబయలు చేస్తామని ఆ ప్రతిపక్ష పార్టీ ప్రతిజ్ఞ చేసింది. 'మేము రాజకీయంగా పోరాడుతున్నాము. పార్లమెంటు లోపల, వెలుపల, వీధుల్లో కూడా వారితో పోరాడుతూనే ఉంటాము. వారికి తగిన గుణపాఠం నేర్పిస్తాము' అని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విలేకరుల సమావేశంలో అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మరో ఐదుగురికి ఊరటనిస్తూ నేషనల్ హెరాల్డ్ కేసులో వారిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మోపిన మనీలాండరింగ్ ఆరోపణలను స్వీకరించడానికి ఢిల్లీ కోర్టు మంగళవారం నిరాకరించింది. ఎఫ్ఐఆర్ నుండి కాకుండా ఒక ప్రైవేట్ ఫిర్యాదు నుంచి దర్యాప్తు సంస్థ విచారణ జరిపిందని పేర్కొంది. కోర్టు తీర్పు మోదీ సర్కార్‌కు చెంప పెట్టులాంటిందని, అందువల్ల మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో పార్టీ నాయకులు కెసి వేణుగోపాల్, అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేష్, పవన్ ఖేరా కూడా పాల్గొన్నారు. బిజెపి సర్కార్ ఇలాంటి పనులు చేస్తే ప్రజలు సహించరని, మౌనంగా ఉండరని, ప్రజల నుండి అవమానాన్ని ఎదుర్కోవలసి వస్తుందని వారు తెలుసుకోవాలని ఖర్గే హెచ్చరించారు. తమ అగ్ర నాయకత్వాన్ని దర్యాప్తు సంస్థలు పిలిచినప్పటి నుండి కాంగ్రెస్ ఈ సమస్యపై రాజకీయంగా పోరాడుతోందని, పాదయాత్రలు నిర్వహిస్తోందని ఖర్గే గుర్తుచేశారు. గత 11 సంవత్సరాలుగా, మోదీ ప్రభుత్వం ఇడి, సిబిఐ, ఐటిలను దుర్వినియోగం చేసి బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి పూర్తి ప్రయత్నాలు చేసిన వారిలో 50 మందికి పైగా కీలక ప్రతిపక్ష నాయకులు ఉన్నారని కూడా ఆయన అన్నారు. నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక 1938లో ప్రారంభమైందని, దాని నినాదం 'స్వేచ్ఛ ప్రమాదంలో ఉంది, మీ సర్వశక్తులతో దానిని రక్షించండి' అని ఖర్గే పేర్కొన్నారు. తాజా కోర్టు తీర్పు మోదీ ప్రభుత్వం తన పార్టీ నాయకులపై మోపిన తప్పుడు ఆరోపణలు, కుట్ర, ప్రతీకార ఉద్దేశాన్ని పూర్తిగా బట్టబయలు చేసిందన్నారు. మోదీ ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలను కాంగ్రెస్ పార్టీ బట్టబయలు చేస్తుందని వేణుగోపాల్ ఉద్ఘాటించారు. ఏజెన్సీల దుర్వినియోగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలందరూ ఆగ్రహంతో ఉన్నారని, దేశవ్యాప్తంగా తమ బలాన్ని ప్రదర్శిస్తారని ఆయన అన్నారు.

## స్టే నిరాకరణ (మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది ఈ ఆదేశాలతో అభ్యంతరాలను తెలియజేసేందుకు ఈనెల 17తో ముగియనున్న గడువు పొడిగింపు జరుగుతుంది. పలు లంచ్‌మోషన్ పిటిషన్లపై జస్టిస్ విజయసేనారెడ్డి ఈ ఆదేశాలను జారీ చేశారు. జిహెచ్ఎంసి సమీపంలోని మున్సిపాల్టీలు, గ్రామాలను జిహెచ్ఎంసి పరిధిలోకి తీసుకొచ్చి డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంపు చేయడం ఏకపక్షమంటూ నాగేంద్ర ప్రకాష్ రెడ్డి ఇతరులు లంచ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. కొత్త డివిజన్ల ఏర్పాటుకు డిసెంబర్ 5న కమిషనర్‌కు నివేదిక అందిందని, మరో 4 రోజులకే ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని, జిహెచ్ఎంసి 650 చదరపు కిలోమీటర్ల ప్రస్తుత విస్తీర్ణం 2000 చదరపు కిలోమీటర్లకు పెంపునకు తీసుకున్న సమాచారం బహిర్గతం కాలేదన్నారు. డివిజన్లల్లో జనాభా సంఖ్యలో అనూహ్యమైన తేడాలున్నాయన్నారు. డివిజన్ల మ్యాప్‌లు అందుబాటులో లేవని, డివిజన్ల వారీగా జనాభా అందుబాటులో లేదన్నారు. ఈ వాదలను ఎజి సుదర్శన్‌రెడ్డి వ్యతిరేకించారు. చట్ట నిబంధనల మేరకే అంతా జరిగిందన్నారు. వాదనలపై న్యాయమూర్తి.. వార్డుల విభజన ప్రక్రియను నిలిపివేయడానికి నిరాకరించారు. స్టే ఆదేశాలు ఇవ్వబోమన్నారు. అయితే, వార్డుల విభజనలో పారదర్శకత అవసరమని చెప్పారు. వార్డుల వారీగా జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లోపు పబ్లిక్ డొమైన్లో అప్లోడ్ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆ తరువాత ప్రజలు, పిటిషనర్లు అభ్యంతరాలు చెప్పేందుకు రెండు రోజుల గడువు ఇవ్వాలని కూడా జిహెచ్ఎంసి కమిషనర్‌ను ఆదేశించారు.

## ఆధారాల్లేవ్ (మొదటి పేజీ తరువాయి)

కొట్టివేశారు. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనలు, దానికి అనుసంధానంగా రూపొందించిన నియమాల ప్రకారం ఎమ్మెల్యేల అనర్హతపై దాఖలైన పిటిషన్లను పరిశీలించామని, స్వచ్ఛందంగా తమ రాజకీయ పార్టీని వీడినట్టు ఆరోపణల నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లను పూర్తిగా రికార్డుల ఆధారంగా పరిశీలించి, సహజ, న్యాయ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూ, సంబంధిత పక్షాలన్నింటికీ వాదనలు వినిపించే సముచిత అవకాశాన్ని కల్పించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకున్నామని నర్సింహాచార్యులు వివరించారు. కాగా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపైన అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఇందులో ఎనిమిది మందికి సంబంధించి విచారణ ప్రక్రియ పూర్తయింది. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. అయితే ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్ కుమార్‌కు సంబంధించి అనర్హత పిటిషన్‌పైన గురువారం తీర్పు ఇవ్వనున్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ త్వరగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై 19న మరోమారు విచారణ జరగనుంది.

## హస్తం హవా
(మొదటి పేజీ తరువాయి)

సుమారు 53 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 4,159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, వాటిలో 394 సర్పంచ్ స్థానాలు, 7,908 వార్డు స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 3,752 గ్రామ పంచాయతీలు, 28,410 వార్డులకు మాత్రమే పోలింగ్ నిర్వహించారు. సర్పంచ్ పదవుల కోసం 12,652 మంది, వార్డు మెంబర్లుగా 75,725 మంది అభ్యర్థులు పోటీ చేశారు. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసి) కార్యాలయం నుంచి ఓటింగ్ సరళిని డ్యాష్ బోర్డు ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిణి రాణి కుముదిని పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఎన్నికల పరిశీలకుల నుంచి వివరాలు తెలుసుకోవడంతో పాటు, జిల్లాల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితిని నిరంతరం పరిశీలించారు. ఏకగ్రీవాలు, నామినేషన్లు దాఖలు కాని స్థానాలను మినహాయించి, మిగిలిన అన్ని చోట్ల ఫలితాలు చకచకా విడుదలవుతున్నాయి. రాత్రి వరకు పూర్తి స్థాయి ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మూడో విడతలోనూ కాంగ్రెస్ హవాపై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం

పంచాయతీ ఎన్నికలు–2025 మూడో విడత ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం కొనసాగిందని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. పల్లెలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఘన విజయం సాధించడం గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై వ్యక్తం చేసిన విశ్వాసానికి స్పష్టమైన ప్రతిబింబమని తెలిపారు. పంచాయతీ ఎన్నికల మూడో విడత ఫలితాలు ప్రతిపక్షాలకు చెంపపెట్టులా మారాయని, తెలంగాణ గ్రామీణ రాజకీయాల్లో స్పష్టమైన మార్పుకు ఇవి సంకేతమన్నారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ గ్రామస్థాయి వరకు విస్తరించిన ప్రచారం పార్టీకి అనుకూలంగా మారిందన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే విధంగా వచ్చిన ఈ తీర్పు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజల్లో ఏర్పడిన సంతృప్తిని మరోసారి రుజువు చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండేళ్లుగా అమలవుతున్న ప్రజాపాలన, సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమన్వయపరిచిన ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగించిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసాన్ని మరింత పెంచాయని, ప్రజలను నేరుగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధానం పార్టీ బలాన్ని పటిష్టం చేస్తోందన్నారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి అనే నినాదానికి ప్రజలు పట్టం కట్టారని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఘన విజయం దీనికి స్పష్టమైన ప్రతీక అని తెలిపారు. మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం గ్రామ పాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచిస్తోందన్నారు. ఈ విజయం పార్టీపై మరింత బాధ్యతను పెంచిందని, గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల తొలి, రెండో, మూడో విడతల ఫలితాలు ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి అద్దం పడుతున్నాయని, ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకంగా నిలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేడు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం గురువారం హైదరాబాదు హిమాయత్‌నగర్‌లోని అమృత ఎస్టేట్స్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో జరుగనుందని రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌సి, ఐప్సో అడ్వైజరీ కమిటీ చైర్మన్ సి.కె. యాదవ రెడ్డి, జాతీయ అధ్యక్ష వర్గ సభ్యులు డాక్టర్ డి.సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆహ్వానితులు పాల్గొంటారన్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో దేశంలో నెలకొని ఉన్న రాజకీయ, సామాజిక, యుద్ధ వ్యతిరేక, శాంతి ఆవశ్యకత, పరిస్థితుల గురించి, రాజ్యాంగ పరిరక్షణ, మానవ హక్కులు, మతసామరస్యం,సెక్యులరిజం, శాంతి, ప్రజాస్వామ్యం తదితర అంశాలపై చర్చించనున్నట్లు కెవిఎల్ వెల్లడించారు.

## ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో భారత్‌ది అగ్రస్థానం

- పసుపు రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు




ప్రజాపక్షం/హైదరాబాద్: పసుపు రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాల్సిన బాధ్యత పసుపు బోర్డు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనుకూల వాతావరణంతో పాటు శ్రమించే రైతులు ఉన్నప్పటికీ ధరల హెచ్చు, తగ్గుల కారణంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఒక క్వింటా పసుపు ఉత్పత్తికి రూ.8వేల నుంచి రూ.9వేల వరకు ఖర్చు చేస్తుండగా, మార్కెట్ ధరలు మాత్రం రూ.12వేలకు అటు ఇటుగా మాత్రమే ఉండటం రైతులను నిరుత్సాహపరుస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పసుపు సాగులో భారత్ అగ్రస్థానంలో ఉందని, పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని, పసుపును అధికంగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి అని, నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంతాలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. సిఐఐ తెలంగాణ, నేషనల్ టర్మరిక్ బోర్డు సంయుక్తంగా హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన 'టర్మరిక్ వాల్యు చైన్ సమ్మిట్ 2025'లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పండే పసుపును ప్రపంచ మార్కెట్లతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లేందుకు సమిష్టి చర్యలు అవసరమన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో అగ్రి విజన్ 2047ను ప్రకటించామని గుర్తుచేశారు. పసుపు మనకు కొత్త పంట కాదని, అది మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైందని వివరించారు. వంటింటికే పరిమితం కాకుండా, మెడిసిన్, న్యూట్రాస్యూటికల్స్, ఫంక్షనల్ ఫుడ్స్ వంటి రంగాల్లో పసుపు వినియోగం పెరుగుతోందన్నారు. ఆర్మూర్ పసుపుకు జిఐ ట్యాగ్ రావడం తెలంగాణ రైతులకు గర్వకారణమన్నారు. నిజామాబాద్ రైతుల చిరకాల ఆకాంక్ష అయిన నేషనల్ టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అది పూర్తిస్థాయిలో కార్యాచరణలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బోర్డు కార్యాలయ పరిమితుల్లో కాకుండా, రైతులకు పాలసీ దిశ చూపే సంస్థగా పనిచేయాలని, పరిశోధనను రైతు పొలాలకు తీసుకెళ్లాలని, మార్కెటింగ్, బ్రాండింగ్, ఎగుమతుల్లో నాయకత్వం వహించాలని కోరారు. నేషనల్ టర్మరిక్ బోర్డు విజన్ 2047కు అనుగుణంగా పనిచేసి, ధరల స్థిరత్వం, ముందస్తు మార్కెట్ సంకేతాలు రైతులకు అందించాలన్నారు. ప్రామాణిక మాయిశ్చర్ మీటర్లు, ఒకే రకమైన తేమ ప్రమాణాలు, పారదర్శక మార్కెట్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. రేర్ పరిధిలో అగ్రి విజన్‌ను ప్రతిపాదించామని, అధిక కర్క్యూమిన్ రకాలను రైతులకు అందించడంతో పాటు, నాణ్యమైన టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి, ప్రపంచ ప్రమాణాలకు తగిన పసుపు ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలని అన్నారు. విజన్ 2047 ప్రకారం ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌లో పసుపును భాగం చేయాలన్నారు. ఆయిల్ పామ్ వంటి పంటల్లో చెట్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో పసుపు వంటి స్పైస్ పంటలను అంతరపంటలుగా సాగు చేయడం ద్వారా రైతులకు తక్కువ రిస్క్‌తో అధిక ఆదాయం లభిస్తుందని చెప్పారు. రైతులు ముడి పసుపును మాత్రమే అమ్మకుండా, విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని సూచించారు. పసుపు భవిష్యత్ ముడి పంటలో కాదని, విలువ ఆధారిత ఉత్పత్తుల్లోనే ఉందని స్పష్టం చేశారు. పసుపు ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, న్యూట్రాస్యూటికల్స్, ఇమ్యునిటీ ఉత్పత్తులు, కాస్మోటిక్స్, కర్క్యూమిన్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి ఉత్పత్తుల తయారీకి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. తద్వారా డిమాండ్ పెరిగి, రైతుల ఆదాయం పెరుగుతుందని, అప్పుడే తెలంగాణ రాష్ట్రం పెట్టుకున్న విజన్ 2047లోని అగ్రి విజన్ లక్ష్యాలకు చేరువగా అవుతామన్నారు. ఈ సమావేశంలో టర్మరిక్ బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, టర్మరిక్ బోర్డు కార్యదర్శి భవానీ , సిఐఐ తెలంగాణ చైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, అగ్రి యూనివర్సిటీ మాజీ విసి ప్రవీణ్ రావు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు గంగాధర్, సింథైట్ ఇండస్ట్రీస్ స్ట్రాటజిక్ సోర్సింగ్ హెడ్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.




గ్రామీణ ఉపాధి పథకాన్ని రద్దు చేసి ఆ స్థానంలో విబి-జిఆర్ఎఎంజిను తీసుకురావడాన్ని నిరసిస్తూ న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీరాజా. కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత పథకాన్నే కొనసాగించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నేతన్నల భద్రత, గ్రామీణ బ్యాంకుల పరిరక్షణే లక్ష్యం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలైన హ్యాండ్‌లూమ్ కళాకారుల సంక్షేమం, గ్రామీణ బ్యాంకుల పరిరక్షణ కోసం పార్లమెంట్ వేదికగా పోరాడుతానని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారం జరిగిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ అండ్ హ్యాండిక్రాఫ్ట్స్ ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సదస్సుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా రంగాల ప్రతినిధులు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషిస్తూ, ప్రభుత్వ విధానాల వల్ల తలెత్తుతున్న ఇబ్బందులపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా హ్యాండ్‌లూమ్ రంగానికి సంబంధించి కళాకారుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఏమాత్రం సరిపోవని, అదనపు నిధుల కేటాయింపు ద్వారానే ఈ రంగానికి పూర్వవైభవం వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేవలం నిధులు మాత్రమే కాకుండా, ఈ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కళాకారులకు ఇఎస్‌ఐ, ఇపిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాలను వర్తింపజేయడం అత్యవసరమని, తద్వారా వారి భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. సంప్రదాయ కళలను నమ్ముకున్న వారి కుటుంబాలకు కనీస ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వెన్నెముకగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ బ్యాంకులను ఐపిఓలకు తరలించడం లేదా ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు వంటిదని విమర్శించారు. రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తూ గ్రామీణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ బ్యాంకుల అస్తిత్వాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనలను, సంప్రదాయ వృత్తిదారుల మొరను సంబంధిత కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని, వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పార్లమెంటులో గళం వినిపిస్తానని ఎంపి చామల ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తి రాజ్యాంగానికి విరుద్ధం: కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపైన స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి విరుద్ధమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేసిందని, దేశ అత్యున్నత న్యాయస్థానాలపైనే కాదని, చివరకు రాజ్యాంగంపైన కూడా రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం గౌరవం లేదని మరోసారి తేలిపోయిందని ఆయన బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు సాక్షాత్తు ఫిరాయింపు ఎమ్మెల్యేలు అనేక సార్లు బాహాటంగా ప్రకటించినప్పటికీ వారిని కాపాడేందుకు ప్రయత్నించడం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమన్నారు. ఉప ఎన్నికలకు భయపడే ఫిరాయింపు ఎమ్మెల్యేలపైన చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తోందన్నారు. సాంకేతిక అంశాన్ని అడ్డుపెట్టుకుని గోడ దూకిన ఎంఎల్‌ఎల ను తాత్కాలికంగా కాపాడినట్టు కాంగ్రెస్ సంబరపడినప్పటికీ ప్రజాక్షేత్రంలో వారిని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎప్పుడో అనర్హులుగా ప్రకటించారని కెటిఆర్ అన్నారు.

### యాంటీ డిఫెక్షన్ నియమాలు పక్కన పెట్టారు: హరీశ్‌రావు

ఢిల్లీలో రాజ్యాంగ నైతికతపై గొప్ప ఉపన్యాసాలనిస్తూ, తెలంగాణలో మాత్రం అదే రాజ్యాంగాన్ని నిర్లజ్జగా ధిక్కరించడం కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీల నిజ స్వరూపమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. పార్టీ మారిన ఎంఎల్‌ఎల విషయంలో రా జ్యాంగం స్పష్టంగా నిర్దేశించిన యాంటీడిఫెక్షన్ నియమాలను పూర్తిగా పక్కన పెట్టిందన్నారు.

### ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు : వినోద్ కుమార్

స్పీకర్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని బిఆర్ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వయంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారినట్టు చెబుతుంటే, స్పీకర్ మాత్రం పార్టీ మారలేదనడం ఎంత వరకు సరైందని అన్నారు. 10వ షెడ్యూల్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని, పార్లమెంట్‌లో వెంటనే పార్టీ ఫిరాయింపులపై ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

### హైకోర్టులో న్యాయపోరాటంచేస్తాం: వివేకానంద

ఫిరాయింపు ఎంఎల్‌ఎల అంశంలో స్పీకర్ తీర్పు పైన తాము హైకోర్టులో న్యాయపోరాటం చేస్తామని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద అన్నారు. కేవలం ఐదుగురు ఎంఎల్‌ఎల విషయంలోనే తీర్పు ఇచ్చారని, మిగిలిన ఐదుగురు ఎంఎల్‌ఎల అంశంపైన సమాధానం ఇవ్వలేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ కల్వకుంట్ల సంజయ్‌తో కలిసి వివేకానంద బుధవారం మీడియాతో మాట్లాడుతూ కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలో నోటీసులు ఇచ్చినప్పటికీ వాళ్ళు స్పందించలేదని, వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

### రాజ్యాంగ, ప్రజాస్వామ్య హత్య: రాంచందర్ రావు

ఫిరాయింపు ఎంఎల్‌ఎల విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ, ప్రజాస్వామ్య హత్య అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఈ నిర్ణయం రాజ్యాంగానికి పూర్తిగా విరుద్ధమన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తీసుకువచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని, ఆ పార్టీనే ఆ చట్టానికీ, రాజ్యాంగానికీ గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తోందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## బిజెపి – ఆర్‌ఎస్‌ఎస్ సైద్ధాంతిక ధోరణి ప్రతిబింబిస్తోంది

ఎంజిఎన్ఆర్ఇజిఎ స్థానంలో విబి-జిఆర్ఎఎంజిను తీసుకురావడంపై డిహెచ్‌పిఎస్ వ్యతిరేకం

ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' (గ్రామీణ్) బిల్లు2025 (విబిజిఆర్ఎఎంజి)ను తీసుకురావడాన్ని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని డి హెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. పని చేసే హక్కును కల్పించాలనే సార్వత్రిక డిమాండ్ ఆధారిత చట్టమైన ఎంఎన్ఆర్ఇజిఎ మౌలిక స్వభావాన్ని 'గ్రామీణ్ బిల్లు' లో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. డిమాండ్‌కు తగినట్టుగా నిధులను కేటాయించాల్సిన బాధ్యతల నుండి తప్పుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 రోజుల నుండి 125రోజుల కు ఉపాధి రోజులను పెంచుతామన్న కేంద్ర ప్రభుత్వ వాదన కేవలం పైమెరుగు చర్య లాంటిదని పేర్కొన్నారు. ఉపాధి కార్డులను హేతుబద్ధీకరిస్తున్నామనే పేరుతో పెద్ద సంఖ్యలో గ్రామీణ కుటుంబాలను మినహాయించేందుకు ఈ బిల్లు ద్వారాలను తెరుస్తోందన్నారు. వేతనాల చెల్లింపుల విషయంలో ప్రధాన రాష్ట్రాలతో 60:40 నిష్పత్తిలో పంచుకోవాలనే ఏర్పాటును తీసుకురావడం ద్వారా ఈ బిల్లు కేంద్రం బాధ్యతను తగ్గిస్తోందని, నిరుద్యోగ భృతి ని, అలాగే రాష్ట్రాలకు ఆలస్యమైనందుకు నష్టపరిహారం ఇవ్వాల్సిన బాధ్యతను కూడా రాష్ట్రాలకు బదిలీ చేస్తోందని, తద్వారా నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి పాత్ర ఇవ్వకపోగా, రాష్ట్రాలపైన అసాధారణమైన ఆర్థిక భారాన్ని మోపుతోందని తెలిపారు.కేంద్ర, రాష్ట్రాల వారీగా వ్యయ పరిమితులను విధిస్తూ 'ప్రామాణిక కేటాయింపు'ను ప్రవేశపెట్టడం, అదనపు వ్యయాలను రాష్ట్రాలే భరించాల్సి రావడం వల్ల ఉపాధి హామీ పథకం ప్రజల్లోకి వెళ్ళే అవకాశాలు బాగా కుదించబడతాయని, కేం ద్రం జవాబుదారీతనం కూడా నీరు గారుతుందని అనిల్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పథకానికి ఎంఎన్ఆర్ఇజిఎగా వున్న పేరును జి ఆర్ఎఎంజి (జిరామ్‌జి)గా మార్చాలన్న ఆలోచన వెనుక బిజెపి ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక ధోరణి ప్రతిబింబిస్తోందని ఆరోపించారు.

## రిజర్వేషన్ల పెంపు కోసం రాజ్యాంగాన్ని సవరించాలి

బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిల ఆకాంక్షను గౌరవించి, రిజర్వేషన్ల పెంపుకోసం రాజ్యాంగాన్ని సవరించి, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిసి సంఘాల నేతలు కోరారు. తెలంగాణ రాష్ట్ర అ సెంబ్లీలో చేసిన చట్టాన్ని ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో బిసి సంఘాల నేతలు బుధవారం ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రి వీరేంద్రకుమార్‌ను కలి సి ఐదు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బిసిలు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, దాని ద్వారా మొదటిసారి సమగ్ర కులగనన చేపట్టారని, తదుపరి బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయరంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో బిజెపి, బిఆర్ఎస్, సిపిఐ, ఎంఐఎం, టిజెఎస్ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా చట్టాన్ని ఆమోదించి ఢిల్లీకి పంపించారని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం సాధ్యం కాదని న్యాయస్థానాలు అడ్డుపడుతున్నాయని, సుప్రీం కోర్టు తీర్పు దరిమిలా రిజర్వేషన్లు 50 శాతం దాటడానికి వీలులేదు కాబట్టి కేంద్ర ప్రభుత్వము తక్షణమే జోక్యం చేసుకొని రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాలలోనే రాజ్యాంగాన్ని సవరించి 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక శాతం బిసి జనాభా ఉన్న విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగంలో తీరని అన్యాయం జరుగుతుందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో చేసిన చట్టానికి బిఆర్ఎస్ పార్టీ కూడా మద్దతు తెలిపిందని, అసెంబ్లీలో చేసిన చట్టం 8 నెలలు గడుస్తున్నప్పటికీ ఆమోదం పొందడం లేదని, అందుకే ఈ పార్లమెంటు సమావేశాలలో బిఆర్ఎస్ పార్టీ తరపున పార్లమెంటులో ప్రైవేటు బిల్లును ప్రవేశపెట్టామని, తాము పెట్టిన ప్రైవేటు బిల్లుకు కూడా కేంద్ర ప్రభుత్వం మద్దతు తెలిపి, బిసి బిల్లు ఆమోదానికి కృషి చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు. వచ్చే ఏడాది నుండి దేశవ్యాప్తంగా కులగణన.. కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ బిసి జెఎసి నేతలు చెప్పిన డిమాండ్లను విన్న కేంద్రమంత్రి వీరేంద్రకుమార్ స్పందిస్తూ బిసి రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, ఇందిరా సహని కేసులో సుప్రీం కోర్టు తీర్పు సామాజిక రిజర్వేషన్లు 50 శాతం పరిమితి మించొద్దని తీర్పు ఇచ్చినందున కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల నుండి బిసి రిజర్వేషన్లు పెంచాలని వచ్చిన విజ్ఞప్తులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దేశంలో అందరికీ సమన్యాయం జరగాలని తమ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే వచ్చే ఏడాది నుండి దేశవ్యాప్తంగా జనగణలో కూడా కులగణనా చేపడుతున్నామని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్ అంశాన్ని త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదితో చర్చిస్తానని ఆయన ఈ సందర్భంగా బిసి నేతలకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజి ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం గౌడ్, బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్ పెరిక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఐకానిక్‌గా హైకోర్టు భవన నిర్మాణం

నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి: స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సుమారు రూ. 2583 కోట్ల వ్యయంతో 36.52లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న హైకోర్టు నూతన భవనం రాష్ట్ర ఐకానిక్ బిల్డింగ్‌లా ఉండాలని, అధికారులు అందుకు తగ్గట్టుగా కృషిచేసి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు వికాస్ రాజ్ బుధవారం రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న నూతన హైకోర్టు భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్లు రాజేశ్వర్ రెడ్డి, లింగారెడ్డితో పాటు క్షేత్రస్థాయి ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు, కన్సల్టెంట్లు పాల్గొన్నారు. పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం వికాస్ రాజ్ సంబంధిత అధికారులతో పాటు సంస్థలకు కీలక ఆదేశాలను జారీ చేశారు. పనుల్లో జాప్యం కలగకుండా ఉండటానికి కన్సల్టెంట్లు డ్రాయింగ్ షెడ్యూల్‌ను ముందుగానే అందించాలని, కాంట్రాక్ట్ సంస్థ అవసరమైన సిబ్బందిని, యంత్రాలు, సామాగ్రిని సిద్ధం చేసుకొని నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలన్నారు. జ్యుడీషియల్ అధికారుల సూచనల మేరకు సవరించిన ప్లాన్‌లను వెంటనే సిద్ధం చేసి, అనుమతులు తీసుకోవాలని, అలాగే, జోన్ 2కి సంబంధించిన అటవీ శాఖ అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని వికాస్ రాజ్ సూచించారు.

## రైల్వే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం ఎఫెక్ట్

హర్షం వ్యక్తం చేసిన సర్వీస్ కాంట్రాక్టర్లు



ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో విధులు నిర్వహిస్తున్న 20 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇది శుభవార్త. నాలుగు నెలల నుంచి జీతాలు లేకుండా పనిచేస్తున్న వీరికి త్వరలో జీతాలు చెల్లించేందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ్య సానుకూలంగా స్పందించారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న 20 వేల మంది ఔట్ సోర్సింగ్ వర్కర్లు మూడు నెలల నుంచి జీతాలు లేక అల్లాడుతున్నారనే అంశంపై 'ప్రజాపక్షం' లో ఈ నెల 12న ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో చర్చించారు. త్వరలో కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు మంజూరు చేసేందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. రైల్వేలోని ఆయా విభాగాల్లో సర్వీస్ కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లులు చెల్లించాలని దక్షిణ మధ్య రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైల్వే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు బుధవారం రైల్ నిలయంలో జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్యను కలిసి చర్చించారు. దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ, గుంతకల్, నాందేడ్ డివిజన్ పరిధిలో ప్రతి రోజు సుమారు 20 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సేవలను అందిస్తున్నారన్నారని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింకపోవడం వల్ల తాము ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక పోతున్నామని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పనులు మానేస్తామని అంటున్నారని జిఎం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి త్వరలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించేందుకు అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని వారికి హామి ఇచ్చారు. దీంతో రైల్వే సర్వీస్ సెక్షన్‌లలో పనిచేస్తున్న 20 వేల మంది ఔట్‌సోర్కింగ్ ఉద్యోగులకు ఊరట లభించినట్లయ్యింది. జిఎం ని కలిసిన వారిలో దక్షిణ మధ్య రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ జైపాల్ రెడ్డి కార్యదర్శి మోహన్ రెడ్డి కోశాధికారి భాస్కర్ రెడ్డి ఉపాధ్యక్షులు రాజిరెడ్డి లతోపాటు రైల్వే అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అఖిలభారత అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్‌లు ఉన్నారు.

## సివిల్ సర్వెంట్లు క్రమశిక్షణతో దేశ సేవ చేయాలి

రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్



ప్రజాపక్షం/హైదరాబాద్: సివిల్ సర్వెంట్లు అంకిత భావం, క్రమశిక్షణతో పా టు నైతిక విలువలతో దేశ సేవ చేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. డా.మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో బుధవారం తెలంగాణ ప్రభు త్వ ప్రధాన కార్యదర్శి, ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఉపాధ్యక్షురాలు ఎ.శాంతి కుమారి నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్లతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా యకత్వం, బాధ్యతలు, ప్రజాసేవ ప్రాముఖ్యతపై ట్రెయినీ సివిల్ సర్వెంట్లతో తన అభిప్రాయాలను పంచుకున్నారు. స్నేహపూర్వక వాతావరణంలో మంత్రి హైదరాబాద్ ప్రసిద్ధ బిర్యానీపై సరదాగా చేసిన వ్యాఖ్యలు శిక్షణార్థుల్లో నవ్వు లు, చప్పట్లు రప్పించి కార్యక్రమానికి ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. మంత్రి అజారుద్దీన్ ఒక క్రికెట్ బ్యాట్‌పై సంతకం చేయగా, శిక్షణార్థులు ఎంతో ఉత్సాహంతో స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ట్రెయినీ సివిల్ సర్వెంట్లు పలు క్రీడా, వినోదాత్మక పోటీల్లో 'క్యాన్‌డూ' భావనతో చురుకుగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన అభ్యర్థులకు మంత్రి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధికారులు, అధ్యాపకులు, ఇన్‌స్టిట్యూట్ శిక్షణార్థులు పాల్గొన్నారు.



## సమన్వయంతో పనిచేసిన అధికారులకు, సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : మూడు విడతల్లో జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిసాయని ఇందుకు సహకరించిన అధికారులకు, జిల్లా ప్రజలకు ఎస్పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో 7 సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మర తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి బుధవారం వరకు ఆయా గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి రూ.1.20లక్షలతోపాటు, 144 సెక్షన్‌లో దాదాపు రూ.10లక్షల 53 వేల విలువైన 1740 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా లైసెన్స్ కలిగి ఉన్న 79 తుపాకులను తాత్కాలిక స్వాధీనం చేసుకోవడంతోపాటు గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి ముందస్తుగా 429 కేసుల్లో 1488 మందిని బైండోవర్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

## గ్రామ అభివృద్ధికి కృషి చేయాలి : సిపిఐ



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం నర్సాపురం గ్రామ శాఖ స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశం బుధవారం ఓర్సు స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి పాల్గొని మాట్లాడుతూ నర్సాపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చివరగా బిఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపుకు కృషి చేసిందని అన్నారు. ఈ గ్రామంలో అనేకమైన సమస్యలు ఉన్నందున వాటిని పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కావటి మంజుల ఉప్పలయ్య దృష్టికి పలు సమస్యలను భీమలింగం కాల్వ ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేయాలని, బలహీన వర్గాల గృహాల సర్టిఫికెట్లు పంపిణీ చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన కావటి మంజుల ఉప్పలయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్లంకి మహేష్, మారోజు నరసింహాచారి, వడ్డేపల్లి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహ్మా

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్/మేళ్లచెరువు/చింతలపాలెం/ మఠంపల్లి/ పాలకవీడు/ గరిడేపల్లి/నేరేడుచర్ల:** ప్రశాంత వాతావరణంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. బుధవారం హుజూర్‌నగర్, మేళ్లచెరువు, చింతలపాలెం, మఠంపల్లి, పాలకవీడు, గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో ప్రతిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని ఆయన అన్నారు. హుజూర్‌నగర్, వేపల సింగారం, మేళ్లచెరువు, వేపలమాదారం, మఠంపల్లి మండలం రఘునాధ పాలెం, బిల్యానాయక్ తండా, యాతవాకిళ్ల గ్రామాలలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఆంక్షలను పటిష్టంగా అమలు చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. రూట్ మొబైల్స్, స్లైకింగ్ పోర్స్, సెక్టార్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అధికారులను అప్రమత్తంగా ఉండి, ఎన్నికల ప్రక్రీయకు విఘాతం కలగకుండా పనిచేయాలని అదేశించారు. 21 గ్రామాలలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రీయను పరిశీలించారు. ఆయన వెంట కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐలు, అధికారులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** పోలింగ్ నిర్వహణకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ హెచ్చరించారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా బుధవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం కోరుట్ల గ్రామం పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి జోన్6 డి.ఐ.జి యల్.ఎస్ చౌహన్ తో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిసరాలలో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అదనపు బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకువాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల పరిధిలో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుంపులుగా గుమికూడరాదని పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలో ఉంటుందని తెలిపారు. అరె వెంట పోలీసు అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గుడిపూడి తండలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భూక్యా హరిలాల్ (28) తన ఇంట్లో సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా చార్జర్ వైర్ పేలి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. అతనిని కాపాడేందుకు ఇంట్లో వారు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రయత్నంలో అతనిని కాపాడబోయిన మరికొందరు గాయపడ్డారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు ఉండడంతోనే తరుచూ ఇలాంటి సంఘటనలు గ్రామంలో జరుగుతున్నాయని తండా వాసులు చెబుతున్నారు. ట్రాన్సఫార్మర్ బంద్ చేసిన విద్యుత్ సరఫరా అవుతుందని దీంతో ఇంట్లో విద్యుత్ హెచ్చుతగ్గులు వచ్చి ప్రమాదాల బారినపుడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం విద్యుత్ అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకపోయినా మరమ్మత్తు చేయలేదని వారు ఆరోపించారు. ఇదిలా ఉంటే విద్యుత్ అధికారులు మాత్రం అతని ఇంట్లో విద్యుత్ షాక్‌తోనే మృతి చెందాడని చెబుతున్నారు. హరిలాల్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆగ్రహించిన తండావాసులు మండల కేంద్రంలో ధర్నాకు దిగారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## గంట్ల వెంకట్ రెడ్డి స్థూపావిష్కరణ

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని చల్మెడ గ్రామ సిపిఐ నాయకులు గంట్ల వెంకట్ రెడ్డి (63) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం జరిగిన దశదిన కర్మ సందర్భంగా వెంకట్ రెడ్డి స్మారక స్థూపాన్ని సిపిఐ రాష్ట్ర సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించి పూలమాలలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ గంట్ల వెంకట్ రెడ్డి గ్రామ పోస్టుమాస్టర్ గా 25 సంవత్సరాలు పని చేస్తూ పార్టీ సభ్యులుగా ఉంటూ గ్రామంలో పార్టీ ప్రజా సంఘాల అభివృద్ధికి కృషి చేసినారు.వారి తండ్రి గంట్ల నర్సిరెడ్డి నిజాం కు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో పోరాడారని గుర్తు చేశారు.వగంట్ల భగవాన్ రెడ్డి సిపిఐ మునుగోడు మండల కార్యదర్శిగా 15 సంవత్సరాలుగా గ్రామ సర్పంచిగా రెండుసార్లు ఎన్నికై గ్రామ అభివృద్ధికి పార్టీకి ఎనలేని సేవలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బిలాలయ్య,నారాయణపూర్ మండల నాయకులు డి నరేందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ బండమీది యాదయ్య,ఉప సర్పంచ్ మల్లేష్ యాదవ్,గ్రామ కార్యదర్శి నందిపాటి అశోక్,యూత్ కార్యదర్శి దశరథ,ముంత నరసింహ,పగిళ్ల యాదయ్య,వనం దాసు,గంట్ల ప్రవీణ్,గంట్ల వేణు తదితరులు పాల్గొన్నారు.




# సూర్యాపేట జిల్లాలో 89.25 శాతం పోలింగ్

### తుది విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

### ఈ విడతలో కూడా హస్తానిదే హవా





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో బుధవారం జరిగిన తుది విడత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్‌నగర్ రూరల్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో 124 గ్రామ పంచాయితీ సర్పంచ్ పదవికి, 1061 వార్డు సభ్యుల ఎన్నికకు ఎన్నికల అధికారులు పోలింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి మొదలైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. మొత్తం ఏడు మండలాల పరిధిలో 1,92,617 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 93,658, మహిళలు 98,952 ఉండగా పురుషులు 83,390, మహిళలు 88,507 మొత్తం 1,71,903 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 89.25 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె నరసింహలు ఆయా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఆయా మండలాల్లో నమోదైన పోలింగ్ శాతం వివరాలు...

ఎన్నికల అధికారులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపాలెం మండలంలో అత్యధికంగా 90.99 శాతం పోలింగ్ నమోదైంది. గరిడేపల్లి మండలంలో 88.84 శాతం, హుజూర్‌నగర్ రూరల్‌లో 90.78 శాతం, మఠంపల్లిలో 89.91 శాతం, మేళ్ళచెర్వు 86.59 శాతం, నేరేడుచర్ల 88.10 శాతం, పాలకవీడు 90.27 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.

తొలి, మలి విడతలో పంచాయితీ ఎన్నికల్లో హస్తం పార్టీ బలపర్చిన అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించగా ఈ తుది విడత ఎన్నికల్లో కూడా హస్తం పార్టీ బలపర్చిన అభ్యర్థులే తమ హవాను కొనసాగించారు. తుది విడత ఎన్నికల్లో మొత్తం 146 గ్రామ సర్పంచ్‌లకు, 1318 వార్డు సభ్యుల ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేయగా ఇందులో నామినేషన్ల ప్రక్రియ ముగింపుకు ముందే 22 సర్పంచ్, 257 వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా గ్రామ పంచాయితీలకు, వార్డు సభ్యులకు నిర్వహించిన ఎన్నికల్లో 75 శాతంకు పైగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు.

## ముగిసిన పంచాయతీ పోరు

### యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.56 శాతం భారీ పోలింగ్

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి** : జిల్లాలో రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికల కోలాహలం మూడవ విడతతో ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన ఈ చివరి విడత పోలింగ్‌లో ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు వెల్లడించిన వివరాల ప్రకారం మూడవ విడతలో రికార్డు స్థాయిలో 92.56 శాతం పోలింగ్ నమోదైంది. పకడ్బందీ ఏర్పాట్లు, అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ అంతా ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన కూడా చోటుచేసుకోకుండా అత్యంత పారదర్శకంగా పూర్తయింది. ఈ భారీ ఎన్నికల క్రతువును విజయవంతం చేయడంలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు మరియు పోలీస్ యంత్రాంగం అంకితభావంతో పనిచేసిందని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో ప్రతి అధికారి సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ముగిసినా నిబంధనల విషయంలో మాత్రం అధికారులు కఠినంగానే ఉన్నారు. గెలుపొందిన అభ్యర్థులు అతి ఉత్సాహంతో విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ సభలు లేదా ఊరేగింపులు నిర్వహించవద్దని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల కోడ్) ఇంకా అమలులోనే ఉందని, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ర్యాలీలు తీస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# ఫలితాల ప్రకటనలో జాప్యం చేయొద్దు

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన నల్లగొండ జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/ నల్లగొండ:** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం జిల్లా, దేవరకొండ డివిజన్ పరిధిలోని దేవరకొండ మండలం, తాటికల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ కోసం చేసిన ఏర్పాట్లు,బ్యారికేడింగ్,ఓటింగ్ కంపార్ట్మెంట్లు,హెల్ప్ డెస్క్,ఫస్ట్ ఎయిడ్, తదితర ఏర్పాట్లు పరిశీలించి అప్పటివరకు పోలైన ఓట్లు,పోలింగ్ శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటలకు ఎట్టి పరిస్థితులలో ఓట్ల లెక్కింపు ప్రారంభం కావాలని ,ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఫలితాల ప్రకటనలో జాప్యం చేయవద్దని ఆర్ ఓ లకు తెలిపారు .సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు.కౌంటింగ్ కేంద్రంలోకి ఎన్నికల విధులు నిర్వహించే వారు తప్ప ఇతరులెవ్వరిని అనుమతించవద్దని చెప్పారు.కౌంటింగ్,ఫలితాల వెల్లడి,అవసరమైతే రీకౌంటింగ్ నిర్ణయం పూర్తిగా స్టేజ్ 2 ఆర్ ఓ దేనని అన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎక్కడైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే పోలీస్‌లకు తెలియజేయాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియ మొత్తం సి సి టి వి ల పర్యవేక్షణలో చేయాలన్నారు. కౌంటింగ్ సరళిని తనతో పాటు,జిల్లా ఎన్నికల పరిశీలకులు,రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరుగుందన్నారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి ,జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ తహసిల్దార్ ,ఆర్‌ఓలు ఉన్నారు.

## పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్ గర్జన!

### బిజెపి కుట్ర రాజకీయాలపై 'ముఖద్వారం' వద్ద నిరసన

### ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి** : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ బుధవారం పార్లమెంట్ వేదికగా నిరసన గళం విప్పింది. పార్లమెంట్ ప్రధాన ప్రవేశ ద్వారం (ముఖద్వారం) వద్ద కాంగ్రెస్ ఎంపీలు 'సత్యమేవ జయతే' అంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 'రాజకీయంగా ఎదుర్కోలేకే దర్యాప్తు సంస్థల ప్రయోగం. న్యాయస్థానాల్లో బిజెపికి చుక్కెదురు కాక తప్పదు అన్నారు. ఈడీ, సీబీఐ, ఇన్కమ్ టాక్స్, ఎన్నికల కమిషన్ వంటి స్వతంత్ర సంస్థలను బిజెపి తన రాజకీయ అవసరాలకు పావులుగా వాడుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాల్సిన సంస్థలను ప్రతిపక్షాలను అణచివేయడానికి ఉపయోగిస్తున్నారని ఆయన మండిపడ్డారు. గతంలోనే నేషనల్ హెరాల్ కేసులో రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టమైందని ఎంపీ గుర్తు చేశారు. అయినప్పటికీ, రాజకీయ కక్షతో ఈడీ ద్వారా కోర్టులో పిటిషన్ దాఖలు చేయించారని, అయితే తగిన ఆధారాలు లేవని కోర్టు ఆ పిటిషన్లను కొట్టివేయడమే కాంగ్రెస్ నిజాయితీకి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలవలేక, కేవలం ప్రతిపక్షాల గొంతు నొక్కడం ద్వారానే అధికారంలో ఉండాలని బిజెపి చూస్తోందని చామల విమర్శించారు. ప్రజల పక్షాన నిలబడి బిజెపి చేస్తున్న ప్రతి కుట్రను పార్లమెంటులోనూ, బయటా బట్టబయలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

# కౌంటింగ్‌కు పటిష్ఠ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మేళ్లచెరువు)**: కౌంటింగ్‌కు ఎలాంటి అవాంచనీయ సంఘనటలు జరగకుండా పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అదేశించారు. మఠంపల్లి మండల కేంద్రంలోని వివేకవర్ధని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని, కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు. వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఉన్న బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ హాలుకు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, కౌంటింగ్ చేసేటప్పుడు ఓటు ఏ అభ్యర్థికి చెందిందో నిర్ధారించిన తర్వాతనే కౌంటింగ్ ప్రక్రీయ ప్రారంభమవుతుందని తెలిపారు. మేళ్లచెరువు, మఠంపల్లి లాంటి పెద్ద గ్రామ పంచాయతీలలో ఒకే గదిలో మూడు నుంచి నాలుగు కౌంటింగ్ టేంటింగ్ ఏర్పాటు చేసి త్వరగా ఫలితాలు ప్రకటించేలా, ఆర్ఓకి సహయకులుగా ఏఆర్వోలు ఉంటారని, మొత్తం కౌంటింగ్ ప్రక్రీయ వీడియోగ్రఫి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు సర్పంచ్, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించిన తర్వాత ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు నోటీస్ జారీ చేయాలని, ఒక వేళ బుధవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించలేకపోతే గురువారం ఉదయం రెండో నోటీస్ జారీ చేయాలని అయినప్పటికీ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు సాధ్యం కాకపోతే గురువారం మధ్యాహ్నానికి నిర్వహించేలా మూడో నోటీస్ జారీ చేయాలన్నారు. మొదటి, రెండు ఉప సర్పంచ్ ఎన్నిక సమావేశాలకు కోరం తప్పనిసరి అని, మూడవ సమావేశానికి కోరం అవసరం లేదని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రీయలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు, సిబ్బంది, అభ్యర్థులందరూ సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట ఎంపిడివో జగదీష్, తహసిల్దార్ మంగా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరేసుకొని ఆత్మహత్య



**ప్రజాపక్షం/చివ్వెంల** : ఓ వ్యక్తి తాగిన మైకంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యు లు తెలిపిన వివరాల ప్రకారం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న పడిదల మురళి (35) గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో తరచూ గొడవపడుతూ భార్య పిల్లలను గత కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం అర్థరాత్రి మద్యం మత్తులో ఇం టి పైకప్పు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. మృతుడి భార్య రజిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ యస్ గోవర్ధన్ కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.



## వినియోగదారులకు నాణ్యమైన బంగారం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** వినియోగదారులకు నాణ్యమైన బంగారాన్ని అందించి వారి మన్ననలను పొందాలని సూర్యాపేట బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అంతటి విజయకుమార్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో శ్రీవెంకటాద్రి జ్యూవెలరీ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ఈ వ్యాపారంలో వినియోగదారులకు సర్వీస్ అందిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో బంగారం వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు మామిడి నాగవెంకట హరీష్ కుష్మిత మాట్లాడుతూ మా కస్టమర్లకు ఎప్పటికప్పుడు నూతన మోడల్స్, నాణ్యత, మన్నికతో బంగారం, ఆభరణాలను అందిస్తామని తెలిపారు. బంగారు షాపు ఓపెనింగ్‌కి వచ్చిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సింహాద్రి, కోశాధికారి బుర్ల మధు, మామిడి శ్రీనివాస్, వెంకట రవితేజ, లోహిత్ పాల్గొన్నారు.

## హృదయపూర్వక శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/యాదాద్రి** : గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడత విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగాఎన్నికల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో మీరు చూపిన క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం అని, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో మీ సేవలు అమూల్యమైనవి భవిష్యత్తులో కూడా ఇలాంటి బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నాం అన్నారు.

# కామ్రేడ్ మూరగుండ్లకు కన్నీటి వీడ్కోలు



**ప్రజాపక్షం/తుంగతుర్తి (మద్దిరాల)** : సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి సభ్యులు, రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు, తుంగతుర్తి మాజీ జడ్‌పిటిసి, నూతనకల్ మాజీ వైస్ ఎంపిపి, ముకుందాపురం మాజీ సర్పంచ్, కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య (85)కు బుధవారం సిపిఐ నాయకులతో పాటు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు కన్నీటి విడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ అపోలో ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచిన విషయం అందరికి తెలిసిందే. ఆయన స్వగ్రామమైన మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామంలోని తన నివాసంలో ప్రజల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని ఉంచారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

**నివాళులర్పించిన పలువురు ప్రముఖులు..**


కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య భౌతిక కాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వీరిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ శాసనమండలి డిప్యూటి చైర్మన్ నేతి విద్యాసాగర్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపూడి నర్సయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, దేవరం మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, నాయకులు యల్లావుల రమేష్, రాజారాం, చామల అశోక్ కుమార్, నీలా శ్రీనివాస్, దొంగరి వెంకట్రామ్, మున్నూరుకాపు ట్రస్ట్ అధ్యక్షులు గాలి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్టల వెంకటేశ్వర్లు (భాగ్యశ్రీ వెంకన్న) ఉన్నారు.

**ఎర్ర జెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ మూరగుండ్ల లక్ష్మయ్య అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆరు దశాబ్ధాలుగా ఆయన ఎత్తిన ఎర్ర జెండాను వీడకుండా కడవరకు పేదల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ముకుందాపురం ఉపసర్పంచ్‌గా, సర్పంచ్‌గా, నూతనకల్ మండల వైస్ ఎంపిపిగా, తుంగతుర్తి జడ్‌పిటిసిగా ప్రజల చేత ఎన్నికై వారి సమస్యల పరిష్కారం కోసం పాలక ప్రభుత్వాలపై ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. భూమి, భుక్తి, పేద ప్రజల విముక్తి కోసం కామ్రేడ్ భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం అడుగుజాడల్లో నడిచిన యోధుడ లక్ష్మయ్య అని పేర్కొన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగడమే ఆయనకు నిజమైన ఘన నివాళులర్పించిన వారమవుతామని అన్నారు.







# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## బంగ్లాదేశ్ హైకమిషనర్‌కు భారత్ సమన్లు జారీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషనర్‌కు భారత్ సమన్లు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయానికి బెదిరింపులు, భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లా నేతలు చేస్తోన్న రెచ్చగొట్టే వ్యాఖ్యలకు నిరసనగా ఈ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌కు చెందిన నేషనల్ సిటిజెన్ పార్టీ (ఎన్‌సిపి) నేత హస్నత్ అబ్దుల్లా ఇటీవల భారత్‌కు వ్యతిరేకంగా తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంగ్లాను అస్థిరపరచాలని చూస్తే, ఈశాన్య భారత దేశంలోని రాష్ట్రాలను (సెవన్ సిస్టర్స్)ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతేకాదు అక్కడి వేర్పాటువాదులకు ఆశ్రయం కల్పిస్తామి బహిరంగంగా చెప్పారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఎంఇఎ తాజాగా ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషనర్ మహమ్మద్ రియాజ్ హమీదుల్లాకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమన్లు ఇచ్చింది.మరోవైపు, ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో 'విజయ్ దివస్'ను ఘనంగా నిర్వహించారు.

## తయారీ రంగం.. బలమైన
# ఆర్థికాభివృద్ధికి వెన్నుముక

- జర్మనీ పర్యటనలో మ్యూనిచ్‌లోని బిఎండబ్ల్యు ప్లాంట్‌ను సందర్శించిన రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** జర్మనీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటన బిజీబిజీగా సాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మ్యూనిచ్‌లోని బిఎండబ్ల్యు ప్లాంట్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అందులోని తాజా మోడల్ కార్లు, ఎలక్ట్రిక్ బైక్‌లు.. ఎం సిరిస్, బిఎండబ్ల్యు ఐఎస్3, రూల్స్ రాయిస్ తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తయారీ రంగంపై దృష్టి పెట్టాలంటూ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. దేశంలో చిరు వ్యాపారులను పట్టించుకోవడం లేదంటూ కేంద్ర వైఖరిని తప్పుపట్టారు. ఈ సందర్భంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక వీడియోను పోస్ట్ చేసి ఆయన.. కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. టివిఎస్ 450 సిసి మోటర్ సైకిల్‌ను బిఎండబ్ల్యు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇది భారతీయ ఇంజినీరింగ్ పనితనానికి గర్వకారణంగా ఉందన్నారు. తయారీ రంగం.. బలమైన ఆర్థికాభివృద్ధికి వెన్నుముక వంటిందని అభివర్ణించారు. కానీ విచారం ఏమింటే.. భారత్‌లో మాత్రం ఈ తయారీ రంగం అనేది తగ్గిపోతుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధిని వేగవంతం చేయాలంటే.. మనం మరిన్ని ఉత్పత్తి చేయాల్సి ఉందన్నారు. పార్లమెంట్ శీతకాల సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 15 నుంచి 20వ వరకు జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జర్మనీ వెళ్లారు.

# అంతటా గుత్తాధిపత్యం

- మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ ద్వంద్వాధిపత్యం సృష్టిస్తోంది
- భారత ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల చేతులకు అప్పగించాలి
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలోనూ 'గుత్తాధిపత్యం లేదా ద్వంద్వాధిపత్యం' సృష్టిస్తోందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల చేతులకు అప్పగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో తాను చిన్న, మధ్య తరహా ఐస్‌క్రీమ్ తయారీదారుల ప్రతినిధి బృందాన్ని కలిశానని, వారి సమస్యలను విన్న తర్వాత, ప్రభుత్వం తనకు ఇష్టమైన పారిశ్రామికవేత్తల ప్రయోజనం కోసం చిన్న వ్యాపారాలను నాశనం చేయడానికి నిశ్చయించుకుందని స్పష్టమైందని గాంధీ ఉద్ఘాటించారు. 'గుత్తాధిపత్యం లేదా ద్వంద్వాధిపత్యం భారతదేశానికి ఒక శాపం — మోదీ ప్రభుత్వం ప్రతి రంగంలో, ప్రతి పరిశ్రమలో సరిగ్గా ఇదే చేస్తోంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు తన వాట్సాప్ ఛానెల్‌లో హిందీలో పోస్ట్ చేశారు. ఈ చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారుల వినియోగదారులు భారతదేశంలోని పేద, దిగువ మధ్యతరగతి ప్రజలే అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఇలాంటి వేలాది చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారులు ఉన్నారని, వారు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. ఈ చిన్న వ్యాపారాలకు జిఎస్‌టి చాలా సంక్లిష్టంగా ఉందని, దాని భారాన్ని భరించడం వారికి కష్టంగా మారుతోందని ఆవేదన చెందారు. అందుకే చిన్న వ్యాపారాల కోసం ఒక ప్రత్యేక 'కాంపోజిషన్ స్కీమ్' సృష్టించారని, కానీ బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఐస్‌క్రీమ్‌ను ఈ పథకం నుండి మినహాయించిందని మండిపడ్డారు. బిజెపి పాలిత రాష్ట్రాలు, మునిసిపల్ కార్పొరేషన్లు ఫీజులను విపరీతంగా పెంచాయన్నారు. అధిక పన్నులు, పెరుగుతున్న పేపర్‌వర్క్ పనిభారం, ఫీజులను ఎదుర్కొంటూ చిన్న ఐస్‌క్రీమ్ తయారీదారులు కుప్పకూలిపోతున్నారన్నారు. ఈ రోజుల్లో ఇండియా గేట్ వంటి పర్యాటక ప్రదేశాలలో కూడా వారు అరుదుగా కనిపిస్తున్నారని ఆయన అన్నారు. 'ఈ కథ ప్రతి రంగంలోనూ పునరావృతమవుతోంది. బిజెపికి నిధులు సమకూర్చే ప్రధానమంత్రికి ఇష్టమైన గుత్తాధిపతులు మాత్రమే మనుగడ సాగిస్తున్నారు — దానికి ప్రతిఫలంగా, వారికి మార్కెట్‌పై పూర్తి గుత్తాధిపత్యం లభిస్తుంది' అని రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'ఈ దుర్మార్గపు చక్రాన్ని విచ్ఛిన్నం చేసి, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు చెందిన బలమైన పగ్గాలను తిరిగి ఎంఎస్ఎంఇల (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు) చేతుల్లోకి అప్పగించాలి. తద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రజలకు సరసమైన, నాణ్యమైన ఎంపికలు అందుబాటులోకి వస్తాయి. చిన్న వ్యాపారాలు దేశ ప్రగతిలో సమాన భాగస్వాములు కాగలవు' అని రాహుల్ సూచించారు. ఆయన తన ఛానెల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో, చిన్న ఐస్ క్రీమ్ తయారీదారులు ఎదుర్కొంటున్న సమస్యలు భారతదేశంలోని ప్రతి చిన్న, మధ్య తరహా వ్యాపారాలు ఎదుర్కొంటున్న సమస్యల మాదిరిగా నే ఉన్నాయని అన్నారు. ప్రజలకు ఉద్యోగాలు సృష్టించాలనుకుంటే, అది చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాల ద్వారానే సాధ్యమవుతుందని, నరేంద్ర మోదీ ప్రత్యేకంగా చేసేది ఏమిటని ప్రశిస్తూ.. గుత్తాధిపత్య సంస్థలు ఈ చిన్న వ్యాపారాలను అణచివేయడానికి సహాయం చేయడమేనని ఆరోపించారు. ఎవరికైనా గుత్తాధిపత్య అధికారాన్ని అప్పగిస్తే, వారు ప్రాథమికంగా మార్కెట్‌ను నాశనం చేస్తారని, గుత్తాధిపత్యదారుడు తాను కోరుకున్నది చేయగలడని, తయారీదారులపై ఎటువంటి నియంత్రణ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యమని, ఆర్థిక వ్యవస్థలో వాటికి ఒక స్థానం ఉన్నందున వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని తాను భావిస్తున్నానన్నారు. 'నరేంద్ర మోదీ గుత్తాధిపత్యాలు ఏర్పడేలా చూడటానికి ఒక కారణం ఉంది. ఎందుకంటే బిజెపికి నిధులు సమకూర్చుకోవడానికి అది అతనికి సులభమైన మార్గం' అని అన్నారు. బిజెపి ప్రతిచోటా గుత్తాధిపత్యాలను సృష్టిస్తోందని, వాటిలో అతిపెద్దవి అదానీ, అంబానీ అయినప్పటికీ,వారు ఇలాగే చేశార ని గాంధీ ఆరోపించారు. 'ఇది దేశానికి ప్ర మాదకరం, ఇది దేశ నిర్మాణాన్ని బలహీనపరుస్తుంది, పెద్ద సంఖ్య లో భారతీయ యువత నిరుద్యోగులుగా ఉండేలా చేస్తుంది' అని రాహుల్ అన్నారు.

## స్కూళ్లను బాంబులతో పేల్చేస్తాం..

- అహ్మదాబాద్‌లోని 10 స్కూళ్లకు బెదిరింపు మెయిల్స్

**అహ్మదాబాద్:** గుజరాత్ రాష్ట్రం హ్మదాబాద్ నగరంలోని 10 స్కూళ్లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దాంతో ఆయా స్కూళ్ల పరిధిలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యగా పాఠశాలలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించారు. ఆ స్కూళ్ల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. అణువణువు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబులు లేవని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. థాల్టేలోని జెబర్ స్కూల్, ఉద్గమ్ స్కూల్, గురుకుల్ రోడ్‌లోని మహారాజ అగ్రసేన్ స్కూల్, మకర్బాలోని డిఎవి ఇంటర్నేషనల్ స్కూల్, వస్త్రపూర్‌లోని నిర్మాణ్ స్కూల్, విజాల్‌పూర్‌లోని జైడల్ స్కూల్, అదలాజ్‌లోని డివైన్ స్కూల్, డివైన్ చైల్ స్కూల్, కాలోల్‌లోని ఆవిష్కార్ స్కూల్, బోడక్దేవ్‌లోని అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్, బోపాల్‌లోని న్యూ తులిప్ స్కూల్, డిపిఎస్‌లకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఉదయం 8.35 గంటల ప్రాంతంలో బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయని, మధ్యాహ్నం 1.11 సమయంలో స్కూళ్లను పేల్చేస్తామని ఆ మెయిల్స్‌లో పేర్కొన్నారని అధికారులు తెలిపారు. అదే విధంగా సబర్మతి జైల్లో కూడా బాంబులు పేలుతాయని ఆకతాయిలు ఆ మెయిల్స్‌లో హెచ్చరించినట్లు చెప్పారు.

## ఢిల్లీ వాయుకాలుష్యం...పరిష్కారంపై ఆలోచిద్దాం:'సుప్రీం'

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో తీవ్రమవుతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సమస్యకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా ఆచరణాత్మక పరిష్కారం గురించి ఆలోచిద్దామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కాలుష్య నియంత్రణ చర్యల నేపథ్యంలో పనులు నిలిచిపోయి ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ కార్యకర్త ఎంసి మెహతా దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. పని లేకుండా ఉన్న కార్మికులను ముందుగా సరైన విధంగా గుర్తించి, వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేయాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక హెచ్చరిక చేసింది. కార్మికుల ఖాతాల్లో జమ చేసే డబ్బు ఎక్కడికో మాయమై, మరో ఖాతాకు వెళ్లిపోకుండా చూడాలని స్పష్టం చేసింది. దీనిపై ఢిల్లీ ప్రభుత్వం స్పందిస్తూ, మొత్తం 2.5 లక్షల నిర్మాణ కార్మికుల్లో ఇప్పటివరకు కేవలం 7,000 మందినే వెరిఫై చేయగలిగామని, వారి ఖాతాల్లో త్వరలోనే డబ్బు జమ చేస్తామని కోర్టుకు ఢిల్లీ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలిపారు. ఆంక్షల కారణంగా ఖాళీగా ఉన్న నిర్మాణ కార్మికులకు ప్రత్యామ్నాయ పని కల్పించేలా చూడాలని దిల్లీ ప్రభుత్వానికి సూచించింది న్యాయస్థానం. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పాఠశాలలు మూసివేయాలన్న ఢిల్లీ ప్రభుత్వ ఆదేశాలపై జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. శీతాకాల సెలవులు సమీపంలో ఉన్నందున, ఆ నిర్ణయంలో మార్పులు చేయాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించింది. వాయి కాలుష్య సమస్యపై ప్రజల ఆరోగ్యం, కార్మికుల జీవనోపాధి రెండింటినీ సమతుల్యం చేసే విధంగా చర్యలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**టోల్ ప్లాజాలను మూసివేయడంపై వారం లోపు నిర్ణయం**

ఢిల్లీకి వచ్చే ప్రధాన ప్రవేశ ద్వారాల వద్ద ఉన్న టోల్ ప్లాజాల వల్ల రోజూ భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని కోర్టు గమనించింది. దీని వల్ల వాహనాల నుంచి వెలువడే కాలుష్యం మరింత పెరుగుతోందని పేర్కొంది. అందుకే ఈ టోల్ ప్లాజాల అంశంపై ఒక వారం లోపల నిర్ణయం తీసుకోవాలని ఎంసిడికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కాలుష్యం ఏటా పునరావృతమవుతున్న సమస్యగా మారిందని వ్యాఖ్యానించిన ధర్మాసనం, గాలి నాణ్యత నిర్వహణ కమిషన్ తమ దీర్ఘకాలిక వ్యూహాలను మరింత బలోపేతం చేయాలని ఆదేశించింది.

## ఢిల్లీలో తీవ్ర కాలుష్యం
# నగరాన్ని వీడి హిల్ స్టేట్‌కు క్యూ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో కాలుష్యం ప్రమాదకరస్థాయికి చేరింది. గాలి నాణ్యత సూచిక (ఎక్యూఐ) అధ్వానస్థాయిలో నమోదవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ లెవెల్స్ 400కుపైనే నమోదవుతున్నాయి. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగ కమ్మేస్తోంది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాస కోశ సంబంధిత సమస్యలు ఉన్న వారు అనారోగ్యానికి గురవుతున్నారు. కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్న నేపథ్యంలో నగర వాసులు తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వాహనాలు సమీపంలోని హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌కు క్యూ కట్టాయి. రోహ్తాంగ్ పాస్ సమీపంలో వాహనాల రద్దీ కనిపించింది. వందలాది కార్లు రోహ్తాంగ్ రహదారిపై నిలిచిపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. రద్దీ అధికంగా ఉండటంతో వాహనాలు ముందుకు కదలకుండా రోడ్డుపై నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. 'విషపూరిత గాలి నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీ వాసులు నగరాన్ని వీడి ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నారు', 'కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి కాక పోతే మరేంటి..? ఇది ఏ నగరంలోని రోడ్డు కాదు. ఇది రోహ్తాంగ్ పాస్. అక్కడ ప్రస్తుతం ఎలాంటి స్నో లేదు. హాలిడేస్ లేవు. అయినా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అందరూ ఎందుకు ఈ ప్రాంతానికి క్యూ కడుతున్నారు..?' అంటూ ఈ వీడియోలను నెటిజన్లు తెగ వైరల్ చేస్తున్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి
# ఎక్కువ మొత్తంలో కాంగ్రెస్ ఖర్చు

- అభ్యర్థులపై ఖర్చులో వెనుకబాటు : ఎడిఆర్

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి కంటే కాంగ్రెస్ 'పార్టీ ప్రచారం', 'సోషల్ మీడియా ప్రచారం' కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేసిందని, అయితే అభ్యర్థులపై చేసిన ఖర్చులో వెనుకబడి ఉందని ఎడిఆర్ వెల్లడించింది. భారత ఎన్నికల సంఘానికి పార్టీలు సమర్పించిన ఎన్నికల వ్యయ నివేదికలపై అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) చేసిన విశ్లేషణ ప్రకారం .. ఎన్నికల కోసం బిజెపి రూ. 57.65 కోట్లు ఖర్చు చేయగా, కాంగ్రెస్ రూ. 46.19 కోట్లు చేసింది. 2025 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం సేకరించిన మొత్తం నిధుల విషయంలో బిజెపి రూ. 88.7 కోట్లతో ముందుండగా, ఆ తరువాత స్థానంలో కాంగ్రెస్ రూ. 64.3 కోట్లను సేకరించింది. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాషాయ పార్టీ 48 స్థానాలతో విజయం సాధించగా, కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 22 స్థానాలను గెలుచుకుంది. ఎడిఆర్ విశ్లేషణ ప్రకారం... ఆప్ పార్టీ ప్రచారానికి మొత్తం రూ. 12.12 కోట్లు, అభ్యర్థులపై రూ. 2.4 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రకటించింది. దీంతో మొత్తం ఖర్చు రూ. 14.5 కోట్లుగా ఉంది. ఇది సోషల్ మీడియాపై దాదాపు రూ. 3 కోట్లు ఖర్చు చేసింది, అయితే బిజెపి కేవలం రూ. 5.26 లక్షలు, కాంగ్రెస్ రూ. 5.95 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు ప్రకటించాయి. బిజెపి మొత్తం ఖర్చు రూ. 57.65 కోట్లుగా ఉండగా, ఇది కాంగ్రెస్ రూ. 46.19 కోట్లు, ఆప్ రూ. 14.5 కోట్ల కంటే ఎక్కువ. పార్టీ ప్రచారంపై బిజెపి రూ. 39.14 కోట్లు ఖర్చు చేసింది. ఇది కాంగ్రెస్ రూ. 40.13 కోట్ల కంటే తక్కువగా ఉన్నప్పటికీ, ఆప్ ప్రకటించిన రూ. 12.12 కోట్ల కంటే ఎక్కువ. ఇప్పటివరకు తొమ్మిది పార్టీలు చేసిన ప్రకటనల ప్రకారం, వాటి మొత్తం ఖర్చు రూ. 120.3 కోట్లుగా ఉంది, ఇందులో అభ్యర్థులపై చేసిన రూ. 27 కోట్లు కూడా ఉన్నాయి. బిజెపి, కాంగ్రెస్, ఆప్ కాకుండా, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) మాత్రమే రూ. 1 కోటి కంటే ఎక్కువ (రూ. 1.8 కోట్లు) ఖర్చు చేసిన ఏకైక పార్టీ. ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు సేకరించిన మొత్తం నిధులు రూ. 170.68 కోట్లుగా ఉన్నాయి. ఇందులో బిజెపి రూ. 88.7 కోట్లు, కాంగ్రెస్ రూ. 64.3 కోట్లు. ఆప్ రూ. 16.1 కోట్లు. నిధులలో అత్యధిక భాగం పార్టీల కేంద్ర ప్రధాన కార్యాలయాల స్థాయిలో సేకరించబడ్డాయి. అలాగే, 74 శాతానికి పైగా నిధులను చెక్/డిడి రూపంలో సేకరించాయి. దాదాపు 26 శాతం నిధులు నగదు రూపంలో సేకరించబడ్డాయి. పార్టీలు చేసిన ప్రకటనల ప్రకారం, ఖర్చుల విషయంలో కూడా కేవలం 0.04 శాతం లేదా రూ. 3.7 లక్షలు మాత్రమే నగదు రూపంలో ఖర్చు చేయబడ్డాయి. రెండు స్థానాల్లో పోటీ చేసి ఒక్క స్థానంలో కూడా గెలవని ఎఐఎంఐఎం పార్టీ, తన ప్రకటన ప్రకారం ఎటువంటి ఖర్చు చేయని ఏకైక పార్టీగా మిగిలింది. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మొత్తం 70 స్థానాల్లో పోటీ చేయగా, బిజెపి 68 స్థానాల నుండి పోటీ చేసి, రెండు స్థానాలను తన మిత్రపక్షాలకు కేటాయించింది. 2020, 2025 ఎన్నికలలో పోటీ చేసిన ఆరు పార్టీలు సేకరించిన మొత్తం నిధులు ఈసారి దాదాపు తొమ్మిది శాతం పెరిగి సుమారు రూ. 170 కోట్లకు చేరాయి. వీటిలో, కాంగ్రెస్ పార్టీలో అత్యధికంగా 222 శాతానికి పైగా పెరుగుదల కనిపించగా, బిజెపికి సంబంధించి ఇది 25 శాతం తగ్గింది. ఆమ్ ఆద్మీ పార్టీకి దాదాపు ఆరు శాతం పెరిగింది. ఈ ఆరు పార్టీల మొత్తం ఖర్చులు 2020–2025 ఎన్నికల మధ్య దాదాపు 39 శాతం పెరిగాయి. కాంగ్రెస్ విషయంలో ఈ పెరుగుదల దాదాపు 161 శాతం మరియు బిజెపికి 20.5 శాతంగా ఉండగా, ఆమ్ ఆద్మీ పార్టీ దాదాపు 32 శాతం తక్కువ నిధులను ఖర్చు చేసింది.

## ఇథనాల్ ప్లాంట్ మాకొద్దు



- రైతులు ఆందోళన

**జైపూర్:** రాజస్థాన్‌లోని టిబ్బి పట్టణంలో ప్రతిపాదిత ఇథనాల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయవద్దని రైతులు ఆందోళనకు దిగారు. హనుమాన్‌గఢ్‌లోని ధన్ మండిలో బుధవారం పెద్ద సంఖ్యలో రైతులు 'మహాపంచాయత్' నిర్వహించారు. టిబ్బి పట్టణంలో ప్రతిపాదిత ఇథనాల్ ప్లాంట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. చండీగఢ్‌కు చెందిన ఒక కంపెనీ రతి ఖేరా ప్రాంతంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టాలని భావిస్తుండగా, దానిని వ్యతిరేకిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకుల మద్దతుతో రైతులు మహాపంచాయత్ నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని వెదజల్లుతదని, ఆ ప్రాంతంలో భూగర్భ జలాలను కలుషితం చేస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా, అటవీ, పర్యావరణ శాఖ ప్రతిపాదిత ప్రతిపాదిత ప్లాంట్ నుండి సంభావ్య భూగర్భ జల కాలుష్యం, కాలుష్యాన్ని పరిశోధించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి బికనీర్ డివిజన్ కమిషనర్ నేతృత్వం వహించనున్నారు. అటవీ, పర్యావరణ ప్రత్యేక కార్యదర్శి సభ్య కార్యదర్శిగా ఉంటారు. హనుమాన్‌గఢ్ జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ బోర్డు నుండి సీనియర్ పర్యావరణ ఇంజనీర్లు, భూగర్భ జల శాఖ చీఫ్ ఇంజనీర్ అదనపు సభ్యులలో ఉన్నారు.

# భారత్, ఇథియోపియా రెండూ సహజ భాగస్వాములు

- ప్రధాని నరేంద్రమోదీ
- ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి కీలక ప్రసంగం



**అడ్డిస్‌అబాబా:** ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారతదేశం,ఇథియోపియా దేశాలు రెండూ సహజ భాగస్వాములని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆయన బుధవారం ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ తన తొలి పర్యటనలో భాగంగా మంగళవారం ఇథియోపియాకు చేరుకుని తూర్పు ఆఫ్రికా దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ప్రసంగించారు. ప్రపంచంలోనే ప్రధాని మోదీ ప్రసంగించిన 18వ పార్లమెంట్ సమావేశం ఇది. 'ఇథియోపియా ఆఫ్రికా కూడలిలో ఉంది. భారతదేశం హిందూ మహాసముద్రం వద్ద నిలుస్తోంది. ప్రాంతీయ, శాంతి, భద్రత, అనుసంధానంలో మనం సహజ భాగస్వాములం' అని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో రక్షణ సహకార ఒప్పందంపై సంతకం చేయడంతో పరస్పర భద్రత పట్ల భారతదేశ నిబద్ధత మరింత బలపడిందన్నారు. ఈ ఏర్పాటు దగ్గరి సైనిక సహకారంపై దృష్టి పెడుతోందని నరేంద్రమోదీ స్పష్టం చేశారు. భారతదేశం, ఇథియోపియా వాతావరణంలో, స్ఫూర్తిలో వెచ్చదనాన్ని పంచుకుంటాయని నొక్కి చెప్పారు. రెండు దేశాల పూర్వీకులు జీవనవిధానం, వస్తువులు మాత్రమే కాకుండా పరస్పరం ఆలోచనలు కూడా మార్పిడి చేసుకుంటారని మోదీ తెలిపారు. ప్రజాస్వామ్యం ఒక జీవితం, ప్రయాణం అని రెండు దేశాలు అర్థం చేసుకున్నాయని ప్రధాని మోదీ వివరించారు. ఇది కొన్ని సార్లు చర్చ ద్వారా, మరికొన్నిసార్లు భిన్నాభిప్రాయాల ద్వారా జరుగుతోందన్నారు. కానీ ఎల్లప్పుడూ చట్ట పాలనపై నమ్మకం ద్వారా రూపుదిద్దుకుంటుందన్నారు. రాష్ట్ర చక్రం ప్రజలతో సామరస్యంగా ఉన్నప్పుడు, పురోగతి చక్రం ఆశ, ఉద్దేశంతో ముందుకు సాగుతుందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా మోదీ గ్లోబల్ సౌత్ గురించి మాట్లాడుతూ ఈ ప్రాంతం తన భవితవ్యాన్ని తానే రాసుకుంటోందన్నారు. అందు కోసం ఇథియోపియా, భారతదేశం ఒక దార్శనికతను పంచుకుంటున్నాయని విపులీకరించారు. 'ప్రపంచ దక్షిణాది ఎవరికీ వ్యతిరేకం కాకుండా, ప్రతీ ఒక్కరి కోసం లేచే ప్రపంచం మా దార్శనికత' అని మోదీ చెప్పారు. మనం కలిసి నిలబడి మరింత న్యాయమైన ప్రపంచం కోసం పనిచేస్తామని, సమానత్వం, శాంతియుతంగా గతంలో బంధించబడిన దాని వ్యవస్థల కోసం ప్రపంచం కదలలేదని ఆయన అన్నారు. ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటంలో ఇథియోపియా సంఘీభావం తెలిపినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఇథియోపియా, భారతదేశం ప్రాచీన జ్ఞానాన్ని మిళితం చేశాయని మోదీ చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలుగా భారతదేశం, ఇథియోపియా ఇరు దేశాలూ ఒకదానికొకటి తోడ్పాటును, సహకారాన్ని అందిస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. కోవిడ్19 పాండెమిక్ సమయంలో భారతదేశం 150కు పైగా దేశాలకు ఔషధాలు, వాక్సిన్స్‌లను పంపించాయని ఆయన చెప్పారు. భారతదేశం ఇథియోపియాకు 4మిలియన్లకు పైగా వాక్సిన్ డోస్‌లను సరఫరా చేయడాన్ని 'గర్వకారణమైన విషయం'గా భావిస్తోందన్నారు. మానవ చరిత్రలోని పురాతన నాగరికతలలో ఇథియోపియాది ఒకటి అని మోదీ అభివర్ణించారు. 'ఇథియోపియా దాని మూలాలు లోతైన గౌరవంతో వర్తమానం ఉద్దేశంతో నిండి ఉన్నందున భవిష్యత్ మీ హృదయానికి స్వాగతం'అని నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా' ప్రదానం జరిగింది.ఈ అవార్డును అందుకున్న మొదటి ప్రపంచ అధిపతి నరేంద్ర మోదీనే.'ఇథియోపియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించడం గొప్ప గౌరవం, గౌరవప్రదమైన విషయం' అని ప్రధానమంత్రి మోదీ తన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు.

**ఒమన్‌కు బయల్దేరిన ప్రధాని మోదీకి ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్ వీడ్కోలు**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం తన మూడు దేశాల పర్యటనలో భాగంగా నాలుగవ రోజున ఇథియోపియా నుంచి ఒమన్‌కు బయల్దేరారు. ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీ మోదీని స్వ యంగా విమానాశ్రయం వద్దకు తీసుకెళ్లి ఒమన్‌కు బయల్దేరుతుండగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తన సందేశాన్ని పోస్ట్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ...'మనం మళ్లీ కలిసే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నాను. మన ఇరుదేశాలు ఎల్లప్పుడూ చారిత్రక, సాంస్కృతిక, దౌత్య సంబంధాల ద్వారా అనుసంధానించబడి ఉంటాయి' అని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రధాని మోదీకి ఇథియోపియా అత్యున్నత పురస్కారం

**న్యూఢిల్లీ:** ఇథియోపియాలో పర్యటిస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అపూర్వ గౌరవం దక్కింది. అక్కడి ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం 'గ్రేట్ ఆనర్ నిషాన్ ఆఫ్ ఇథియోపియా' తో సత్కరించింది. అడీస్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని డాక్టర్ అబి అహ్మద్ అలీ.. ప్రధాని మోదీని అవార్డుతో సత్కరించారు.




GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్.

టెండర్ ప్రకటన

NIT No. 33/SE(M)/CRZ/GHMC/2025-26 తేది: 17.12.2025

**పని పేరు:** 01 నెం. సివిల్ పని, **అంచనా విలువ:** రూ.137.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 17.12.2025న సా.05.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 24.12.2025న మ.3.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ బి.నరేందర్ గౌడ్, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి, పూల్ బాగ్, బాబానగర్. ఫోన్: 9989930608. మరిన్ని వివరాలకు https: //tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎం), చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 12111-PP/CL/ADVT/1/2025-26, Date: 17-12-2025

శ్రీ పెద్దమ్మ దేవాలయము
జూబ్లిహిల్స్, హైద్రాబాద్. ఫోన్ నెం. 9949789595

Rc. No. SPT/45/2025 టెండరు ప్రకటన తేది: 17.12.2025

దేవాలయములో దిగువ కనబరచిన సరఫరాల నిమిత్తం అనుభవము గల ఫర్మ్‌ల నుండి సీల్డు టెండర్లు కోరుట గురించి

| క్ర. సం. | సరఫరాల వివరములు | ధరావత్తు సొమ్ము రూ॥ డి.డి. | టెండర్ కాల పరిమితి 01.01.26 నుండి 31.12.26 వరకు | షెడ్యూల్ జారీచేయు తేది: 18.12.25 నుండి 28.12.25 వరకు | షెడ్యూల్ సమర్పించు తేది: 29.12.25 మ.12 గం.ల వరకు. టెండర్స్ విప్పు తేది: 29.12.25 మ.3 గం.లకు | షెడ్యూల్ ధర రూ॥ | టెండర్ విధానము |
|---|---|---|---|---|---|---|---|
| 1. | దేవాలయమునకు పండుగలు పర్వదినములలో పూల అలంకరణ మరియు నిత్య పూల అలంకరణ | 1,00,000/- | -do- | -do- | -do- | 5,000/- | సీల్ టెండర్స్ |
| 2. | దసరా ఉత్సవమునకు దేవాలయ ముఖద్వారము నుండి రాజగోపురం వరకు, రాజగోపురం ముందు దేవాలయంలోపల ఫైబర్ ప్రత్యేక అలంకరణ నిమిత్తం | 50,000/- | -do- | -do- | -do- | 3,000/- | -do- |
| 3. | దేవాలయమునకు పండుగలు, పర్వదినములలో అలంకరణలకై అరటిచెట్లు, మామిడాకులు సరఫరా నిమిత్తం | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 4. | దేవాలయమునకు కావలసిన టికెట్ పుస్తకములు కరపత్రములు ముద్రణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 5. | దేవాలయమునకు పాలు, పెరుగు సరఫరా నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 6. | దేవాలయమునకు రోజువారి పూజల నిమిత్తము కొబ్బరికాయలు, నిమ్మకాయలు సరఫరా నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 7. | దేవాలయములోని పుష్కరిని నిర్వహణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 8. | లడ్డు, వడ, అభిషేకం లడ్డు తయారి నిమిత్తం | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 9. | టాయ్లెట్స్, వసతి గృహములు క్లీనింగ్ నిర్వహణ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 10. | గోషాల నిర్వహణ నిమిత్తము | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 11. | మ్యాట్ ఫ్రేమ్ ఫోటోస్ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 12. | ప్రసాదముల ప్యాకింగ్ నిమిత్తము పాలిథిన్ కవర్స్ | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 13. | అమ్మవారి కంకణముల సరఫరా | 1,00,000/- | -do- | -do- | -do- | 5,000/- | -do- |
| 14. | గొప్పలు, విస్తర్లు, గ్లాసుల మొదలైనవి సరఫరా | 10,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 15. | సెక్యురిటీ సర్వీసెస్ | 50,000/- | -do- | -do- | -do- | 2,000/- | -do- |
| 16. | వాటర్ ఫౌంటెన్ మరమ్మత్తులు మరియు ఆధునీకరణ పనుల నిమిత్తం | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |
| 17. | 125 కె.వి జనరేటర్ కొనుగోలు నిమిత్తము | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |
| 18. | 14-Seater Battery operated Mini-Bus for off-road applications - Lithium Battery - Warranty Terms: 1 year/25,000km on Manufacturing defects. 5 YEARS BATTERY WARRANTY/75,000km- Free One year Vehicle Insurance (third party liability up to 5 Lakhs)- 4 service visit in a year every quarterly | 10,000/- | - | -do- | -do- | 2,000/- | -do- |

1. టెండరు ఫారముల కొరకు సదరు వ్యాపార సంస్థల లెటర్ ప్యాడ్ పై తేది: 27.12.25 సా.05-00 గంటల లోపు ధరఖాస్తు చేసుకోవలయును ఇట్టి దరఖాస్తుతోపాటు షెడ్యూల్ ధర మరియు ధరావత్తు సొమ్ము కార్యనిర్వహణాధికారి శ్రీ పెద్దమ్మ దేవాలయము, జూబ్లిహిల్స్, హైదరాబాద్ వారి పేరున రెండు వేరు వేరు డి.డి.లు తప్పక జతచేయవలెను మరియు ధరఖాస్తుతోపాటు సదరు వ్యాపార సంస్థల అనుభవ ధృవపత్రములు సమర్పించవలెను.
2. పై టెండర్లయందు పాల్గొనుటకు సమర్పించు ధరఖాస్తు ధృవపత్రములను దేవాదాయ శాఖవారి నిబంధనల ప్రకారము పరిశీలించిన మీదట అర్హులైన సంస్థల వారికి మాత్రమే టెండరు షెడ్యూళ్ళు ఫారములు ఇవ్వబడును.
3. ఇట్టి టెండర్స్ దేవాదాయశాఖవారి నిబంధనల ప్రకారము జరుగును, ఏకారణము తెలుపకుండా టెండర్సును రద్దు చేయు/వాయిదా వేయుటకు ఆలయ కార్యనిర్వహణాధికారిగారికి పూర్తి అధికారము కలదు.
4. ఇతర వివరములకు దేవాలయ పనివేళలయందు సంప్రదించగలరు.

Sd/- ఫౌండర్ చైర్మన్ Sd/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 12117-PP/CL/ADVT/1/2025-26, Date: 17-12-2025

ప్రజాపక్షం
గురువారం, 18 డిసెంబరు

## ఆర్థిక వ్యవస్థకు 'అణు' ప్రమాదం!

బీమా రంగంలో వంద శాతం ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరచిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు అణు శక్తి బిల్లు రూపంలో మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఈ బిల్లు ద్వారా 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని భారత్ సాధించగలదని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ధీమా. అయితే, ముసాయిదా చట్టంలోని కొన్ని నిబంధనలను నీరుగార్చడంపై ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సరైన సమాధానం లేదు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)లో చర్చ జరగాలన్న డిమాండ్‌పై స్పందన లేదు. అణు శక్తిని స్థిరంగా వినియోగించుకుంటూ, అభివృద్ధిపథంవైపు దేశాన్ని తీసుకెళ్లడమే లక్ష్యంగా 'శాంతి' బిల్లును ప్రవేశపెట్టినట్టు ప్రకటిస్తున్న మోదీ సర్కారుకు సమగ్ర పరిశీలనపై భయం ఎందుకో అర్థం కాదు. అణు పరికరాల సరఫరాదారుల బాధ్యత నిబంధనను ఈ బిల్లులో తొలగించడం అణు ప్రమాదం సంభవించినప్పుడు భారత ప్రజలకు, ఆస్తులకు, ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకర పరిస్థితులు తప్పవన్నది వాస్తవం. 1962 అణు శక్తి చట్టం, 2010 పౌర అణు నష్ట పరిహార చట్టాన్ని రద్దు చేయాలనే బిల్లులోని నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు సరఫరాదారుల పరిమిత బాధ్యత అనుమానాలకు తావిస్తున్నది. కేవలం 300 మిలియన్ డాలర్లకే బాధ్యతను పరిమితం చేయడమంటే, ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేయడమే. ఈ పరిమితి పెంచడం అత్యవసరం. జపాన్‌లో ఫుకుషిమా, రష్యాలో చెర్నోబిల్ అణు ప్రమాదాలు నేర్పిన పాఠాలు విస్మరించడం సరికాదు. అంతర్జాతీయ న్యాయ పరిధిలో వివాదాలకు బిల్లులో అవకాశం కల్పించడం వల్ల భారత పౌరుల వ్యక్తిగత హక్కులు బలహీనపడతాయి. సరఫరాదారులను బాధ్యత నుంచి తప్పించే ప్రయత్నం ఎవరికి లాభమన్నది బహిరంగ రహస్యం. అణు ఇంధన రంగంలో విదేశీ పెట్టుబడులకు అవకాశమిస్తే, విదేశీ సరఫరాదారుల భాగస్వామ్యం పెరుగుతుంది. దేశ అజమాయిషీ తగ్గుతుంది. అణుశక్తి నియంత్రణ బోర్డు (ఎఇఆర్‌బి)కి చట్టబద్ధ హోదాను ఇస్తున్నట్టు ప్రకటిస్తున్న కేంద్రం, పూర్తి స్వయం ప్రతిపత్తి ఎందుకు ఇవ్వడం లేదనేది మరో కీలక ప్రశ్న. న్యూక్లియర్ రంగాన్ని ప్రైవేటుకు, ముఖ్యంగా విదేశీ కంపెనీలకు ధారాదత్తం చేయడమే బిల్లు పరమార్థంగా కనిపిస్తున్నది. ఇది దేశ ప్రయోజనాలకు, మేక్ ఇన్ ఇండియా భావనకు విరుద్ధం. ప్రైవేటురంగ భాగస్వామ్యం ఉన్న చోట విద్యుత్ ఖర్చు కనీసం 25 శాతం పెరిగే ప్రమాదం ఉంది. ఇక, ముడి పదార్థాల కొరత మరో సమస్య. అణు ఇంధనానికి కావాల్సిన ముడి పదార్థాలు భారత్‌లో పరిమితంగా ఉన్నాయి. దీనితో విదేశాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడే దుస్థితి నుంచి బయట పడాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ పలు సందర్భాల్లో చేస్తున్న ప్రకటనలకు, లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లుకు పొంతన లేదు. ఈ బిల్లులో రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణకు సరైన విధానం లేదు. వ్యవస్థ రూపకల్పనపై వివరాలు లేవు. మూడు దశల అణు కార్యక్రమానికి ప్రధాన ఆధారమైన థోరియం రియాక్టర్లు, మోల్టెన్ సాల్ట్ రియాక్టర్లను పక్కనపెట్టి, యురేనియం ఆధారిత రియాక్టర్లకు ప్రాధాన్యం ఇవ్వడం విచిత్రం. ఈ బిల్లు ద్వారా అమెరికా, ఫ్రాన్స్ వంటి విదేశీ కంపెనీలకే తప్ప, భారత కంపెనీలకు ప్రయోజనం దాదాపు శూన్యం. అత్యంత కీలకమైన బిల్లుపై లోతైన చర్చ అవసరం. సెలెక్ట్ కమిటీ లేదా జెపిసికి పంపి, అన్ని వర్గాలతో చర్చించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ బిల్లు దేశ ఇంధన అవసరాలకు ఉపయోగపడుతుందనడంలో అనుమానం లేదు. కానీ, ప్రజా భద్రత, జాతీయ ప్రయోజనాలు, బాధ్యత, పారదర్శకతలపై ఇంకా స్పష్టత రావాలి. లోతుగా పరిశీలించాలి. ఎలాంటి ప్రతికూల ప్రభావాలు లేకుండా, దేశానికి ఉపయోగపడే సమగ్ర అణు ఇంధన విధానాన్ని రూపొందించుకోవాలి. యుపిఎ ప్రభుత్వం అణు ఇంధన బిల్లును తెచ్చే ప్రయత్నం చేసినప్పుడు, అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నిజాన్ని, నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి పాలక పార్టీ ఎలా విస్మరించింది? ఒక్కసారిగా అణు శక్తి ఆవశ్యకత ఎందుకు గుర్తుకొచ్చింది? విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరవాల్సిన అవసరం ఏమిటి? ఈ బిల్లు భారత ప్రయోజనాలకంటే విదేశీ కంపెనీల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలకు ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. సమగ్ర చర్చకు అనుమతించాలి. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని, ప్రపంచం చవిచూసిన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, సురక్షితమైన...దేశ ప్రయోజనాలకు అనుకూలించే గుణాత్మక అంశాలను అందులో చేర్చాలి. వ్యక్తమవుతున్న అనుమానాలను, పెరుగుతున్న అభ్యంతరాలను పక్కనపెట్టి, అణు ఇంధన బిల్లుకు మెజారిటీ పాలకపక్ష సభ్యుల బలంతో ఆమోద ముద్ర వేయించుకోవడం ప్రమాదకరం. బిల్లును జెపిసికి పంపి, సమగ్ర పరిశీలన అనంతరమే లోక్‌సభలో ప్రతిపాదించాలి. లేకపోతే, దేశ అణు ఇంధనంపై విదేశీ పెత్తనం పెరుగుతుంది. దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

# ద్రవిడ నేలపై అయోధ్య నమూనాకు ఆజ్యం

**సి.ఆదికేశవన్**

ఏడు శతాబ్దాలుగా తిరుపరన్‌కుంద్రంలోని కొండపై చెక్కిన రాతి శిల్పాలు తమిళనాడు సమన్వయ మేధస్సుకు సజీవ పురావస్తు చిహ్నంగా ఉన్నాయి. ఒకే కొండపై చెక్కబడిన 2వ శతాబ్దపు మురుగన్ గుహ దేవాలయం, 14వ శతాబ్దపు సూఫీ దర్గా, సంగం యుగానికి చెందిన జైన రాతి పడకలు, శివాలయం ఇవన్నీ ఒక్క ఘర్షణ కూడా నమోదు కాకుండా సహజీవనం చేశాయి. ప్రతి కార్తీక దీపం నాడు, కొండ కింది భాగంలో ఉన్న ఉచచ్చిపిల్లయార్ మండపం వద్ద పవిత్ర జ్యోతి వెలిగించినప్పుడు హిందువులు, ముస్లింలు భుజం భుజం కలిపి నిలబడేవారు. 1996, 2014,2017లో మద్రాసు హైకోర్టులోని మూడు డివిజన్ బెంచ్ తీర్పుల ద్వారా క్రోడీకరించబడిన ఉద్దేశపూర్వక నిగ్రహమే మత సామరస్యానికి శాంతియుత బంధం.

అయితే 2025 డిసెంబర్ 1న, అదే హైకోర్టుకు చెందిన సింగిల్ జడ్జి, జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్, ఆ ఒడంబడికను చిందరవందర చేశారు.

న్యాయశాస్త్రంలా కాకుండా, న్యాయమూర్తి దుస్తుల్లో ఉన్న హిందుత్వ కరపత్రంలా అనిపించే 27 పేజీల ఉత్తర్వులో, జస్టిస్ స్వామినాథన్ హెఆర్& సిఇ విభాగాన్ని సికిందర్ బాదుషా దర్గాకు కొన్ని మీటర్ల దూరంలో ఉన్న కొండపై రాతి స్తంభం మీద కార్తీక దీపాన్ని వెలిగించాలని ఆదేశించారు. అయితే బ్రిటిష్ సర్వే రికార్డులు, బతికున్న పెద్దలందరూ ఆ స్తంభాన్ని ఈ ప్రయోజనం కోసం ఎన్నడూ ఉపయోగించలేదని ధృవీకరించారు. ఆయన ఎలాంటి చారిత్రక ఆధారాలు లేనప్పటికీ, ఈ చర్యను 'ముఖ్యమైన మతపరమైన ఆచారం'గా ప్రకటించారు, ఉన్నత ధర్మాసనానికి సూచించకుండానే, కట్టుబడి ఉన్న మూడు డివిజన్ బెంచ్ తీర్పులను తోసిపుచ్చారు. ప్రార్థనా ప్రదేశాల చట్టం – 1991ను ఒక అసౌకర్యంగా కొట్టిపారేశారు.

ఈ ఉత్తర్వును అమలు చేస్తే రాగల శాంతిభద్రతల ప్రమాదాల ను రాష్ట్ర ప్రభుత్వం చూపగా, న్యాయమూర్తి భారత న్యాయ చరిత్రలో అపూర్వమైన చర్యకు పాల్పడ్డారు. పది మంది పిటిషనర్లకు చీకటిలో కొండపైకి ఎస్కార్ట్ ఇవ్వాలని కోర్టులు, అణు సంస్థలకు రక్షణగా ఉండే సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) పారామిలిటరీ యూనిట్‌ను ఆదేశించారు. న్యాయవ్యవస్థ మతపరమైన కవ్వింపు చర్యకు సాయుధ విభాగంగా మారింది.

ఇది ఒంటరి అపరాధం కాదు. ద్రావిడ హృదయభూమిలో అయోధ్య నమూనా ఉద్దేశపూర్వక ప్రతిరూపం ఇది. ఇది పక్షపాత న్యాయవ్యవస్థ, ఆర్ఎస్ఎస్, బిజెపి వ్యవస్థ రాజ్యాంగ రక్షణలపై, ప్రజాస్వామ్య సమాఖ్య వ్యవస్థపై, శతాబ్దాల సహజీవనంపై జరుగుతున్న వ్యవస్థీకృత దాడి యొక్క ప్రమాదకరమైన కలయికను బహిర్గతం చేస్తుంది.

జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ సిద్ధాంతపరమైన మొగ్గు ఊహాజనితం కాదు. అది ప్రజా బాహుళ్యంలో ఉంది. ఆయన ఆర్ఎస్ఎస్ శాఖలను ఉద్దేశించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని వలసవాద భారత ప్రభుత్వ చట్టం 1935 నకలు పత్రంగా అభివర్ణించారు (ఇది సంఘ్‌కు ఇష్టమైన చర్చాంశం). కోర్టులో బహిరంగంగానే తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె. అన్నామలైని ప్రశంసించారు. మెజారిటీ తరగతుల కేసులకు నిరంతరం అనుకూలంగా ఉండే ఉత్తర్వులను వరుసగా అందించారు. లావణ్య ఆత్మహత్య కేసులో, ఆయన 'బలవంతపు మత మార్పిడి' అనే ఆరోపణను ప్రచారం చేశారు. దీనిని తరువాత డివిజన్ బెంచ్ కొట్టివేసింది. అర్చక నియామక కేసులో, ఆయన దశాబ్దాల ద్రావిడ సామాజిక న్యాయ విధానాన్ని ఒక్క దెబ్బతో తిప్పికొట్టారు. తిరుపరన్‌కుంద్రం అనేది తాజా ఉదాహరణ మాత్రమే.

శిరోధార్యంగా ఉన్న మూడు డివిజన్ బెంచ్ తీర్పులను విస్తృత ధర్మాసనానికి నివేదించడానికి నిరాకరించడం ద్వారా జస్టిస్ స్వామినాథన్ న్యాయపరమైన క్రమశిక్షణలోని అత్యంత ప్రాథమిక సూత్రాన్ని ఉల్లంఘించారు. పెక్కు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పును సింగిల్ జడ్జి తిరస్కరించదలచినపుడు ఆ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించటం ప్రాథమిక న్యాయసూత్రం. దాన్ని పాటించకపోవటంలో సందేశం స్పష్టంగా ఉంది. సంఘ్ ఎజెండాకు అడ్డుగా ఉన్నప్పుడు మాత్రమే పూర్వాచారాలు, మర్యాద, ప్రార్థనా ప్రదేశాల చట్టం అడ్డంకులు అవుతాయి.

పిటిషనర్ రామ రవికుమార్ సాధారణ భక్తుడు కాదు. ఆయన హిందూ మక్కళ్ కట్చి తమిళనాడు కార్యదర్శి. ఇది అందరికీ తెలిసిన ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థే. ఈ సమీకరణను హిందూ మున్నాని, బిజెపి నాయకులు హెచ్. రాజా, నైనార్ నాగేంద్రన్ నడిపించారు.



కేంద్రమంత్రి ఎల్. మురుగన్, #StalinAgainst Murugan, #Hindu Rights denied అని అరిచే ఐటి సెల్ హ్యాండిల్స్ సైన్యం ఈ వృత్తాంతాన్ని మరింత పెంచాయి.

ఇది అయోధ్య ప్రతిరూప పాఠ్యపుస్తకం లాంటిది. ఒక ఫిర్యాదును సృష్టించండి ('100 సంవత్సరాలుగా దీపం వెలిగించే హక్కును హిందువులకు నిరాకరించారు' అనేది చారిత్రక ఆధారం లేని వాదన). కట్టుబడి ఉండే పూర్వాచారాన్ని విస్మరించే అనుకూలమైన దిగువ కోర్టు ఉత్తర్వును పొందండి. శాంతిభద్రతలను అమలు చేయాలని రాష్ట్రాన్ని సవాలు చేయండి. ఆపై పోలీసులు చర్య తీసుకున్నప్పుడు 'హిందూ వ్యతిరేక అణచివేత' అని అరవండి. ఎన్నికలకు ముందు 'హింసించబడిన భక్తుల' చిత్రాలతో టెలివిజన్‌ను నింపండి.

ఉత్తరప్రదేశ్‌లో ఈ స్క్రిప్ట్ ఇప్పటికే ప్రాణాలను బలిగొంది. 2024 నవంబర్‌లో సంభాల్‌లో కోర్టు ఆదేశించిన సర్వే అల్లర్లను ప్రేరేపించిన ఘటనలో ఆరుగురు మరణించారు. తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఆ ఎరను స్వీకరించడానికి నిరాకరించారు. కలెక్టర్ ఎం.ఎస్. ప్రవీణ్ కుమార్, కమిషనర్ జయకాంతన్ సెక్షన్ 163 బిఎన్ఎస్‌ను అమలు చేసి, దృఢంగా నిలబడి, రక్తపాతాన్ని నిరోధించారు. డిసెంబర్ 5న సింగిల్ జడ్జి ఉత్తర్వుపై సుప్రీం కోర్టు స్టే విధించి, రాష్ట్రం ఎస్ఎల్‌పిపై నోటీసు జారీ చేసింది. ప్రస్తుతానికి, విచక్షణ నిలబడింది.కానీ వ్యవస్థాగత నమ్మకానికి జరిగిన నష్టం జరిగిపోయింది.

తిరుపరన్‌కుంద్రం ఎపిసోడ్ అనేక రాజ్యాంగ స్తంభాలపై ప్రత్యక్ష దాడి:ఆర్టికల్ 25, 26 వర్సెస్ ఎంపిక చేసిన మెజారిటీ తత్వం: మతాన్ని ఆచరించే హక్కు సంపూర్ణమైనది కాదు; ఇది శాంతి–భద్రతలు, నైతికత, ఆరోగ్యంకు లోబడి ఉంటుంది. ఉచచ్చిపిల్లయార్ వద్ద మాత్రమే దీపం వెలిగించడం సామరస్యాన్ని కాపాడుతుందని వరుస కోర్టులు గుర్తించాయి. జస్టిస్ స్వామినాథన్ ఈ తర్కాన్ని తలక్రిందులు చేశారు. పరిఢవిల్లిన శాంతి కంటే కనిపెట్టిన 'ముఖ్యమైన ఆచారం'కి ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రార్థనా ప్రదేశాల చట్టం అనేది 1991లో బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో రూపొందించబడిన చట్టం. ఇది 1947 ఆగస్టు 15న ఉన్నట్లుగా ఆరాధన స్థలాల మతపరమైన లక్షణాన్ని స్తంభింపజేస్తుంది. 700 సంవత్సరాలుగా దర్గా ఉన్న కొండపై కొత్త మతపరమైన ఆచారాన్ని ఆదేశించడం ద్వారా, న్యాయమూర్తి పార్లమెంటు అభీష్టాన్ని ఆచరణలో తిరస్కరించారు.

**సమాఖ్య వ్యవస్థ:** రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే ఉత్తర్వును అమలు చేయడానికి పారామిలిటరీ దుర్వినియోగం జరిగినప్పటికీ కేంద్రం విచిత్రంగా మౌనంగా ఉంది. డిఎంకె ఎంపీ టి.ఆర్. బాలు పార్లమెంటులో జస్టిస్ స్వామినాథన్‌ను ' ఆర్ఎస్ఎస్ న్యాయమూర్తి' అని పిలిచినప్పుడు, బిజెపి ఎంపిలు న్యాయపరమైన అతిక్రమణను ఖండించడానికి బదు లు సభాకార్యక్రమాలకు అంతరాయం కలిగించారు.

**న్యాయపరమైన ఔచిత్యం:** పది మంది పిటిషనర్ల కోసం సిఐఎస్ఎఫ్‌ను ఒక ప్రైవేట్ మిలీషియాగా మోహరించడం అనేది స్వతంత్ర భారతదేశంలో ఎటువంటి పూర్వాచారమూ లేని అధికార దుర్వినియోగం.

తమిళనాడు ఉత్తరప్రదేశ్ కాదు. ఇక్కడ, పెరియార్ హేతువాదం, భక్తి ఉద్యమంలోని విప్లవాత్మక సమానత్వం, శతాబ్దాల జైన బౌద్ధ ఇస్లామిక్ హిందూ పరస్పర చర్యలు ఒక సంస్కృతిని సృష్టించాయి. ఇక్కడ దర్గాలు హిందూ భక్తులకు ఆతిథ్యం ఇస్తాయి. కులం, మతాన్ని అపహాస్యం చేసిన తమిళ సాధువులైన కవులతో ఆలయాలు మారుమోగుతాయి. రాజకీయ పార్టీలు నాస్తిక మూలాలు కలిగిన డిఎంకె కూడా పరిఢవిల్లుతున్న విశ్వాసాన్ని ఆయుధంగా చేయకుండా గౌరవిస్తాయి.

ఆర్ఎస్ఎస్ బిజెపిలకు ఇది తెలుసు. అందుకే తిరుపరన్‌కుంద్రం ఎంచుకోబడింది. సహజీవనం చేసే ద్రావిడ నమూనాను విచ్ఛిన్నం చేయండి, అప్పుడు దక్షిణ భారతదేశం మిగిలిన ప్రాంతంలాగా దుర్బలత్వం అవుతుంది. డిఎంకె నాయకుడు ఎ.రాజా హెచ్చరించినట్లుగా: "మీరు 1991లో అద్వానీ రథయాత్రతో దీనిని ప్రయత్నించారు. చెప్పులతో తరిమికొట్టబడ్డారు. మళ్లీ ప్రయత్నించండి, మేము మిమ్ములను చీపుర్లతో తరిమికొడతాం"

ఇప్పుడు తాళం సుప్రీం కోర్టు చేతిలో ఉంది. సింగిల్‌జడ్జి ఉత్తర్వును స్పష్టంగా కొట్టివేయడంలో, సిఐఎస్ఎఫ్ దుర్వినియోగాన్ని అభిశంసించటంలో, ప్రార్థనా ప్రదేశాల చట్టానికి కట్టుబడి ఉండే స్వభావాన్ని పునరుద్ఘాటించడంలో విఫలమైతే, మెజారిటీ వర్గాల ఉద్వేగాలు రగిలించబడినప్పుడు రాజ్యాంగ రక్షణల గూర్చి సంప్రదించుకోవచ్చు అనే సందేశాన్ని పంపుతుంది.

తిరుపరన్‌కుంద్రం ఒక దీపం గురించి కాదు. ఎన్నికల లాభం కోసం హిందూ–ముస్లిం వైరుధ్యాన్ని శాశ్వతంగా ఉంచే ఉత్తర భారత రీతిలోకి తమిళనాడు బలవంతంగా నెట్టబడుతుందా అనేది సమస్య.

తమిళనాడు ప్రజలు ఈ సినిమాను ఇంతకు ముందు చూశారు. అది ఎలా ముగుస్తుందో వారికి తెలుసు. వారు రీమేక్‌కి సిద్ధంగా లేరు.

*(ఐపిఎ సర్వీస్)*

# మతం, శాస్త్రీయ దృక్పథం.. ఉపాధ్యాయుల కర్తవ్యం

ఇటీవల పాఠశాలలో మతపరమైన పుస్తకాలను పంపిణీ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటూ ఓ ఉపాధ్యాయుడు సస్పెండ్ అయ్యారు. మరో చోట సైన్స్ ప్రయోగాలను వివరించే క్రమంలో ఒక మతం వారి మనోభావాలను దెబ్బతీశారనే ఆరోపణలు ఇంకో టీచర్ ఎదుర్కొన్నారు.ఇటువంటి సంఘటనలు అక్కడక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో మతం, శాస్త్రీయ దృక్పథం వంటి విషయాల్లో ఉపాధ్యాయ సిబ్బంది ఏ విధం గా వ్యవహరించాలో ఓసారి చూద్దాం.

విద్యాలయం, దేవాలయం వేరు. వివిధ ప్రార్థనా మందిరాలకు ఎక్కువగా ఆయా మతస్థులే వెళుతుంటారు. కాబట్టి మత బోధకులు తాము ఆచరించే విషయాలే బోధిస్తారు. అయితే వారు కూడా తప్పనిసరిగా రాజ్యాంగ నియమాలకు లోబడే వ్యవహరించాలి. తమ ఉపన్యాసాల్లో ఇతర మతాలని విమర్శించకూడదు. శబ్ద కాలుష్యానికి కారణం కాకూడదు. మతం పేరిట ఎవరిని రెచ్చకొట్టకూడదు. ఎవరిపైనా కూడా తన నమ్మకాలను, అభిప్రాయాలను బలవంతం గా రుద్దకూడదు. అదే విధంగా భక్తులకు ఏదైనా అనారోగ్య సమస్య వస్తే, తానే స్వయంగా తగ్గిస్తామని చెప్పకూడదు. తనకు మహిమలు ఉన్నాయని చెప్పకూడదు.

అదే విధంగా పాఠశాలల్లో ఉపాధ్యాయ సిబ్బంది మతపరమైన విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఎందుకంటే పాఠశాల అనగానే, అందులో వివిధ మతాల పిల్లలు ఉంటారు. ఉపాధ్యాయ సిబ్బంది కచ్చితంగా రాజ్యాంగ నిబంధనలు పాటించాలి. మత గ్రంథాల ఆధారంగా విద్యార్థులకు పోటీలు పెట్టకూడదు. కాకపోతే ఒక ప్రాంత సంస్కృతిని, చరిత్రను పరిచయం చేసే క్రమంలో మతం, పండుగల గురించి చెప్పవచ్చు. ఇటువంటి సమయంలో పరమత సహనాన్ని పాటించాలి.ఇతర మతాల పై విమర్శలు చేయకూడదు. మతానికి సంబంధించిన ఎటువంటి మెటీరియల్ పంపిణీ చేయకూడదు. తాను ఆచరించే మతమే గొప్పదని చెప్పకూడదు. విద్యార్థులకు వివిధ పండుగలని పురస్కరించుకొని శుభాకాంక్షలు చెప్పవచ్చు. వివిధ పండుగల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పవచ్చు. అదే సమయంలో విద్యార్థులు పాటించే వివిధ ఆచారాలని గేలి చేయకూడ దు. హేళనగా మాట్లాడకూడదు.

అన్నింటికంటే ముఖ్యంగా ఉపాధ్యాయ సిబ్బందికి శాస్త్రీయ దృక్పథం చాలా అవసరం. మతం ఒక వ్యక్తిగత అంశం. మతం, దేవుడు గురించి చెప్పేవారు చాలా మంది ఉంటారు. కానీ వైజ్ఞానిక విషయాలు చెప్పేవారు కొద్ది మంది మాత్రమే ఉంటారు. పిల్లలలో రోజురోజుకు పెరుగుతున్న మూఢ నమ్మకాలు తొలగించాలంటే, వారికి సైన్స్ పరిశోధనలు గురించి చెప్పాలి. వివిధ శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను పరిచయం చేయాలి. చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు వారికి నేర్పాలి. మానవత్వం గురించి వివరించాలి. ఉపాధ్యాయ సిబ్బందికి కూడా సైన్స్ పట్ల ఆసక్తి ఉండాలి.

మతం విషయంలో ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే కాదు, బహిరంగ ప్రదేశాల్లో కూడా జాగ్రత్తగా ఉండాలి. మత బోధనను వారు ఒక ఆదాయ వనరుగా చూడకూడదు. మత క్రతువులను పాఠశాలల్లో నిర్వహించకూడదు.మత పరంగా తాము నమ్మిన వ్యక్తిగత అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దకూడదు. వారికి నైతిక విలువలు, మాన వ హక్కులు గురించి చెప్పవచ్చు.

ఉపాధ్యాయులు కూడా మనుషులే. వారికి కూడా వ్యక్తిగత విశ్వాసాలు ఉంటాయి. కొంతమంది తాముననమ్మిన నమ్మకాలను (మత పరమైన )బోధనలో జోడిస్తారు. ఇటువంటి వాటిని చాలావరకు పరిమితం చేయాలి. మన రాజ్యాంగం మత స్వేచ్ఛను ఒక హక్కుగా చెప్పింది. అదే సమయంలో శాస్త్రీ య దృక్పథం యొక్క ఆవశ్యకత గురించి తెలిపింది. విద్యార్థులు జ్ఞానాన్ని పొందే ప్రారంభ దశలో ఉంటారు కాబట్టి, వారికి అర్థం అయ్యే విధంగా సైన్స్ ను బోధించాలి. పాఠశాలల్లో వీలైనంత మేరకు మతాల విషయంలో వివాదాస్పద చర్చలు పెట్టుకోకూడదు. పిల్లలను సమానంగా చూడాలి. అప్పుడే పిల్లలు మంచి పౌరులుగా ఎదుగుతారు.

**ఎం. రాం ప్రదీప్,**
9492712836

# గురుకులాలకు పట్టిన గ్రహణం వీడేనా?

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అలాంటి పరిశుభ్రమైన ఆహారం కోసం పరితపిస్తూ గురుకుల విద్యార్థులు రోడ్డెక్కుతున్న పరిస్థితి నేడు రాష్ట్రంలో కనబడుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి విద్యకు తమ ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యతను ఇస్తుందో తెలియజేస్తూ, ఇచ్చిన మాట ప్రకారం ఒయు కు వెయ్యికోట్లు మంజూరు చేసిన తీరును మెచ్చుకోవాలి. సమాజంలో అసమానతలు తొలగిపోవాలంటే విద్య ఎంతో అవసరం అంటున్న వీరి పాలనలోనే ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తే కొండంత నిర్లక్ష్యం కనిపించడం విశేషం. పాడైన అన్నం వడ్డిస్తున్నారంటూ రాష్ట్రంలో పేరెన్నికగన్న ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజ్ విద్యార్థులు నిరసన తెలియజేయడం, ఇందుకు విశ్వవిద్యాలయాలు సైతం మినహాయింపు కాదని తెలిపే సంఘటన ఇది. అలాగే రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు కనీస సౌకర్యాలు సైతం లేవని, వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, ప్లకార్డ్స్‌తో గంటల తరబడి నిరసన తెలియజేయడం కూడా నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపడమే. ఇక ప్రభుత్వ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తూ, పట్టెడన్నంకోసం పరితపిస్తున్న విద్యార్థుల వెత లు చెప్పనలవి కానివి. నాణ్యమైన విద్యాబోధన సంగతి అటుంచి, సరైన పోషకాహారంతో కూడిన భోజనం అందక విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అవస్థలు పడుతూ, ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆసుపత్రుల పాలు అవడం నిత్యకృత్యంగా మారింది. ప్రాణాలు సైతం పోతున్న దుస్థితిని కూడా మనం చూశాం.

మూడొంతుల అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల వ్యవస్థ నిర్వాహణ ఎంత దయనీయంగా ఉందో మాటల్లో చెప్పనలవి కానిది. అందుకు గతంలో జరిగిన చాలా ఉదంతాలు ఉన్నాయి. మెనూ పాటించడం లేదని, పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, తమగోడు వినే వారు లేరని పసి హృదయాలు పరిశుభ్రమైన ఆహారం కోసం తల్లడిల్లి నేరుగా జిల్లా కలెక్టర్‌నే కలిసి తమ పాఠశాలలో తిష్ట వేసిన సమస్యలు విన్నవించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు తరగతి గదులు వదిలి పాదయాత్రగా రోడ్డెక్కిన తీరు సమాజాన్ని ఆలోచింపజేసింది. అలాగే వనపర్తి జిల్లా చిట్యాల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు మెనూ పాటించడం లేదని, సరైన భోజనం పెట్టడం లేదని జిల్లా కలెక్టర్‌కి వినతి పత్రం రాసుకొని 70మంది పదవతరగతి విద్యార్థులు పాఠశాల గోడదూకి పంట పొలాల మీదుగా కలెక్టర్ కార్యాలయం వైపు పరుగులు తీయడం విస్మయాన్ని కలిగించింది. పర్యవేక్షణ లోపం వల్ల సరైన భోజనం కూడా అందక మునుపెన్నడూ చూడని విధంగా కల్తీ ఆహారంతో కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు లాంటి అనారోగ్య సమస్యలతో వందలాది మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలు అవుతుండటం మనస్సును కలచివేసింది. గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఉదయం కిచిడీ తిని 31 మంది బాలికలు అస్వస్థతకు గురికా



వడం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విషం కలిపిన నీళ్లు తాగి 11 మంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురికావడం, ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో కిచిడీ తిని 37 మంది విద్యార్థినిలు కడుపునొప్పి, వాంతులు, ఆయాసంతో బాధపడుతూ ఆసుపత్రికి చేరడం, అలాగే కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన లో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలోని పిల్లలు రాత్రి భోజనం చేసి తీవ్ర అస్వస్థతకు గురికావ డం, నాగర్ కర్నూల్‌లోని ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులంలో పెరుగు తినడం వల్ల 111మంది బాలికలు అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరడం, కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం షెట్లూరు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి 22 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడం, కొద్ది రోజులక్రితం జోగులాంబ గద్వాల జిల్లాకేంద్రంలోని భీమ్ నగర్ ఎస్టీ బాలుర వసతిగృహంలో ఉదయం అల్పాహారంగా అందించిన నాసిరకం ఉప్మా తిని 14 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలుకావడం, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా శామీర్ పేట మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, పాఠశాల భవనాలు పై పెచ్చులూడి పడుతున్నాయని, బాత్రూం క్లీన్‌చేసే బ్రెష్‌లతో వంటపాత్రలు శుభ్రం చేస్తున్నారని ఆరోపి స్తూ, పోలీసులను ఆశ్రయించడం సంచలనంగా మారింది. ఇలాంటి ఘటనలు ఎన్నో!

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ, ట్రైబల్ వెల్ఫేర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, మైనార్టీ శాఖలు సుమారు 1023 గురుకులాలను నడుపుతున్నాయి. వీటికి తోడు మోడల్ స్కూల్స్ 194, కెజిబివి పాఠశాలలు 495 అదనం. వీటిలో సుమారు ఆరు లక్షల యాభై వేలమంది విద్యార్థులు తమ భవితను వెతుకుతున్నారు. వీటితోపాటుగా 33 జిల్లాల్లో 41,648 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో దాదాపుగా 66,38,007 మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో పలువురు విద్యార్థులు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. తెలంగాణ రైజింగ్ 2027 లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం వైపు పరుగుపెట్టడం, పాఠశాల, కళాశాల, వృత్తి నైపుణ్యం కోర్సులలో మార్పులు తేవడానికి ప్రయత్నం మొదలు పెట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ గురుకులాల విద్యా వ్యవస్థలో మౌలిక సదుపాయాలతో కూడిన ప్రక్షాళనకు కూడా అంతే వేగంగా నడుం బిగించాలి. పిల్లల మదిలో ఆత్మ విశ్వాసం నింపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ధీరన్ కొడారి,** 8008200664

# వలసదారులకు మానవ హక్కులు వర్తించవా!

మానవ వలసలు ఒక ప్రమాదకర అంతర్జాతీయ సమస్యగా రోజురోజుకు ప్రపంచ మానవాళిని వేధిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 2014 నుంచి నేటివరకు కనీసం 70,000 మంది వలసదారులు తమ ప్రాణాలను కోల్పోయారని లేదా ఆచూకీ తెలియకుండా పోయిందని, వాస్తవానికి ఈ సంఖ్య అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని అధ్యయనాలు స్పష్టంగా చేస్తున్నాయి. ఒక్కొక్క వలసదారు మరణం ఒక్కో కుటుంబానికి తీరని వ్యథను మిగిల్చిందని గమనించాలి. నేడు ప్రపంచ వ్యాప్తంగా పలు కారణాలతో మానవ వలసలు క్రమంగా పెరగడం రాను న్న కాలంలో ఒక భయానక మానవీయ సంక్షోభంగా మారనుందని స్పష్టం చేస్తున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులు, నిరంకుశ పాలనలు, ఆహార అభద్రత, మానవీయ సంక్షోభా లు, ఆర్థిక అసమానతలు లాంటి పలు కారణాలు వలసదారుల సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయి.

**మానవ సంక్షోభాలతో వలసదారుల పుట్టుక**

2023లో ప్రపంచవ్యాప్తంగా వలసదారుల వేదనలు పెరగడం చూసాం. ఇజ్రాయిల్ పాలస్తీనా, ఉక్రెయిన్ రష్యా యుద్ధాలు, బంగ్లాదేశ్‌లో అంతర్గత రాజకీయ సంక్షోభం, ప్రకృతి విపత్తులు, ఆకలి కేకలు లాంటి కారణాలతో మానవ వలసల వరదలు పారడం, ఇరుగు పొరుగు దేశాల్లోకి లేదా సురక్షిత ప్రాంతాల్లోకి శరణార్థులుగా చేరడం, యుద్ధాలు లేదా అల్లరులతో ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని ఇండ్లు వదిలి వలసదారులు పట్టడం చూసాం. వలసదారుల శ్రమ శక్తి, నైపుణ్య లక్షణాలు, ఆవిష్కరణ ఆలోచనలు, ఔత్సాహిక ప్రవృత్తులు నేటి సమాజానికి ఎంతో ఉపకరిస్తాయని మరువరాదు. వలసదారులతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి కనిపిస్తుందని, వారికి అవకాశాలు కల్పిస్తే సమాజాభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడతారని తెలుసు కోవాలి.

**అంతర్జాతీయ వలసదారుల దినం-2025 ఇతివృత్తం**

మిలియన్లకొద్ది వలసదారులు తమ గృహాలను వదిలి ప్రాణాలు కాపాడుకోవడానికి పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఇతర దేశాలు లేదా ప్రాంతాలకు పరుగులు తీయడాన్ని ఒక అమానవీయ చర్యగా భావించిన ఐరాస సభ్య దేశాలు 2000 నుంచి ప్రతి ఏట 18 డిసెంబర్ రోజున "అంతర్జాతీయ వలసదారుల దినం లేదా ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. వలసదారుల పట్ల మానవ హక్కుల ఉల్లంఘనలకు సమాధానాలు, వారి దయనీయ పేదరికాలు, సమ్మిళిత అభివృద్ధి ఆశయాలు, వలసదారుల పరిరక్షణ పాలసీలు, వారి భద్రత, వారి శాంతి సురక్షలు, మానవీయ హక్కుల కల్పనలు, ఆకలి చావులను అడ్డుకోవడం, గౌరవంగా జీవించే హక్కును, స్వేచ్ఛ ను కలిపించడం, వివక్ష కోరల్లో చిక్కడం, హింసల పాలు కావడం, క్రూర మానవ అక్రమ రవాణా వలలో చిక్కడం, వారి అభిప్రాయాలు/కన్నీళ్లకు విలువలేక పోవడం లాంటివి పలు అంశాలను చర్చించి సరైన సమాధానాలు వెతకడానికి ఈ వేదికలు ఉపకరిస్తున్నాయి. అంతర్జాతీయ వలసదారుల దినం–2025 ఇతివృత్తంగా "నా విజయ గాథ : సంస్కృతి, అభివృద్ధి (మై గ్రేట్ స్టోరీ : కల్చర్స్ అండ్ డెవలప్మెంట్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. వలసదారుల కుటుంబాలను కాపాడడం, వారి సురక్షకు గొడుగులు పట్టడం మనందరి కనీస ధర్మం అని తెలుసుకోవాలి. వలసదారుల శ్రమ దోపిడీ ఒక ప్రధాన సమస్యగా మారడం విచారకరం.

**భారత్‌లో అంతర్గత వలసలు:** తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ రంగం, వ్యవసాయరంగాలు, వ్యాపారాలు, నైపుణ్య రంగాల్లో బిహార్, యుపి, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు చెందిన ప్రజలు వలసలు రావడం చూస్తున్నాం. భారత్ లాంటి దేశాల్లో పని, ఆహార భద్రత, పేదరికం లాంటి కారణాలతో పట్టణాలు లేదా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం. బలవంతంగా అయినా లేదా మరో దారి లేనపుడు వలసలు పెరుగుతున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, పర్యావరణ కారణాలతో భారత దేశంలో వలసలు కనిపిస్తున్నాయి. వలసదారుల సమస్య ఫలితంగా పౌర సమాజంపై సానుకూల, ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, జనాభా పరమైన, సామాజిక, పర్యావరణ కోణాల్లో పలు సమస్యలు లేదా అనుకూల ఫలితాలు గమనించవచ్చు. మానవ హక్కుల ను కోల్పోవడం, సామాజిక అభద్రత, కనీస అవసరాల కొరత, గౌరవమైన పని దొరక్కపోవడం, వైద్య ఆరోగ్య అభద్ర త, కనీస వేతనాలు దొరక్కపోవడం, మురికి కూపాల్లో జీవనా లు లాంటి పలు సమస్యలు వలసదారులను వేధిస్తున్నా యి. వలసదారులు మనలాంటి సాధారణ మానవులే అని, వారికి కూడా గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని తెలుసుకొని వారిని నవ సమాజంలో భాగంగా చూసుకుందాం, మానవీయ విలువలను కాపాడుదాం.

(18 డిసెంబర్ అంతర్జాతీయ వలసదారులు దినం సందర్భంగా)

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## యూనిఫామ్ కోసం ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/అల్లాదుర్గం :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు ప్రిన్సిపాల్ సత్తయ్య యూనిఫామ్ కొరకు విద్యార్థికి చెక్కు అందజేశారు. అల్లాదుర్గం ప్రభుత్వ కళాశాలకు సక్రమంగా హాజరుకాని విద్యార్థుల కోసం బుధవారం వారి ఇంటి వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు, విద్యార్థులకు చదువులతో ఎన్ని లాభాలు ఉంటాయో వారు వివరించారు. విధిగా విద్యార్థులు కళాశాలకు రావాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేక, కూలి పనులకు వెళ్తున్న విద్యార్థికి ప్రిన్సిపల్ తన సొంత ఖర్చులతో వారికి సహాయం అందించారు. విద్యార్థులు కళాశాలకు రోజు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహారెడ్డి, శ్యామ్ రావు, రవీందర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

## అక్రమ మట్టి రవాణాపై అధికారుల కపట ప్రేమ



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** పట్టుకున్న మట్టి ట్రాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అధికారులు వదిలేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను బెల్లంపల్లి రెవెన్యూ కార్యాలయానికి తరలించి మట్టిని అక్కడే డంపు చేయించారు. లోడుతో పట్టుకున్నప్పటికీ వాహనాలపై లేదా యజమానులపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వదిలేశారని తెలుస్తోంది. ఇకముందు మట్టిని తరలించామని హామీ తీసుకుని పంపించివేసినట్లు సమాచారం. మట్టి దొంగలపై అధికారులు కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయాన్ని మీడియాకు తెలియకుండా గోప్యంగా ఉంచడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## నదిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/పిట్లం:** తన ఆరోగ్యం సహకరించకపోవడంతో ఏ ఆసుప్రతిలో చూపించుకున్న మెరుగవకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పిట్లం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై టి.వెంకట్‌రావ్ తెలిపిన కథనం ప్రకారం వర్ని మండలం గోవూరుకు చెందిన కమ్మరి శ్యాంకుమార్(59) కార్పెంటర్‌గా పనిచేసేవాడని, గత కొన్నిరోజులుగా కంటి సమస్యతో బాధపడుతుండగా బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి గ్రామ శివారులో గల మాంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.వెంకట్‌రావ్ వెల్లడించారు. శ్యాంకుమార్ ఈనెల 12వ తేదీనా మంజీరాలోకి దూకగా బుధవారం మృతదేహం లభ్యమైనట్లు పేర్కొన్నారు.

## బైక్ కొనివ్వలేదని యువకుడి బలవన్మరణం



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** బైక్ కొనివ్వలేదని బీర్నంది గ్రామానికి చెందిన భుక్య వెంకటేష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖానాపూర్ మండలం బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన భుక్య వెంకటేష్(21)తన తండ్రి బలిరాంను బైక్ కొనివ్వాలని అడిగాడు. పంట చేతికి అందివచ్చిన అనంతరం బైక్ కొనిస్తానని తండ్రి చెప్పినా వినలేదు. మనస్తాపం చెందిన వెంకటేష్ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు విషయం తండ్రికి చేరవేయడంతో తండ్రి, బంధువులు వెంకటేష్‌ను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఖానాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కరెంట్ షాక్‌తో గేదె మృతి




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** నిర్మల్ రూరల్ మండలంలోని తల్వేద గ్రామంలో కరెంట్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. తల్వేద గ్రామానికి చెందిన బక్కొల్ల సాయేందర్ రోజు వారి లాగే తన గేదెలను మేత కోసం పొలాల్లోకి తీసుకెళ్లాడు.. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు గేదె తగలడంతో కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు హైట్ పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్ గద్దె దిగువవడంతో గేదె మృతి చెందింది. గమనించిన రైతు వెంటనే విద్యుత్ అధికారులకు తెలుపడంతో సంఘటన స్థలాన్ని సందర్శించారు. చనిపోయిన గేదె విలువ సుమారు 90,000 ఉంటుందని రైతు వాపోయారు. వెటర్నరీ డాక్టరు సంఘటన స్థలంలో పంచనామ నిర్వహించారు.విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు కోరారు.

## భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తకు ఐదేళ్ల జైలు

**ప్రజాపక్షం/నెన్నెల/ బెల్లంపల్లి :** భార్యను అనుమానంతో వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. బుధవారం మంచిర్యాల సెషన్స్ కోర్టు జడ్జి రామ్ మోహన్ రెడ్డి ఈ మేరకు తీర్పు వెలువరించారు. నిందితుడికి జైలు శిక్షతో పాటు ఆరు వేల రూపాయల జరిమానా విధించారు. రామగుండం ఎల్లంపల్లికి చెందిన గొర్రె తిరుపతి తన సోదరి స్వప్నను నెన్నెల మండలం అవడం గ్రామానికి చెందిన ఆసాది బాపుకు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహం జరిగిన ఏడాది తర్వాత బాపు భార్యను అనుమానిస్తూ వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన స్వప్న 2014 అక్టోబర్ 12న ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేయగా ఎస్ఐ తిరుపతి దర్యాప్తు పూర్తి చేశారు.

## మిట్టపెల్లిలో ఉద్రిక్తత

### బ్యాలెట్‌బాక్సులను మార్చే ప్రయత్నమంటూ ఆరోపణలు



**ప్రజాపక్షం/జైపూర్ :** కౌంటింగ్ ప్రక్రియను ఆలస్యం చేస్తూ బ్యాలెట్ బాక్సులను మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ చెన్నూర్ మాజీ ఎంఎల్‌ఏ బాల్క సుమన్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. బుధవారం మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని మిట్టపెల్లి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభించాల్సిన కౌంటింగ్ ప్రక్రియను అధికారులు కావాలని ఆలస్యం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. కౌంటింగ్ జాప్యానికి తోడు బ్యాలెట్ బాక్సులను మార్చే ప్రయత్నం జరిగిందని ఆరోపిస్తూ పోలింగ్ కేంద్రం ఎదుట బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్, బిఆర్ఎస్ శ్రేణులు పరస్పరం పోటాపోటీగా నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రం పరిసరాల్లో భారీగా పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజా రమేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కలెక్టర్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మరోసారి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే నిజాంసాగర్ మాగి గ్రామాల మధ్యలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కలెక్టర్ మానవత్వంతో స్పందించి తన వాహనంలో హుటాహుటీనా ఆసుపత్రికి తరలించారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా మధ్యాహ్నం 2 గం.లకు ఆయా మండలాల్లో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు కలెక్టర్ వెళ్తుండగా మార్గమధ్యంలో ఆటో బైకు ఢీకొన్న ఘటనలో గాయాలపాలైన వ్యక్తిని ఆలస్యం చేయకుండా తక్షణం స్పందించి తన వాహనంలో సమీప ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్, ముధోల్ :** జిల్లాలో మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం బైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో కల్పించిన వసతులను చూశారు. పోలింగ్ బూత్‌ల వారీగా తిరుగుతూ, జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ.. ఎన్నికల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరుసలో నిలబడ్డ ఓటర్లతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయో, అన్ని వసతులు కల్పించారో లేదో వాకబు చేశారు. ఎన్నికల అధికారులు అన్ని ఫారములను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూరించాలని అన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ పూర్తయ్యే వరకు నమోదైన పోలింగ్ శాతం వివరాలను సమయానికి అందించాలని అన్నారు. ఓట్ల లెక్కింపుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారో లేదో చూశారు. ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని తెలిపారు. వైద్య శిబిరం, సహాయ కేంద్రాలను పరిశీలించారు. ఆ తర్వాత కుబీర్ మండలం మాలేగాం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ నిర్వహణలో ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అని చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండు దశల్లో ఎక్కడ కూడా ఎలువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా, విజయవంతంగా పోలింగ్ పూర్తయిందని అన్నారు. ఈ ఎన్నికల కేంద్రం తనిఖీలలో బైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్



కుమార్, డిపిఓ శ్రీనివాస్, కుబీర్ ప్రత్యేక అధికారి (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) శంకర్, తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్, శివరాజ్, ఎంపీడీవోలు నీరజ్ కుమార్, సాగర్‌రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ /భీమ్‌గల్ :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ముగిసింది. 3 విడతలలోనూ ఎన్నికలు సజావుగా కొనసాగాయని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. 3వ విడత పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల సమయానికి సగటున 23.35 శాతం పోలింగ్ నమోదైంది. 11 గంటల సమయానికి 54.69 శాతం ఓటింగ్ పూర్తయిందని అధికారులు ప్రకటించారు. కాగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బాల్కొండ, అంకాపూర్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరును, పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్మూర్, బాల్కొండ, భీమ్‌గల్, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బంధీ ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్‌లాల్ సైతం పోలింగ్ కేంద్రాలను విస్తృతంగా సందర్శిస్తూ ఓటింగ్ తీరుతెన్నుల పరిశీలన జరిపారు. భీమ్‌గల్, బడాభీమ్‌గల్, రామన్నపేట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, అంకాపూర్, ముప్కాల్, బాల్కొండ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అంకా పూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు.



# ఆదర్శ వార్డులో శరవేగంగా అభివృద్ధి పనులు



పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** ఇంద్రేశం మున్సిపాలిటీని అన్ని రంగాలలో ఆదర్శకంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం భారీ నిదులు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మాట్లాడుతూ పట్టుదలతో పనిచేస్తే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్సార్ నిధులను కూడా అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న 56 మంది పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్‌లు, పంపిణీ చేసి నూతన వార్డులకు చెత్త సేకరణ రిక్షాలను అందజేశారు. అలాగే మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసి బస్ షెల్టర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం తొలి విడతగా ఇంద్రేశం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆస్తులు విలువలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ నుండి పారిశుద్ధ్య సిబ్బంది వరకు అందరూ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఈ వెంకటరమణ సిఐ వినాయక్ రెడ్డి, మాజీ ప్రజాప్రతినిదులు సీనియర్ నాయకులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మూడవ విడతలో 90.68 శాతం పోలింగ్ నమోదు

**ప్రజాపక్షం/మెదక్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భాగంగా మెదక్ జిల్లాలో మూడవ దశ పంచాయితీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 07 మండలాల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించగా 90.68 శాతం పోలింగ్ నమోదు అయింది. నర్సాపూర్, తూప్రాన్ డివిజన్ల పరిధిలోని చిలిపిచేడు, కౌడిపల్లి, కోల్చారం, మాసాయిపేట్, నర్సాపూర్, శివంపేట్, వెల్దుర్తి మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. 07 మండలాల్లో కలిపి మొత్తం 162348 ఓట్లు ఉండగా, 147210 పోల్ అయ్యాయి. ఈ ఎన్నికలకు 1408 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత పోలింగ్ ముగిసే సమయానికి 90.68 శాతం పోలింగ్ నమోదు అయింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బిఎస్ఎన్ 163 చట్టాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం అమలు చేసింది.

**నిష్పక్షపాతంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ**

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

నిష్పక్షపాతంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రాహుల్ రాజ్ కోల్చారం మండలం అప్పాజీ పల్లి గ్రామం, కౌడిపల్లి మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



# మూడో విడత ఎన్నికలు ప్రశాంతం



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/మంచిర్యాల :** జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జైపూర్ మండలం ఇందారం భీమారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఆయన ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చెన్నూర్ మందమర్రి, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించినట్లు చెప్పారు. 102 సర్పంచ్ స్థానాలకు 4 ఏకగ్రీవం కాగా 98 స్థానాలకు ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు. 868 వార్డు సభ్యుల స్థానాలకు 153 ఏకగ్రీవం కాగా 711 స్థానాలకు పోలింగ్ జరిగిందని వివరించారు. జిల్లాలో మొత్తం 1 లక్ష 6 వేల 889 మంది ఓటర్లు ఉండగా 93 వేల 822 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మొత్తంగా 87.78 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేశారని అభినందించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఒ కిషన్, ఎంపిడిఒలు సత్యనారాయణ, మధుసూదన్, ఎంపిఒ శ్రీపతి బాపు పాల్గొన్నారు.

# గ్రీన్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు అభినందనీయం

### జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా గ్రీన్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం జిల్లాలోని అంకుశాపూర్ కోసిని గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ కేంద్రాలను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నీటి కుండలు సాంప్రదాయ అలంకరణలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్రాలను తీర్చిదిద్దారని తెలిపారు. అంకుశాపూర్ గ్రామపంచాయతీలో 88 శాతం కోసిని గ్రామ పంచాయతీలో 81 శాతం పోలింగ్ నమోదైందని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాల వెల్లడి తరువాత ఉపసర్పంచ్ ఎన్నిక ఉంటుందని వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రీన్ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన ఎంపిడిఒ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అధికారులు, ఓటర్లు పాల్గొన్నారు.



## ముధోల్‌లో కలకలం..!

### ఓటు సిరా తొలగిస్తున్న యువకుడి అరెస్ట్..!






**ప్రజాపక్షం/ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో పోలింగ్ జరుగుతున్న వేళ ఒక విస్తుపోయే ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఓటు వేసిన తర్వాత వేలికి పూసే సిరాను తొలగిస్తున్న ఒక యువకుడిని ఇంటలిజెన్స్ పోలీసుల రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నయాబాదికి చెందిన అర్బాజుద్దీన్ అనే యువకుడు, ఓటు వేసి బయటకు వస్తున్న మహిళల వేలిపై ఉన్న సిరా గుర్తును ఒక రకమైన కెమికల్ ఉపయోగించి తొలగిస్తున్నాడు.

**పోలీసుల చర్య...**

పోలింగ్ కేంద్రం వద్ద నిఘా ఉంచిన ఇంటలిజెన్స్ సిబ్బంది, యువకుడి కదలికలను గమనించి వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న కెమికల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, తదుపరి విచారణ నిమిత్తం యువకుడిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒకరి కంటే ఎక్కువసార్లు ఓటు చేయించే ఉద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడుతున్నారా? లేక దీని వెనుక ఇంకా ఎవరి ప్రమేయమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఐజి చంద్రశేఖర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మల్టీ జోన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెబ్బెన ఆసిఫాబాద్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. రెబ్బెన మండలంలోని గోలేటి సింగరేణి కాలరీస్ హైస్కూల్, ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ ప్రాథమిక పాఠశాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలు సిబ్బంది నిర్వహణను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి చిత్తరంజన్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## సిర్పూర్ (టి)లో రైళ్ల నిలుపుదలపై డిఆర్‌ఎం సానుకూలత



**ప్రజాపక్షం/సిర్పూర్(టి) :** సిర్పూర్ (టి) రైల్వే స్టేషన్‌లో పలు రైళ్లను నిలిపే విషయమై డిఆర్‌ఎం గోపాలకృష్ణన్ సానుకూలంగా స్పందించారు. బుధవారం ఆయన రైల్వే స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఒడ్డెటి నాగమణి, ఇతర ప్రజాప్రతినిధులు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, హాజిని ప్యాసింజర్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇక్కడ నిలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైళ్ల కోసం కాగజ్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైల్వే స్థలంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలపై స్పందించిన డిఆర్‌ఎం త్వరలోనే రైళ్ల నిలుపుదలకు, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒడ్డెటి నాగమణి నాన్నయ్య వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## భార్య సర్పంచ్.. భర్త ఉపసర్పంచ్



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బడాభీమ్‌గల్‌కు చెందిన రాచకొండ విష్ణువర్ధిని శంకర్ గౌడ్ భార్య భర్తలు సర్పంచ్, ఉపసర్పంచ్‌గా గెలుపొందారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థిగా సర్పంచ్ బరిలో నిలిచిన రాచకొండ విష్ణువర్ధిని తన సమీప అభ్యర్థిపై 1329 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించారు. సర్పంచ్ భర్త రాచకొండ శంకర్‌గౌడ్ 11 వ వార్డు నుండి విజేతగా నిలిచారు. బడాభీమ్‌గల్‌లో మొత్తం వార్డులు 12 ఉండగా బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 2, ఇండిపెండెంట్ 1 గెలిచారు. దాంతో సర్పంచ్ భర్త శంకర్‌గౌడ్ ఉపసర్పంచ్‌గా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. భార్య సర్పంచ్ భర్త ఉపసర్పంచ్‌గా విజయం సాధించటంతో గ్రామంలో విజయోత్సవ వేడుకలు జరిపారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలోని 150 గ్రామపంచాయతీలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గ్రామపంచాయతీల ఎన్నికల రోజున కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తంగళ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బస్వాపూర్ ఉన్నత పాఠశాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హైమావతి సందర్శించారు. కొండపాక మండలం మర్పడగ, సిర్సినగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలు, కొండపాక మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్, దుద్దేడ గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

9 మండలాల పరిధిలోని 150 గ్రామపంచాయతీలు, 1182 వార్డుల్లో పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై 350 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ పరిశీలన



**ప్రజాపక్షం/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం పరిశీలించారు. ఎల్లారెడ్డిపేట, బోప్పాపూర్, అల్మాస్‌పూర్, గొల్లపల్లి, వీర్నపల్లి మండలంలోని కంచర్ల, వీర్నపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రంలో ఆవరణ, కౌటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వారితో పాటు తహసీల్దార్లు సుజాత, ముక్తార్ పాషా, ఎంపిడిఒల శ్రీలేఖ, నటరాజ్, ఎంపిఒలు తదితరులు ఉన్నారు.

## మొగిలిపేట గోదావరిలో ఇసుక మాఫియా పాగా!




**ప్రజాపక్షం /మల్లాపూర్ :** గోదావరి నది లో ప్రవాహం ఇలా తగ్గిందో లేదో అలా ఇసుక మాఫియా భారీగా నిలిచిన ఉన్న ఇసుక నిలువలపై కన్నేసి గోదావరిలో పాగావేశారు. కొంతమంది ఇసుక మాఫియా కు చెందిన వ్యక్తులు గోదావరి నదిలో దారులు వేసుకొని నిత్యం వందలాది ట్రిప్పుల ఇసుకను మెట్పల్లి ఇబ్రహీంపట్నం వంటి మండలాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. కాగా ప్రతి నెల ఒక్కో ట్రాక్టర్ కు వేలాది రూపాయల మామూలను అందజేస్తున్నామని తమకు అడ్డు చెప్పేవారే లేరంటూ కరాకండిగా చెబుతూ దందాను కొనసాగిస్తున్నారు. అధికారులే ఇలా అక్రమ వ్యాపారాలకు అండగా ఉండడంతో వీరి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతుంటే అధికారులకు మాత్రం ఇసుక వ్యాపారం వరంలా మారింది. ఏమైనా అధికారుల అండ ఉంటే ఎంత పెద్ద అక్రమ వ్యాపారమైన సాధ్యమే అన్నట్టుగా మండలంలో ఇసుక దందా పెట్రేగిపోతుంది.

## మంత్రులను కలిసిన సర్పంచ్‌లు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నియోజకవర్గానికి చెందిన సర్పంచులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిశారు.గెలిచిన సర్పంచులను మంత్రులు అభినందించి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పథకాలు అమలయ్యే విధంగా చూడాలని సూచించారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ఏఏ గ్రామాలకు ఎన్ని నిధులు అవసరమో అంచనాలు రూపొందించి ఇవ్వాలని సూచించారు. సర్పంచుల గెలుపుకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులను కలిసిన వారిలో చర్లభూత్కూర్,చామనపల్లి, దుబ్బపల్లి బహదూర్ఖాన్ పేట్, జూబ్లీ నగర్, ఎలబోతారం,ఫకీర్ పేట్, చేగుర్తి, నల్లగుంట పల్లె సర్పంచులు, ఉపసర్పంచులు ఇరుకుల్ల ఉప సర్పంచ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాంరెడ్డి రాంరెడ్డి, పంజాల స్వామి గౌడ్, నాయకులు పెంచాల లక్ష్మణ్ రావు, బుర్ర నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

## బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై ఫిర్యాదు



**ప్రజాపక్షం/కోరుట్ల:** బిహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ముస్లిం మహిళ బుర్ఖా–నఖాబ్‌ను బలవంతంగా తొలగించిన ఘటనపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కోరుట్ల పట్టణ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు, సర్వమతాల సభ్యులు కలిసి ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు, వినతిపత్రం సమర్పించారు.భారత రాజ్యాంగ నిర్మాత డా.బీమ్‌రావ్ అంబేద్కర్ సర్వమతాలకు సమానంగా జీవించే హక్కును కల్పించారని, అలాంటి రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమని వారు పేర్కొన్నారు.ముస్లిం మహిళ యొక్క బుర్ఖా–నఖాబ్‌ను బలవంతంగా గుంజడం ద్వారా ఆమె మౌలిక హక్కులను కాలరాశారని ఆరోపించారు.ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను ముఖ్యమంత్రి పదవి నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రపతి, భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇన్‌చార్జి కలెక్టర్ పరిశీలన



**ప్రజాపక్షం/వీర్నపల్లి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కెలక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసి లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. వారితో సిరిసిల్ల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, జెడ్‌పిడిప్యూటీసిఇఒ గీత, మండల ప్రత్యేక అధికారి రాఘవేందర్, ఎంపిడిఒ శ్రీలేఖ, ఎంపిఒ పాల్గొన్నారు.
**ముస్తాబాద్ లో:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ముస్తాబాద్ మండల కేంద్రం, ఆవునూర్ పాఠశాలల్లో, ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, మండల ప్రత్యేక అధికారులు రాఘవేందర్, క్రాంతి కుమార్, ఎంపీడీఓలు లక్ష్మీ నారాయణ, శ్రీలేఖ, నటరాజ్, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో 86.42 శాతం పోలింగ్

### పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్





**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో చివరి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. తుది విడతలో జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్ మండలాల్లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. చలిని సైతం లెక్క చేయకుండా ఓటర్లు ఉదయాన్నే క్యూలైన్లలో నిల్చుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ విడతలో 111 గ్రామ పంచాతీలు, 1034 వార్డులుండగా ఇందులో ఇల్లందకుంట, సైదాపూర్, వీణవంక మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం మూడు సర్పంచ్ లు, ఐదు మండలాల్లో కలిపి 184 వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగా మిగిలిన 108 సర్పంచ్‌లకు, 850 వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగాయి. 108 పంచాయతీల్లో 454 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలవగా, 850 వార్డుల్లో 2421 మంది వార్డు సభ్యులు పోటి పడ్డారు. ఈ విడతలో మొత్తం 1,64,046 ఓటర్లలో పురుషులు 80,190, స్త్రీలు 84,853, ఇతరులు ముగ్గురు ఉండగా 1,42,637 ఓట్లు పోలయ్యాయి. అందులో పురుషులు 69,998, స్త్రీలు 72,636 ఇతరులు ముగ్గురు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**86.42 శాతం పోలింగ్ నమోదు**

జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తంగా 86.42శాతం ఓట్లు పోలయ్యాయి. మండలాల వారీగా పరిశీలిస్తే ఇల్లందకుంట లో 87.05 శాతం, హుజరాబాద్ లో 85.04, జమ్మికుంట లో 85.72 వీణవంక 85 .87శాతం,సైదాపూర్87.85 శాతంగా నమోదయిం ది.

**పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్..**

మూడో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ లో భాగంగా జిల్లాలోని వి. సైదాపూర్ మండలం దుద్దెనపల్లి ఎలబోతారం, హుజురాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న సర్పంచి, వార్డు సభ్యుల అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఒకటి తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి అనుమతించకూడదనీ కలెక్టర్ అక్కడి ఎన్నికల అధికారులను ఆదేశించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. జమ్మికుంట మండలం మాచినపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లో కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. వీణవంక మండలం రెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లి లోను కౌంటింగ్ విధానాన్ని పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు లేదా ఏజెంట్ల సమక్షంలో నిష్పక్షపాతంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడించే వరకు ఎన్నికల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లకూ అవకాశం ఇవ్వరాదని కలెక్టర్ ఆదేశించారు.

**బందోబస్తు తీరును పర్యవేక్షించిన సిపి**

ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బంది పనితీరును, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని అధికారులకు, సిబ్బందికి సిపిసూచించారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకోవడం, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

## శాంతి బిల్లు దేశభద్రత ముప్పు

### పార్లమెంట్‌లో మండిపడ్డ ఎంపి గడ్డం వంశీకృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** శాంతి బిల్లు దేశ భద్రత ఒక ముప్పు అని పెద్ద పెల్లి ఎంపిగడ్డంవంశీకృష్ణ పార్లమెంట్‌లో ప్రభుత్వంపై మండిపడ్డారు. బుధవా రం రోజున పార్లమెంటులో బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అణుశక్తి రంగంలో ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగించేలా తీసుకొచ్చిన 'శాంతి బిల్లు' దేశ భద్రత, ప్రజల భద్రతకు తీవ్రమైన ప్రమాదమని పె ద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్‌లో తీవ్రంగా విమర్శించారు.శాంతి బిల్లు అని పేరు పెట్టారు గానీ, ఇందులోని అంశాలు దేశానికి అశాంతిని తెస్తాయనీ, అణు ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? సరఫరాదారులపై బాధ్యత తొలగిస్తే ప్రజల ప్రాణాలకు ఎవరు గ్యారంటీ ఇస్తారు?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దేశంలో ఉగ్రవాద దాడులు, నిరుద్యోగం, రూపాయి విలువ పతనం, ఇండిగో వంటి కార్పొరేట్ సంక్షోభాలపై ప్రభుత్వం జవాబుదారీతనం చూపడం లేదని విమర్శించారు. గత 11 ఏళ్లుగా ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఫ్రాన్స్, రష్యా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో అణుశక్తి పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉందని గుర్తు చేస్తూ, భారత్‌లో ఈ కీలక రంగాన్ని ప్రైవేట్ చేతుల్లో పెట్టడం ప్రమాదకరమని స్పష్టం చేశారు.అణు ప్రమాదం ఉద్దేశాన్ని చూడదు. అది ప్రైవేట్ ప్లాంటా, ప్రభుత్వ ప్లాంటా అన్న తేడా లేకుండా తరాల భవిష్యత్తును నాశనం చేస్తుంది. బాధ్యత చట్టాన్ని బలహీనపరచడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే అని ఆయన హెచ్చరించారు.అదానీ గ్రూప్ అణుశక్తి రంగంలో ఆసక్తి చూపిన వెంటనే ఈ బిల్లు రావడం యాదృచ్ఛికమా? అని ప్రశ్నించిన ఎంపి, గత పదేళ్ల తప్పిదాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని సూచించారు.ప్రైవేటీకరణ అణుశక్తి రంగంలో ప్రపంచవ్యాప్తంగా వి ఫలమైందని పేర్కొన్న ఎంపి గడ్డం వంశీకృష్ణ, ఈ బిల్లును పునఃపరిశీలించి ప్రైవేట్ సంస్థలు, సరఫరాదారులపై కఠిన బాధ్యతలు విధించాలని డిమాండ్ చేశారు.

## ధర్మపురిలో 73.05 శాతం






**ప్రజాపక్షం/ధర్మపురి:** బుధవారం జరిగిన మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ధర్మపురి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగి 73.05 శాతం పోలింగ్ నమోదైంది.మండలంలోని 25 గ్రామ పంచాయతీ లలో ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం కాగా మిగతా 22 సర్పంచ్ స్థానాలతోపాటు వార్డు సభ్యుల స్థానాలకు పోటీ జరిగింది. కాగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగిన పోలింగ్ లో మొదటి సారి ఓటు హక్కు పొందిన యువతీ యువకుల తోపాటు వృద్ధుల దాకా హుషారుగా తమ ఓటును వినియోగించుకున్నారు.మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యింది. చిన్న పంచాయతీల ఫలితాలు త్వరగా వెల్లడి కాగా ఓటర్లు ఎక్కువగా ఉన్న పెద్ద పంచాయతీ లెక్కింపు సాయంత్రం పొద్దు పోయే వరకూ కొనసాగింది.25 సర్పంచ్ స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు మెజారిటీ స్థానాలలో గెలుపొందారు.బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు సైతం గట్టిగా పోరాడి 9 స్థానాల్లో,3 స్థానాలలో బిజెపి అభ్యర్థులు విజయం సాధించారు. జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పి అశోక్ కుమార్ పలు గ్రామాలను సందర్శించి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పక్షాన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పెద్దపల్లిలో పోలింగ్ 85.66 శాతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** జిల్లాలో నిర్వహించిన మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం మూడవ విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓదెల మండలం కొలనూరు జెడ్పీ హెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడవ విడత 85 గ్రామ పంచాయతీలకు, 636 వార్డులకు నిర్వహించిన పోలింగ్ లో 85.66 % మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 22.50%, 11 గంటలకు 57.21%, 1 గంట వరకు 82.34% పోలింగ్ నమోదైందని, ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, వారితో కలిపి మొత్తం పెద్దపల్లి జిల్లాలో మూడవ విడత 85.66% పోలింగ్ నమోదైందని అన్నారు. మూడవ విడత పోలింగ్ నిర్వహించిన పెద్దపల్లి మండలంలో 86.39%, సుల్తానాబాద్ మండలంలో 86.51 శాతం, ఎలిగేడు మండలంలో 83.73%, ఓదెల మండలంలో 84.70% పోలింగ్ నమోదైందని, మొత్తం లక్షా 42 వేల 548 మంది ఓటర్లకు గాను లక్షా 22 వేల 111 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ సందర్భంగా ఓదెల మండలం కొలనూరు జడ్పీ హెచ్ఎస్, పెద్దపల్లి మండలం పెద్ద కల్వల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఏసీపీ గజ్జి కృష్ణ, ఆర్వో లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లాలో 86.74 పోలింగ్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో మూడవ విడుతలో 9 మండలాలకు బుధవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మూడవ విడుతలోని హుస్నాబాద్ నియోజక వర్గంలోని హుస్నాబాద్, కోహెడ. అక్కన్నపేట. జనగామనియోజక వర్గం లోని చేర్యాల,కొమురవెల్లి,మద్దూరు, దూల్మిట్ట,గజ్వేల్ నియోజక వర్గం లోని కొండపాక,కుకునూర్‌పల్లిలోని 150 గ్రామ పంచాయతీలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రామపంచాయతీల్లో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఉదయం నుండి గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ ప్రారంభమైన రెండుగంటల 9 గంటలవరకు 24.35శాతం, 11గంటల వరకు 60.15శాతం, మధ్యాహ్నం 1గంట వరకు 86.74 శాతం పోలింగ్ నమోదైంది. మూడవ విడుతలో 9 మండలాల్లో 150 గ్రామపంచాయతీల్లో 208314 ఓట్లకు 180692 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 27.622 ఓటింగ్‌కు దూరమైనారు. అక్కన్నపేట 86.11శాతం, చేర్యాల 81.99, దూల్‌మిట్ట 89.34, హుస్నాబాద్ 87.64, కోహెడ 87.65శాతం, కొమురవెల్లి 85.79, కొండపాకలో 88.15శాతం, కుకునూర్‌పల్లి 90.18శాతం, మద్దూరు 87.53 శాతం నమోదైంది. అనంతరం పోలింగ్ అధికారులు కౌంటింగ్ ప్రారంభించారు.

## ఉత్తర భారత్‌కే బిజెపి అనుకూలం.. తెలంగాణపై సవతి తల్లి ప్రేమ

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కాంగ్రెస్,బిజెపిలు రెండు నాణేనికి బొమ్మబోరుసు లాంటివని.. ప్రజలను మోసం చేయటంలో ఒకర్ని మించి మరోకరు పోటీ పడుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. బిజెపి చెప్పినట్లుగా సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్ కాదు..వాస్తవానికి అది సబ్‌కా బక్వాస్ అని ఎద్దేవా చేశారు. బిజెపి కేవలం ఉత్తర భారతదేశ పక్షాన ఉంటుందని, తెలంగాణపై సవతి తల్లి ప్రేమచూపిస్తుందన్నారు. ఉత్తర భారతదేశంలో పండే గోదుమలకు ఉండే విలువ, తెలంగాణలో పండే వరికి లేదని, కేంద్రం గోదుమలకు మద్దతు ధర పెంచి మన వడ్లకు మొండిచెయ్యి చూపిందని విమర్శించారు. బుధవారం సిద్దిపేట నియోజక వర్గంలో వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ బిజెపి పార్టీల నుండి బిఆర్‌ఎస్‌లో చేరగా మాజీ మంత్రి హరీష్‌రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ గోధుమల మద్దతు ధర వడ్ల కంటే రూ 216 ఎక్కువగా ఉందని, దీంతో మనరైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బిజెపికి ఓటు వేసినందుకు ఒక్కోక్క రైతు ఎకరానికి 7వేలు నష్టపోయారన్నారు. పార్లమెంట్‌లో బిఆర్‌ఎస్ ఉండి ఉంటే కేంద్రం మెడలు వంచి తెలంగాణకు నిధులు తెచ్చేవాళ్లమన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తెలంగాణకు చేసింది ఏమిలేదని, రాష్ట్రానికి కావాల్సిన నిధులు,ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. నల్లచట్టాలను తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టింది బిజెపి కాదా ? బావుల దగ్గర మీటర్లు పెట్టాలని చూసినపార్టీ బిజెపి అన్నారు. గల్లీలో కుస్తీ..ఢిల్లీ దోస్తీ రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపిలు పైకి కొట్టుకున్నట్లు నటిస్తారని, లోపల మాత్రం రెండు పార్టీలు ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ అవినీతి పాలనకు బిజెపి రక్షణ కవచంగా నిలుస్తుందని విమర్శించారు. కెసిఆర్ కట్టిన బిల్డింగులకు సిఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కటింగ్ చేయటం తప్పా..కొత్తగా రేవంత్‌రెడ్డి చేసింది ఏమిలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలునెరవేర్చక పోగా..ప్రజలకే బాకీ పడిందన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం /ముస్తాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడో ఫేజ్ ఎన్నికలలో భాగంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాల్లో ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ముస్తాబాద్ మండలకేంద్రం, నామాపూర్, గంభీరావుపేట మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గంభీరావుపేట లోని కెజిటూ పిజి విద్యాలయం, ఎల్లారెడ్డిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రం, ఆవరణలో పరిశీలించారు.

**కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన..**

ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారా అని ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఎఎస్‌పి చంద్రయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, సిరిసిల్ల ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, డిఎస్‌పి నాగేంద్రాచారి, డిఆర్‌డిఒ శేషాద్రి, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, హనుమంతు, అఫ్జల్ బేగం, తహసీల్దార్లు రాంచందర్, మారుతి రెడ్డి, సుజాత, ఎంపిడిఒలు లచ్చాలు, శ్రీధర్, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## ప్రపంచకప్ కోసం పక్కాగా..

### శ్రీలంక కోచ్‌గా భారత మాజీ క్రికెటర్!



టీ20 ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ శ్రీలంక బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వదేశంలో కప్ కొట్టాలనే కసితో ఉన్న లంక ఫీల్డింగ్ కోచ్‌గా భారత మాజీ కోచ్ ఆర్ శ్రీధర్‌ను నియమించింది. వరల్డ్‌కప్ టోర్నీ ముగిసేంత వరకూ అతడు ఫీల్డింగ్ కోచ్‌గా కొనసాగనున్నాడు. ఈ విషయాన్ని బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. టీమిండియాకు కోచ్‌గా ఏడేళ్లు సేవలందించిన శ్రీధర్ ఇప్పుడు లంక క్రికెటర్లకు మెలకువలు నేర్పే పనిలో బిజీ కానున్నాడు. పొట్టి ప్రపంచకప్ కోసం ఆతిథ్య శ్రీలంక పక్కాగా సిద్ధమవుతోంది. భారత్‌తో కలిసి ఈ మెగా టోర్నీ నిర్వహించనున్న లంక.. ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రమాణాలు పెంచడం కోసం టీమిండియా మాజీ కోచ్ ఆర్ శ్రీధర్‌ను సంప్రదించింది. ఫీల్డింగ్ కోచ్‌గా సుదీర్ఘ అనుభవమున్న అతడిని ప్రపంచకప్ ముగిసేంత వరకూ కోచ్‌గా ఉండాలని కోరింది. లంక క్రికెట్ తనను కోచ్‌గా నియమించడంపై శ్రీధర్ సంతోషం వ్యక్తం చేశాడు. శ్రీలంక క్రికెటర్లు ఎంతో ప్రతిభావంతులు. అందరూ సమిష్టితత్వంతో పోరాడుతారు. ఫీల్డింగ్ కోచ్‌గా నా పాత్ర కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం కాదు. కానీ, ఆటగాళ్లలో అథ్లెటిజం, అవగాహన అనేవి.. సహజంగా పెరుగుతాయి. చురుకైన చేతులు, మెరుపు కదలికలు, భయం లేకుండా ఉండడం వంటివి క్రమంగా మెరుగవుతాయి అని శ్రీధర్ పేర్కొన్నాడు. త్వరలో పాకిస్థాన్, ఇంగ్లాండ్ సిరీస్‌తో లంక కోచ్‌గా శ్రీధర్ ప్రయాణం మొదలవ్వనుంది.

**ఐర్లాండ్‌తో తొలిపోరు**

బిసిసిఐ లెవల్ 3 క్వాలిఫైడ్ కోచ్ అయిన శ్రీధర్ 2014 నుంచి 2021 వరకూ భారత జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఈమధ్యే అతడు అఫ్గనిస్థాన్ జట్టుకు కన్సల్టెంట్ కోచ్‌గా వ్యవహరించాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి భారత్, శ్రీలంక వేదికగా టీ20 ప్రపంచకప్ ప్రారంభం కానుంది. మరుసటి రోజే ఐర్లాండ్‌తో శ్రీలంక తలపడనుంది.



## క్యారీ సూపర్ సెంచరీ

### తొలిరోజు ఆసీస్ స్కోర్ 326/8

యాషెస్ సిరీస్ మూడో టెస్టులో ఇంగ్లాండ్ బౌలర్ల జోరుకు ఆస్ట్రేలియా బ్యాటర్లు బ్రేకులు వేశారు. టాపార్డర్ విఫలమైనా.. అలెక్స్ క్యారీ(106) సూపర్ శతకంతో చెలరేగాడు. అడిలైడ్‌లో జోఫ్రా ఆర్చర్(3–29) నిప్పులు చెరిగినా.. పట్టుదలగా క్రీజులో నిలిచిన క్యారీ కెరీర్లో మూడో సెంచరీ సాధించాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన ఉస్మాన్ ఖవాజా(82) మెరుపు అర్ధ శతకంతో రాణించగా.. తొలిరోజే ఆసీస్ మూడొందలు కొట్టింది. ఆట ముగిసే సరికి 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది ఆతిథ్య జట్టు. సొంతగడ్డపై జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో అదరగొడుతున్న ఆస్ట్రేలియా మూడో మ్యాచ్‌లోనూ గొప్పగా ఆడింది. తొలి సెషన్‌లో ఇంగ్లాండ్ పేసర్లు జోఫ్రా ఆర్చర్(3–29), బ్రైడన్ కార్సే(2–70)ల విజృంభణతో కష్టాల్లో పడిన ఆసీస్ అనూహ్యంగా పుంజుకుంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (10), జేక్ వెథెరాల్డ్18)లు నిరాశపరచగా.. మార్నస్ లబూషేన్(19)ను వెనక్కి పంపిన ఆర్చర్ కంగారూ టీమ్‌ను దెబ్బకొట్టాడు. ఐపిఎల్ వేలంలో రికార్డు ధర పలికిన కామెరూన్ గ్రీన్(0) డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆర్చర్ ఓవర్లో కార్సే స్టన్నింగ్ క్యాచ్‌తో గ్రీన్ ఔట్ కావడంతో 94కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు. ప్రధాన బ్యాటర్లు విఫలమైనా.. నేనున్నా నంటూ ఉస్మాన్ ఖవాజా(82) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. స్వీప్ షాట్లతో అలరించిన ఖవాజా అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. శతకానికి చేరువైన ఈ లెఫ్ట్ హ్యాండర్‌ను జాక్స్ ఔట్ చేశాక.. అలెక్స్ క్యారీ(106) విధ్వంసం కొనసాగించాడు. జోష్ ఇంగ్లిస్(32) ప్యాట్ కమిన్స్(13) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగినా.. దూకుడుగా ఆడిన క్యారీ మిచెల్ స్టార్క్(33 నాటౌట్)తో కలిసి 50 పరుగులు జోడించాడు. పెద్ద షాట్ ఆబబోయి క్యారే ఔటైనా స్టార్క్ పట్టుదలగా ఆడాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు 8 వికెట్లు కోల్పోయి 326 పరుగులు చేసింది. స్టార్క్ జతగా నాథన్ లియాన్(0 నాటౌట్) క్రీజులో ఉన్నారు.



### ఐపిఎల్‌లో 25.20 కోట్లతో రికార్డు బ్రేకర్.. తెల్లారే డకౌట్..!

ఐపిఎల్ వేలంలో రికార్డు ధర పలికిన కామెరూన్ గ్రీన్ సొంతగడ్డపై చతికిలపడ్డాడు. రూ.25.20 కోట్లతో చరిత్ర సృష్టించిన ఈ పొడగరి ఆల్‌రౌండర్ అడిలైడ్ టెస్టులో డకౌటయ్యాడు. టాపార్డర్ విఫలమైన తరుణంలో.. భారీ అంచనాల నడుమ క్రీజులోకి వచ్చిన రెండో బంతికే వికెట్ పారేసుకున్నాడు. ఆర్చర్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ షాట్ ఆడిన గ్రీన్.. అక్కడే కాచుకొన్న కార్సే డైవింగ్ క్యాచ్ పట్టగా సున్నాకే వెనుదిరిగాడు. స్వదేశంలో జరుగుతున్న యాషెస్ సిరీస్‌లో కామెరూన్ గ్రీన్ వైఫల్యం కొనసాగుతోంది. ఐపిఎల్‌లో రికార్డు ధర పలికిన ఉత్సాహంతోనైనా గ్రీన్ పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడనుకుంటే ఉసూరుమనిపించాడు. అడిలైట్ టెస్టులో మార్నస్ లబూషేన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన ఈ ఆల్‌రౌండర్.. పేలవ షాట్ ఆడి.. కార్సే చేతికి చిక్కాడు.

## శిష్యుడినే ఢీ కొట్టనున్న చెస్ దిగ్గజం!




ఒకప్పుడు చదరంగంలో రారాజుగా వెలుగొందిన విశ్వనాథన్ ఆనంద్ మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆరేళ్ల విరామం తర్వాత తొలి గేమ్‌తో అభిమానులను అలరించనున్నాడీ చెస్ దిగ్గజం. టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో తన శిష్యుడైన డి.గుకేశ్‌తో ఆడనున్నాడు విషీ. వచ్చే ఏడాది జనవరిలో సొంతగడ్డపై జరగబోయే ఈ మెగా ఈవెంట్‌లో వీరిద్దరి పోరుపై ఇప్పటి నుంచే సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2019 తర్వాత ఆనంద్ బరిలోకి దిగుతుండడంతో అతడిపై భారీ అంచనాలే ఉన్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలో బెంగాల్‌లోని ధోనో ధ్యానో ఆడిటోరియంలో టాటా స్టీల్ చెస్ ఇండియా 2025 టోర్నీ జరుగనుంది. ఆనంద్ గుకేశ్‌తో పాటు పలువురు అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్లు పోటీపడనున్నారు. అయితే.. ఆరేళ్ల బ్రేక్ తర్వాత ఆనంద్ ఆడుతున్న మ్యాచ్ పైనే అందరూ ఆసక్తిగా ఉన్నారు. 'స్వదేశంలో జరుగబోయే ఈ మెగా టోర్నీలో యువకెరటంతో ఆడేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా అని ఆనంద్ మీడియాతో' అన్నాడు.

# ఫోకస్




గాంధార నాగరికతకు ప్రత్యక్ష సాక్ష్యం



## మంకియాలా బౌద్ధ స్థూపం

పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్, తోపే మంకియాలా గ్రామం సమీపంలో ఉన్న బౌద్ధ స్థూపం గాంధార కాలానికి చెందిన ఒక అత్యంత ప్రాచీన బౌద్ధ స్మారక చిహ్నం. ఈ స్థూపం కుషాణ రాజు కనిష్కుడు పాలనలో, క్రీ.శ. 128 నుండి 151 మధ్య నిర్మించారని చరిత్ర చెబుతోంది. కాగా, జాతక కథల ప్రకారం, బుద్ధుని నీతి కథలో యువరాజు సత్వుడు, ఆకలితో ఉన్న ఏడు పులి పిల్లలను రక్షించడానికి తన శరీరాన్ని త్యాగం చేసిన పవిత్ర స్థలం ఇది. అందుకే దీనిని కరుణ, త్యాగం, మానవతా విలువలకు ప్రతీకగా భావిస్తారు. ఈ స్థూపాన్ని మొదటగా బ్రిటిష్ పర్యాటకుడు మౌంట్‌స్టువర్ట్ ఎల్ఫిన్‌స్టోన్ 1808 సంవత్సరంలో నమోదు చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈ స్థూపం ఒకప్పటి విపులమైన పురాతన బౌద్ధ సముదాయంలోని ఒక భాగం. కాగా, గాంధార అనేది బౌద్ధ సంపద–శిల్పకళ–వాస్తు కళకు చిరస్థాయిగా నిలిచిన నాగరికత. మన భారతీయ–బౌద్ధ చరిత్రను ప్రపంచానికి పరిచయం చేయడం మన బాధ్యత ఈ వారసత్వాన్ని గౌరవించాలి, కాపాడాలి, ప్రచారం చేయాలి.



## గ్రీక్, రోమన్ నాగరికతల మూలాలు ఎక్కడ?

గ్రీక్, రోమన్ నాగరికతల గురించి మనం ఎంతో చదివి ఉండవచ్చు. కానీ ఉన్నట్లుండి ఎవరినైనా సరే ఆ రెండు నాగరికతలు ఎక్కడ పుట్టాయి? ఆ తర్వాత ఎలా పతనమయ్యాయి? అనేది చెప్పమంటే కొంచెం తికమక పడటం సహజం. మనం ఈనాడు వింటున్న, చదువుతున్న అనేక యూరోపియన్ దేశాలకి చెందిన పేర్ల వెనుక వాటి ప్రభావం ఉంటుంది. అంతేగాక యూరపు అనే కాదు అమెరికా కావచ్చు, ఆస్ట్రేలియా కావచ్చు, లాటిన్ అమెరికా దేశాలు కావచ్చు, శ్వేతజాతీయుల వివిధ రకాల విలువలు, ఆలోచనా ధోరణులు వీటన్నిటి వెనుక గ్రీక్ ఇంకా రోమన్ నాగరికతల ప్రభావం ఉంది. ఆ పురాణాల, కథల సారాంశం లో నుండే పాత్రలు ఈరోజుకీ వాళ్ళు మర్చిపోకుండా అనేక వాటికి పేర్ల రూపంలో పెడుతుంటారు. ఉదాహరణకి అపోలో, మార్స్, వీనస్, మినర్వా, ఎథీనా, క్యూపిడ్ ఇలాంటి పేర్లన్నీ నిజానికి కొన్ని వేల ఏళ్ళ క్రితం నాటి గ్రీక్ మరియు రోమన్ దేవతల పేర్లు. అన్నట్టు గ్రీక్ నాగరికత ఎక్కడ పుట్టింది అంటే ఏథెన్స్‌లో. రోమన్ నాగరికత కంటే అనేక ఏళ్ళు ముందు ఆవిర్భవించింది. రోమ్ నాగరికత కి ముఖ్య కేంద్రం ఇటలీలో ఉన్న రోమ్ నగరం. కాగా, జర్మన్ బార్బరీకుల దాడులకి గురై గ్రీక్ నాగరికత క్షీణ దశకి చేరుకున్నది. క్రీస్తుపూర్వం 27వ శతాబ్దంలో ఆవిర్భవించిన రోమన్ నాగరికత క్రీస్తుశకం 476 కల్లా పతనమైంది. గ్రీక్, రోమన్ నాగరికతలు చాలా విషయాల్లో పోలికలు ఉంటాయి. కారణం రోమన్లు అనేక విషయాల్లో గ్రీక్ ల్ని అనుకరించారు. రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్, గ్రీక్ రాజైన అలెక్జాండర్‌కి అభిమాని. ఆయన కుట్టించుకున్న దుస్తులు లాంటివే ఈయన కూడా ధరించేవాడు. గ్రీకుల విజయ ప్రదాత 'నైక్' కాగా, రోమన్ల విజయ ప్రదాత 'విక్టోరియా'. ఈ రెండు పేర్లు మనం తరచూ వింటూనే ఉంటాం.. ముఖ్యంగా క్రీడా రంగంలో.. ఈనాడు మనం చూస్తున్న పాశ్చాత్యుల విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథం వెనుక గ్రీకులు, రోమన్ల ఆలోచనా ధార కనిపించని పునాదిరాళ్ళుగా ఉన్నాయని చెప్పాలి. అరిస్టాటిల్ ఇంకా ప్లేటో వంటి గ్రీకు తాత్వికులు భౌతికంగా కనిపించే ప్రపంచాన్ని మాత్రమే ఆలంబన గా చేసుకుని వివిధ ప్రయోగాలు చేశారు. యూక్లిడ్ లాంటి వారు గణితంలో ఎన్నో ప్రయోగాలు చేశారు. అంతరిక్షశాస్త్రం, అణు శాస్త్రం, మానవ శరీర శాస్త్రంపై ప్రయోగాలు జరిపారు. ఇక ఆ తర్వాత రోమన్లు శస్త్ర చికిత్స, నక్షత్ర గమనాలు, నీళ్ళతో నడిచే యంత్రాలు ఇలాంటి వాటిపై ప్రయోగాలు చేశారు. జీవితంలో మనిషి తన ఆలోచనల్ని ఎలా కంట్రోల్ చేసుకోవాలి, మాట్లాడటంలో లాజిక్‌ని, హేతుబద్ధత ని ఎలా ప్రదర్శించాలి వంటి అనేక విషయాల్ని రోమన్లు ఒక శాస్త్రంగా అభివృద్ధి చేశారు. వాళ్ళనే స్టోయిక్‌లు అన్నారు. ఆనాటి ధనికుల పిల్లలు వీరి దగ్గర విద్యని అభ్యసించేవారు. అలా గ్రీక్, రోమన్ నాగరికతలు తమ వంతు పని తాము చేసి కాలగ మనంలో కలిసిపోయాయి.

– మూర్తి కెవివిఎస్

## అమెరికా చరిత్రలో కొత్తకోణం



న్యూమెక్సికో ప్రాంతంలో పురావస్తు శాస్త్రవేత్తలు కనుకొన్న పురాతన పాదముద్రల శిలాజాలు అమెరికా చరిత్రలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. న్యూమెక్సికోలోని వైట్ సాండ్స్ నేషనల్ పార్క్ లో ఈ శిలాజాలను గుర్తించారు. ఇది అమెరికా ఖండంలో మానవ సంచారానికి సంబంధించిన కొత్త అధ్యయనాలకు తావిస్తున్నది. అమెరికాలో మానవ సంచరం సుమారు 11,500 నుంచి 13,000 సంవత్సరాల క్రితం నాటిదని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. ఆ అభిప్రాయమే ఇప్పటి వరకూ కొనసాగుతున్నది. అయితే, కొత్తగా కనుగొన్న శిలాజాలు సుమారు 23,000 సంవత్సరాల క్రితం నాటివిగా అంచనా వేస్తున్నారు. అంటే, ఇప్పటి వరకూ ఊహిస్తున్న కాలం కంటే కనీసం 10,000 సంవత్సరాలకు పూర్వమే అమెరికా ప్రాంతంలో నరసంచారం ఉండేదని స్పష్టమవుతున్నది. 'న్యూ మెక్సికో లోని ఈ శిలాజాల ఆవిష్కరణ అమెరికా చరిత్రను తిరిగరాస్తుంది. అందులో అనుమానం లేదు' అని బోర్న్‌మౌత్ విశ్వవిద్యాలయంలో పాలియోకాలజీ విభాగం చీఫ్ సాలీ రేనాల్డ్స్ వ్యాఖ్యానిస్తున్నారు. 'ఈ పాదముద్రలు మన పూర్వీకుల జీవితాల్లోని అత్యంత విలువైన సమాచారాన్ని, సంచారాన్ని గురించిన సమాచారాన్ని అందిస్తున్నాయి. వారు మన కంటే ఎంత ముందు ఈ ప్రాంతాల్లో నివశించారో తెలుసుకోవడానికి తోడ్పడుతుంది' అని ఆమె అంటున్నారు. ప్రస్తుతం అమెరికా ఉన్న ప్రాంతాల్లో మనిషి ఉనికి ఎప్పటిదనే విషయాన్ని నిర్ధారించడానికి ఈ శిలాజాలు ఉపయోగపడతాయి కాబట్టి, కొత్తకోణాలు ఆవిష్కృతం కావడం ఖాయంగా కనిపిస్తున్నది.

# 'ఉపాధి' సవరణను వ్యతిరేకించండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్త గ్రామీణ ఉపాధి బిల్లును తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ చర్యను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఈ చారిత్రాత్మక చట్టం నుండి మహాత్మా గాంధీ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించడం కేవలం పరిపాలనా మార్పు కాదను, గాంధీజీ విలువలు, వారసత్వం పట్ల బిజెపి ధిక్కారాన్ని బహిర్గతం చేసే లోతైన ఫాసిస్ట్ సైద్ధాంతిక చర్య అన్నారు. అప్పటి యుపిఎ ప్రభుత్వం వామపక్షాల మద్దతుతో అమలు చేసిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ, మన గణతంత్ర చరిత్రలో ఒక మైలురాయి అని, పని హక్కు అనే రాజ్యాంగ భావనకు ఒక మూలస్తంభం అన్నారు. ఇది రాష్ట్ర విధానం ఆదేశిక సూత్రాల నుండి నేరుగా ప్రవహిస్తుందని, ఇది అన్ని రకాల పౌరులకు జీవనోపాధిని అందించడానికి రాష్ట్రం కృషి చేయాలని ఆదేశిస్తుందని, ఈచట్టం గ్రామీణ భారతదేశంలో కనీస వేతనాన్ని సంస్థాగతీకరించిందని దాని నిబంధనలను ఏవైనా నీరుగార్చడం తప్పనిసరిగా గ్రామీణ కార్మికుల దోపిడీకి దారితీస్తుందని, కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ పట్టణ ప్రాంతాలలో, విద్యావంతులలో ఉద్యోగాలను నాశనం చేస్తున్న తరుణంలో, గ్రామీణ భారతదేశంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్ట పరిధిని పట్టణ ప్రాంతాలకు విస్తరించడం తక్షణ అవసరం అన్నారు. దాని దృక్పథాన్ని, రక్షణలను నాశనం చేయడం కాదని, సంవత్సరానికి పనిదినాలను 125కు పెంచుతామని కాగితంపై పేర్కొంటూనే, ప్రతిపాదిత బిల్లు పథకం డిమాండ్ ఆధారిత స్వభావాన్ని తొలగిస్తుందని కార్మికులు ఉపాధిని డిమాండ్ చేసే హక్కును సమర్థవంతంగా తొలగిస్తుందన్నారు. గ్రామీణ డిమాండ్‌ను నిలబెట్టడంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం కీలక పాత్ర పోషించిందన్నారు. కొత్తబిల్లు ఆర్థిక భారంలో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలపై మోపుతుందన్నారు. హామీ ఇవ్వబడిన పనిదినాల పెంపుపై స్పష్టమైన దృష్టి పెట్టకుండా ఇంత విస్తృతమైన మార్పు ప్రవేశపెట్టకూడదన్నాను. ఈ కార్మిక వ్యతిరేక రాజ్యాంగ వ్యతిరేక చర్యను కార్మికులు మరియు ప్రజాస్వామ్య శక్తులు ప్రతిఘటించాలని, అన్ని జిల్లాల్లో నిరసనలు నిర్వహించాలని పార్టీ యూనిట్లకు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు.

# సివిల్ సప్లయ్ కార్మికులకు ఉద్యోగ భద్రత

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు డిమాండ్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సివిల్ సప్లై హమాలీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ పెంచాలని, మహిళలకు సైతం అలవెన్స్ ఉండాలని రాష్ట్ర సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల ఎఐటియుసి కార్మిక భవన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లా సివిల్ సప్లై హమాలీ కార్మికుల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈమహాసభలకు సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి సిద్దిపేట జిల్లా ప్రధానకార్యదర్శి కిష్టాపురం లక్ష్మన్, బచ్చుపల్లి శంకర్ హాజరయ్యారు. మహాసభల సందర్భంగా ఎఐటియుసి జెండా ఆవిష్కరించి బాలరాజు మాట్లాడారు. హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్, ప్రమాద నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎఐటియుసి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారుడిగా అజ్జ వేణు, గౌరవ అధ్యక్షుడిగా కడారి రాములు, గంగాపురం పోచమల్లు, అధ్యక్షుడిగా పుప్పాల రాజేష్, ప్రధానకార్యదర్శిగా, పుప్పాల దుర్గయ్య, కోశాధికారిగా, సహాయ కార్యదర్శిగా వేల్పుల కనకరాజు, రాగుల ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బోగి వెంకటేశం, కౌన్సిల్ సభ్యులుగా అనుముల లచ్చయ్య, బియ్య పెద్ద సాయిలు, కొమ్మటి కిరణ్, రాగుల దుర్గయ్య, నక్క రాములు, బత్తుల మల్లయ్య, జంపల్లి వెంకటేశం, బొల్లి దేవయ్య, తోట మారుతిలను ఎన్నుకున్నారు. మహాసభలో వడ్డేపెల్లి లక్ష్మన్ పాల్గొన్నారు.

# మూడో విడతలో సిపిఐ విజయదుందుబి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు పలుచోట్ల సర్పంచ్‌లుగా, వార్డుమెంబర్లుగా విజయం సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గంలో మూడవ విడతల గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల విజయాల పరంపరా కొనసాగింది. బుధవారం జరిగిన మూడో విడత లో కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో లక్ష్మీదేవిపల్లి మండలంలో 12 స్థానాల్లో విజయం సాధించారు. ఇందులో 11 స్థానాల్లో భారీ మెజార్టీ దగ్గించుకోగా మండలంలోని అనిశెట్టిపల్లి సర్పంచ్ స్థానం ముందుగానే ఏకగ్రీవం అయ్యింది. అదే విధంగా సుజాతనగర్ మండలంలో మొత్తం 3 స్థానాలు కైవసం కాగా, 2 ఇంక్లైన్ స్థానం ఏకగ్రీవం అయ్యింది. ఆళ్లపల్లి మండలంలో1 సర్పంచ్ స్థానం సిపిఐ ఖాతాలో చేరింది. దీంతో మూడో విడత ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు 16 స్థానాలను కైవసం చేసుకున్నారు.

**గెలుపొందిన అభ్యర్థులు వీరే...** బాడిష మౌనిక లక్ష్మీపురం లక్ష్మీదేవిపల్లి మండలం, గరిక ఉపేందర్ సీతంపేట సుజాతనగర్ మండలం, కంగల అంజలి హేమచంద్రాపురం లక్ష్మీదేవిపల్లి మండలం, నూనావత్ హతిరామ్ లాలూతండా లక్ష్మీదేవిపల్లి మండలం, వజ్జ ఈశ్వరమ్మ చేతకొండ లక్ష్మీదేవిపల్లి మండలం, తాటి లక్ష్మణ్ మైలారం లక్ష్మీదేవిపల్లి, మాలోత్ రామనాధం కోయగూడెం సుజాతనగర్‌మండలం, పగిడ రాంబాబు పునుకుడుచెలక లక్ష్మీదేవిపల్లి మండలం, వజ్జ ఉమా వెంకటాపురం ఆళ్లపల్లి మండలం, మలకం ఉమా మహేశ్వరి బంగారు చెలక లక్ష్మీపురం మండలం, కొర్సా వీరబాబు అనిశెట్టిపల్లి లక్ష్మీదేవిపల్లి మండలం (ఏకగ్రీవం), గుగులోత్ అరుణ 2 ఇంక్లైన్ సుజాతనగర్ మండలం (ఏకగ్రీవం), గుగులోత్ బీబు సీతారాంపురం లక్ష్మీదేవిపల్లి మండలం, కళ్యాణి లోతువాగు లక్ష్మీదేవిపల్లి మండలం, జర్పుల దేవి అశోక్‌నగర్ లక్ష్మీదేవిపల్లి మండలం, గుగులోత్ ప్రేమ్‌చంద్ హమాలీ కాలనీ లక్ష్మీదేవిపల్లి మండలం.

### ఖమ్మం జిల్లాలో...

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెంలో సిపిఐ అభ్యర్థి కోరం కోటమ్మ ఘన విజయం సాధించారు. ఆమె వరుసగా రెండోసారి సిపిఐ నుంచి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామంలో సిపిఐ తరుపున పోటీ చేసిన కోటమ్మ సమీప సిపిఎం అభ్యర్థిపై 43 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం ఎనిమిది వార్డులకుగాను ఐదు వార్డుల్లో సిపిఐ విజయం సాధించింది. ఈ సందర్భంగా గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బాజుమల్లాయిగూడెంలో వరుసగా రెండవ సారి సిపిఐ సర్పంచ్, ఉపసర్పంచ్ స్థానాలు గెలుచుకుంది. కారేపల్లి మండలంలో గణనీయంగా వార్డుమెంబర్లను గెలుచుకుంది.

### అంతకపేట సర్పంచ్‌గా సిపిఐ జిల్లా నేత సృజన్‌కుమార్ ఎన్నిక

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామ సర్పంచ్‌గా సిపిఐ నాయకుడు సృజన్‌కుమార్ విజయం సాధించారు. బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అంతకపేట గ్రామంలో సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిపై కాశబోయిన రవీందర్‌పై 163 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. అంతక్కపేట గ్రామంలో 1975 ఓట్లు ఉండగా సృజన్‌కుమార్‌కు 1004 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్తి కాశబోయిన రవీందర్‌కు 841 ఓట్లు వచ్చాయి. గ్రామంలో సృజన్‌కుమార్ విజయం సాధించటంపై సిపిఐ నాయకులు,కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. సృజన్‌కుమార్ సర్పంచ్‌గా విజయం సాధించటం పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపె సతీష్, జిల్లా కార్యవర్గం అభినందించారు.

### గుండెగావ్ సర్పంచ్‌గా పవార్ రాష్ట్రపాల్

**బైంసా :** నిర్మల్ జిల్లా మధోల్ నియోజకవర్గంలోని బుధవారం జరిగిన మూడోదపా గ్రామపంచాయతీ ఎన్నికలలో బైంసా మండలంలోని గుండెగావ్ గ్రామ సర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి పవార్ రాష్ట్ర పాల్ విజయం సాధించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ఆయన, తన గ్రామాభివృద్ధి కోసం ఉన్నత చదువులను సైతం పక్కన పెట్టి ప్రజాసేవలోకి రావడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనను భారీ మెజారిటీతో గెలిపించారు

### దేవరకొండ, డిండి మండలాలలో సిపిఐ విజయకేతనం

**నల్లగొండ :** గ్రామ పంచాయతీ ఎన్నిక తుది పోరులో నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో సిపిఐ నాలుగు గ్రామ సర్పంచ్‌లను కైవసం చేసుకున్నారు. డిండి మండలంలోని ఖానాపూర్‌లో సిపిఐ సర్పంచ్ తిప్పర్తి ప్రతిమ విజేందర్‌రెడ్డి బిఆర్ ఎస్ కు చెందిన ప్రత్యర్థి సూదిని జ్యోతిపై 153 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రహమంతపూర్ గ్రామపంచాయతి ఎన్నికలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి పెంటమల్ల రాములమ్మ రాములు ప్రత్యర్థి అనూషపై 167 ఓట్ల మెజారిటీతో గెలిచారు. శేషయ్ కుంటలో వరికుప్పల స్వప్న 165 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అదేవిదంగా దేవరకొండ మండలంలో పతులతు తండాలో భారతి ధర్మ 65ఓట్ల మెజారిటీలో విజయం సాధించారు.

### యాద్రాద్రి జిల్లాలో...

**సంస్థాన్ నారాయణపురం :** యాద్రాద్రి భువనగిరి సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్, కోతులాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులను సిపిఐ కైవసం చేసుకుంది మహమ్మదాబాద్ సర్పంచ్‌గా ముత్యాల అంజయ్య ప్రత్యర్థిపై 80 ఓట్ల మెజార్టీతో గెలిచారు. కోతులాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కురుమిద్దె వినోద శ్రీనివాస్ 130 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### సూర్యాపేట జిల్లాలో...

**గరిడేపల్లి :** సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామ పంచాయితీకి బుధవారం జరిగిన ఎన్నికల్లో బిఆర్‌ఎస్, సిపిఐ(ఎం.ఎల్) బలపర్చిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి కట్టా కళ్యాణి ఘన విజయం సాధించారు. సర్పంచ్ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన పగడాల సైదమ్మ, సిపిఎం బలపర్చిన బోయిళ్ళ కవిత నవీన్‌లు పోటీలో ఉన్నారు. గ్రామంలో 639 ఓటర్లు ఉండగా 567 ఓట్లు పోలయ్యాయి. ఇందులో రెండు ఓట్లు చెల్లుబాటు కాలేదు. సిపిఐ బలపర్చిన అభ్యర్థి కట్టా కళ్యాణికి 295 ఓట్లు రాగా, సిపిఎం బలపర్చిన అభ్యర్థి బోయిళ్ళ కవితనవీన్‌కు 200 ఓట్లు, కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి పగడాల సైదమ్మకు 65 ఓట్లు పోలయ్యాయి. 95 ఓట్ల మెజార్టీతో కట్టా కళ్యాణి ఘన విజయం సాధించింది. మొత్తం 8 వార్డులు ఉండగా ఇందులో సిపిఐ అభ్యర్థులు మూడు స్థానాల్లో విజయం సాధించారు. అలాగే మండలంలోని గానుగుబండ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా బిఆర్‌ఎస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి కడియాల పద్మ అప్పయ్య ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ బలపర్చిన పరకాల రాధ పరమేష్‌పై 169 ఓట్ల మెజార్టీతో కడియాల పద్మ గెలుపొందారు. గ్రామంలో మొత్తం 1877 ఓట్లు ఉండగా 1705 ఓట్లు పోలయ్యాయి. పద్మ అప్పయ్య 950 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి 760కి పైగా ఓట్లు పోలయ్యాయి. గ్రామంలో మొత్తం 10 వార్డులు ఉండగా సిపిఐ అభ్యర్థులు నాలుగు స్థానాలలో గెలుపొందారు.

### నారాయణపేట జిల్లాలో...

**నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా నర్వ మండలం రాంపూర్ గ్రామసర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి బిసముల నాగరాజు 230 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

### జనగామలో ఐదుగురు వార్డు సభ్యుల విజయం

**జనగామ :** జనగామ జిల్లాలో సిపిఐ బలపరిచిన ఐదుగురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పలువురికి మద్దతు ఇవ్వగా ఐదుగురు విజయం సాధించారు. నర్మెట పంచాయతీలో వార్డు సభ్యుడిగా పాతూరి ప్రశాంత్, బొమ్మకూర్‌లో మాలోతు మంగమ్మ, మచ్చుపహాడ్‌లో గజ్జెల్లి వెంకటయ్య, మరియాపూర్‌లో రాజబోయిన వెంకటలక్ష్మి, అబ్దుల్ నాగారంలో చిన్నబోయిన ఎల్లయ్యలు గెలుపొందారు. వీరిని సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్ అభినందించారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## చక్కని చేతిరాతతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలంలోని మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మెరుగైన చేతిరాత కోసం తిరువూరుకు చెందిన కాలిగ్రఫీ రైటింగ్ మాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం చెరుపల్లి శ్రీధర్ మాట్లాడుతూ బాల్య దశ నుండి చేతిరాతపై చక్కని పట్టు సాధిస్తే భవిష్యత్‌లో జరగబోయే పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు కాలిగ్రఫీ శిక్షణ చక్కగా ఉపయోగపడుతుందని, చేతిరాత నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు జ్ఞానాభివృద్ధికి, సృజనాత్మకత పెరగడానికి, మంచి మార్కులు సాధించడానికి సహాయపడుతుందని అన్నారు. చిన్నారులందరికీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుని ఊటుకూరి రామరత్నం సుమారు రూ.3వేలు విలువైన నోట్‌బుక్స్ ఉచితంగా అందించటం జరిగింది. అమ్మ ఆదర్శకమిటీ చైర్మన్ కొట్టె వెంకట్రావమ్మ, ఉపాధ్యాయులు మేడేపల్లి శ్రీనివాసరావు, లావుడ్య రవికుమార్ పాల్గొన్నారు.

## దండ్యాల వెంకటేశ్వర్లు దంపతులకు మంత్రి భరోసా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని కొండాపురం పంచాయతీ సర్పంచ్‌కి దండ్యాల వెంకటేశ్వరరావు భార్య శ్రావణి పోటీ చేసి ఓడిపోయింది. కాగా బుధవారం రెవిన్యూ,గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారి నివాసం వద్దకు వెళ్లి భార్యభర్తను పరామర్శించారు. ఓటమి చెందామని అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలని మీ వెంట నేనున్నా అంటూ భరోసాను కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నమ్ముకున్న కార్యకర్తలకు తప్పకుండా న్యాయం చేస్తుందని, అది తమ బాధ్యత అన్నారు. ఓటమిని కూడా సోపానంగా తీసుకుని ప్రజల్లోకి చొచ్చుకెళ్లి, ఊరు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండి జగదీష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/మధిర :** ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకుని ఎదుటి వారికి తమ తోచిన విధంగా సహాయం చేయాలని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి, మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ నాళ్ళ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మధిర మున్సిపాల్టీ పరిధిలోని ఆదరణ సేవా ఫౌండేషన్ నందు నాళ్ళ శ్రీనివాసరావు తండ్రి నాళ్ళ వెంకటరామారావు తిథి సందర్భంగా అనాధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పెళ్లి రోజు, పుట్టిన రోజు, తదితర సందర్భాల్లో అనాధులకు, అబాగ్యులకు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. దీని వలన అనాధాశ్రమాలు నడిపించే వారికి ఎంతో తోడ్పాటునందిస్తుందని అన్నారు. నాళ్ళ జీవనకృష్ణ, నాళ్ళ మురళీకృష్ణ, నాళ్ళ శ్రీనివాసరావు, మాధవరపు నాగేశ్వరరావు, మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జివి, బాణాల శంకరాచారి, ఆదరణ సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు నిస్సి హరిణి తదితరులు పాల్గొన్నారు.

## సుజాతనగర్ మండలంలో పోలింగ్ ప్రశాంతం

4 స్థానాలలో సత్తా చాటిన సిపిఐ



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలో గురువారం మూడో విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 13 గ్రామపంచాయతీలుగాను టు ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఏకగ్రీవం కాగా మండలంలో మొత్తం 110 వార్డులకు గాను 30 వార్డులు ఏకగ్రీవం కాగా 80 వార్డులకు 12 గ్రామ పంచాయతీలకు గురువారం ఓటింగ్ జరిగింది. 102 పోలింగ్ స్టేషన్లో 13,598 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు 89% పోలింగ్ నమోదయింది. మొత్తం 12,146 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీతంపేట బంజార సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా లావుడియా గోపి, సీతంపేట సిపిఐ సర్పంచ్ గరిక ఉపేందర్, కోయగూడెం సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా మాలత్ రామనాథం గెలుపొందగా సిపిఐ స్థానాన్ని టూ ఇంక్లైన్ గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా సిపిఐ కైవసం చేసుకోవడంతో మండలంలో సిపిఐ నాలుగు స్థానాలని దక్కించుకుంది. పాత అంజనాపురం ఎట్టి నిర్మల సింగభూపాలెం కిన్నెర వెంకన్న, జామల తండా శారద, మాల బంజర నాగలక్ష్మి, స్టేషన్ బేతంపూడి శ్రీకాంత్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందగా మొత్తం తొమ్మిది స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాలతో సుజాతనగర్ ఎస్ఐ మాలోతు రమాదేవి బందోబస్తు నిర్వహించారు.

## స్పెషల్ ఆఫీసర్ అక్రమ టెర్మినేషన్‌ను ఎత్తివేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం రఘునాథపాలెంలో స్పెషల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న లతను శాశ్వతంగా విధుల నుంచి తొలగించడాన్ని పిఆర్‌టియ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా శేఖర్‌రావు, ఆర్. రంగారావు లు ఒక ప్రకటనలో బుధవారం తీవ్రంగా ఖండించారు. కెజిబివిలలో పని చేస్తున్న సిఆర్‌పిలు, పిజిసిఆర్‌టిలు, స్పెషల్ ఆఫీసర్లు అరకొర వేతనాలతో పని చేస్తున్నారన్నారు. స్పెషల్ ఆఫీసర్లు ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రాకపోయినా వారి సొంత వేతనాలతో విద్యార్థులకు సేవలు అందిస్తున్నారన్నారు. 15 ఏళ్ల ను ండి ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న లతను తొలగించడం అన్యాయమని వెంటనే శాశ్వత తొలగింపును ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ఘనంగా పెన్షనర్స్ డే

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలోని నాలుగు శాఖల ఆధ్వర్యంలో బుధవారం రోటరీనగర్‌లోని రాజరాజేశ్వరి ఆలయం ఫంక్షన్ హాల్‌లో పెన్షనర్స్ డేను ఘనంగా నిర్వహించారు.బసవరావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల హక్కులను హరిస్తూ అనేక రకాల ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. పెన్షనర్స్ డేకు మూల పురుషుడైన డిఎస్ నకార సాధించిపెట్టిన పెన్షన్ హక్కులను కాలరాస్తున్నారన్నారు. నకార జరిపిన న్యాయ పోరాటాన్ని నేడు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెన్షన్ హక్కును కాపాడాలని పార్లమెంటులో ఆమోదించిన ఫైనాన్స్ బిల్లును రద్దు చేసి పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయ్యవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు పెన్షనర్ల సమస్యలను తెలియజేయాలని కోరుతూ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతి పత్రాన్ని అందజేశారు. పూర్ణచందర్‌రావు, సాంబశివరావు, దుర్గాదేవి, జనార్థన్, జానయ్య, ఖాజామోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు పరిసమాప్తం

### తుది విడతలో 84.67 శాతం పోలింగ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల హడావిడి పరి సమాప్తమైంది. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. తొలివిడత ఈనెల 11వ తేదిన నిర్వహించగా, మలి విడత 14వ తేది, తుది విడత బుధవారం 17వ తేది నాడు జరిగాయి. మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అన్ని చర్యలు తీసుకోగా, ఎస్‌పి నేతృత్వంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. నూతనంగా ఎంపికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఈనెల 22న పదవీబాధ్యతలు స్వీకరించనున్నారు.

| విడతల వారీగా ఓటింగ్ సరళి | | |
|---|---|---|
| 1వ విడత | 71.79 శాతం | 185974(259070) |
| 2వ విడత | 82.65 శాతం | 162323(196395) |
| 3వ విడత | 84.67 శాతం | 148230(175074) |
| మొత్తం | 78.74 శాతం | 496527(630539) |

**జిల్లా మొత్తంగా 78.74 శాతం :** స్థానిక సమరానికి సంబంధించి ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల్లో మొత్తం 78.74 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం డివిజన్లలో 6,30,539 మంది ఓటర్లు ఉండగా, 4,92,527 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాల్లో అత్యల్పంగా భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో 71.79 శాతం ఓటింగ్ నమోదైంది. అదే విధంగా మండలాల వారీగా చూస్తే అత్యధిక ఓట్లు ఉన్న భద్రాచలం మండలంలో 48.87 శాతం అత్యల్ప ఓటింగ్ నమోదైంది.

**తుది విడతలో 84.67 శాతం :** మూడో విడత ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ఆళ్లపల్లి, గుండాల జూ లురుపాడు, లక్ష్మి దేవిపల్లి, సుజాతనగర్, టే కుపల్లి, ఇల్లెందు మం డలాల్లో జరగగా మొత్తం 8 4.67 శాతం ఓట్లు పోలయ్యాయి. మొ త్తం 175074 ఓట్లు ఉండగా, 148230 ఓట్లు పోలయ్యాయి.

| 3వ విడతలో మండలాల వారీగా వివరాలు, శాతం | | | |
|---|---|---|---|
| 1 ఆళ్లపల్లి | 88.09 శాతం | 8,205 | (9.314) |
| 2 గుండాల | 86.25 శాతం | 10,429 | (12,092) |
| 3 జూలూరుపాడు | 88.71 శాతం | 21,700 | (24,462) |
| 4 లక్ష్మి దేవిపల్లి | 80.86 శాతం | 24,913 | (30,811) |
| 5. సుజాతనగర్ | 89.32 శాతం | 12,146 | (13,598) |
| 6. టేకులపల్లి | 86.47 శాతం | 36,376 | (42,068) |
| 7 ఇల్లెందు | 80.65 శాతం | 34,461 | (42,729) |
| మొత్తం | 84.67 శాతం | 1,48,230 | (1,75,074) |





## ప్రశాంతంగా ముగిసిన.. మూడవ విడత పోలింగ్

గ్రామాల్లో కట్టుదిట్టమైన భద్రత

పోలీసు కమిషనర్ సునిల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అన్నారు. బుధవారం సమస్యత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. అక్కడి పోలీసు బందోబస్తును పర్యవేక్షించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. పెనుబల్లి, కల్లూరు మండలాల్లోని చింతగూడెం, ఎరుగట్ల, లంకపల్లి, ఎర్రబోయినపల్లి గ్రామాలను ఆయన సందర్శించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు లైన్‌లో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని లెక్కింపు ప్రశాంతంగా ముగిసిందన్నారు. పోలీసు యాక్ట్ బిఎన్ఎస్ఎస్ 163 అమలులో ఉన్నందున విజేతలేన వారి ఊరేగింపులకు అనుమతించలేదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానికులకు సూచించినట్లు సిపి తెలిపారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోని ప్రజలకు అధికారులు, కార్మికులు జావాబుదారీగా ఉండాలని, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మున్సిపాలిటీపరిధిలోని టిసివిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో అవగాహణసదస్సును నిర్వహించారు. మనం ఏ పనిచేసిన అది మున్సిపాలిటీకి, ప్రజల ఖ్యాతిని పెంచేవిధంగా ఉండాలి తప్ప తగ్గించేల కాదన్నారు. అధికారులు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. నిరంతరం నేర్చుకునే పనిలో ఉండటం ద్వారా మన ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ, ఇంటి పన్నులు వసూళ్లు, వీధి దీపాల ఏర్పాటు, ఇఎస్ఐ ద్వారా వైద్య, నగదు సేవలు, ఇపిఎస్ఎఫ్‌తో పాటు పలు ముఖ్య అంశాలను వివరించారు. రెవిన్యూ ఆర్ఓ శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ మణి, శానిటరీ ఇంఛార్జ్‌లు కిరణ్, శ్రీనివాస్, ఎన్విరన్‌మెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఫరీద్ పాల్గొన్నారు.

## మూడవ విడత ప్రశాంతం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడవ విడతలో ఏడు మండలాల పరిధిలోని 168 గ్రామ పంచాయతీలకు, 1372 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా మొత్తం 88.84 శాతం పోలింగ్ నమోదైంది. ఏన్కూరు మండలంలో 89.50 శాతం, కల్లూరు మండలంలో 90.72 శాతం, పెనుబల్లి మండలంలో 88.98 శాతం, సత్తుపల్లి మండలంలో 87.36 శాతం, తల్లాడ మండలంలో 88.14 శాతం, వేంసూరు మండలంలో 90.63 శాతం పోలింగ్ నమోదైంది. మూడవ విడతలో 2,43,983 మంది ఓటర్లకు గాను 2,16,765 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తల్లాడ మండలం పినపాక జెడ్పిహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ద్వారా పోలింగ్



సరళిని పర్యవేక్షించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో బందోబస్తును అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు పరిశీలించారు. కల్లూరు, తల్లాడ, వియం బంజర మండలాల్లో పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను అడిషనల్ డిసిపి ప్రసాదరావు సందర్శించారు. పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## డ్రోన్ ద్వారా తక్కువ ఖర్చుతో లాభదాయక వరి సాగు

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ ద్వారా విత్తనాలు మందులు పిచికారి చేయడంతో లాభదాయకమైన వరి సాగు చేయవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలంలో సోంపల్లి గ్రామంలో డ్రోన్ సాంకేతికత ద్వారా నేరుగా వరి విత్తనాలు వెదజల్లే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డ్రోన్ ద్వారా వరి విత్తనాల వెదజల్లే ప్రక్రియను ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే తక్కువ ఖర్చుతో లాభదాయకంగా వరి సాగు చేయవచ్చని తెలిపారు. డ్రోన్ ద్వారా వరి విత్తనాలను నేరుగా వెదజల్లడం, అలాగే గడ్డి మందులు, పురుగుమందులను పిచికారీ చేయడం ద్వారా



కూలీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. అదే విధంగా సమయం ఆదా కావడంతో పాటు పంట స్థాపన సమానంగా జరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు. వ్యవసాయంలో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి భరత్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే విధానంలో సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే తక్కువ విత్తనాలు సరిపోతాయని, దీంతో విత్తన వ్యయం తగ్గుతుందని వివరించారు. ఈవిధానం ద్వారా సాగు ఖర్చులు కూడా గణనీయంగా తగ్గడంతో పాటు రైతులకు అధిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో భాగంగా రైతులు డ్రోన్ ద్వారా వరి విత్తనాలు వెదజల్లే ప్రత్యక్ష ప్రదర్శనను వీక్షించి, ఈ ఆధునిక సాంకేతికత ప్రయోజనాలపై అవగాహన పొందారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రోన్ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం రైతుల్లో ఆధునిక సాంకేతికతపై నమ్మకాన్ని పెంచి, తక్కువ ఖర్చుతో లాభదాయకమైన వరి సాగుకు దోహదపడుతుందని తెలిపారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ శరత్ చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి శివ, ఏడిఏ తాతారావు, శంకర్, సోంపల్లి గ్రామానికి చెందిన అధికారులు, సిబ్బంది, సుమారు 80 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## మీ విజయం అపూర్వం

నూతన సర్పంచ్‌లను సన్మానించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలో బిఆర్ఎస్ పార్టీ తరుపున గెలుపొందిన సర్పంచ్‌ల విజయం అపూర్వమైనదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన 11 మంది బిఆర్ఎస్ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యకర్తలు పోరాడి విజయం సాధించారన్నారు. మండల అధ్యక్షులు వీరునాయక్, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, మాజీ సర్పంచ్‌లు మాధంశెట్టి హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, నాయకులు మందడపు నర్సింహారావు, మందడపు మాధవరావు, పిన్ని కోటేశ్వరరావు, పోట్లపల్లి రాజా, తాతా వెంకటేశ్వర్లు, కుతుంబాక నరేష్, యాసా రామారావు, చెన్నబోయిన సైదులు, తుమ్మలపల్లి మోహన్‌రావు, వల్లభనేని వెంకటప్పారావు, రవిప్రకాష్, భాస్కర్, దానయ్య పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా అభివృద్ధిపై దృష్టి

సర్పంచ్ పి. రామలక్ష్మయ్య



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** పార్టీలకతీతంగా పంచాయితీ అభివృద్ధిపై దృష్టి సారిస్తానని నూతనంగా ఎన్నికైన సిపిఐ సర్పంచ్ పి రామలక్ష్మి య్య, సిపిఐ మండల కార్యదర్శి బుర్ర కేశవులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతాయిగూడెం గ్రామంలో ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నన్ను గెలిపించిన పంచాయితీ ఓటర్లకు కృతజ్ఞతలు అన్నారు. ఏ పార్టీ మద్దతు లేకుండా ఒంటరిగా సిపిఐ తరపున పోటీ చేసి గెలుపొందామని అన్నారు. సిపిఐకి ప్రజలు బ్రహ్మరథం పట్టి గెలిపించారని ఆనందం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐతోనే పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో వీధిలైట్లు డ్రైనేజీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామ పంచాయితీని ఉత్తమ పంచాయితీగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. అభివృద్ధిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కైన్సిల్ సభ్యులు, గార్లపాడు రామనాథం, మండల కార్యదర్శి బొర్రా కేశవులు సహాయ సహకారాలతో అగ్రగ్రామీగా నిలుపుతామన్నారు.

## మూడో విడత పోలింగ్ ప్రశాంతం

21 పంచాయతీలకు ఎన్నికలు

పర్యవేక్షించిన జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల పరిధిలోని మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. బుధవారం మండలంలో ఎన్నికలు జరగగా, జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడవ విడత ఎన్నికల్లో మొత్తం 24 పంచాయతీలు ఉండగా, అందులో ఇప్పటికే రెండు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఒక పంచాయతీ ఎన్నికలు నిలిపి వేయగా దీంతో మిగిలిన 21 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ సజావుగానే సాగింది. మధ్యాహ్నం 2 గంటల నుండి అధికారులు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. ఎన్నికల నిర్వహణ పూర్తిగా సవ్యంగా సాగేలా జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు





సూచనలు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి పంపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ సెక్షన్ ను అమలు చేసి పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీస్ యంత్రాంగం తగు చర్యలు చేపట్టింది. దీంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ముగిసింది.

### ఉదయం వేళ భారీగా పోలింగ్...

బుధవారం ఉదయం 7 గంటల నుండే పోలింగ్ ప్రారంభం కాగా వల్లె వాసులు ఓటరు చైతన్యం కనబరిచారు. చలి తీవ్రతను సైతం లెక్క చేయకుండా ఉదయం నుండి ఓటర్లు క్యూ లైన్ లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం వేళ ఓటర్లు పెద్ద సంఖ్యలో రాగా ఆ తర్వాత క్రమంగా ఓటర్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అభ్యర్థులు సైతం తమకు అనుకూలంగా ఓటు వేసే వారిని గుర్తించి వారిని ప్రత్యేకంగా ఆటోలలో పోలింగ్ కేంద్రాలకు తరలించారు. దీంతో మధ్యాహ్నంతో పోలిస్తే ఉదయం వేళనే ఎక్కువ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించారు. ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. రెండు గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా తొలుత వార్డు మెంబర్ల కౌంటింగ్ ను ప్రారంభించారు. సర్పంచ్ స్థానాలకు కౌంటింగ్ పూర్తి చేశారు.

## సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన అడిషనల్ డిసిపిలు


**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మూడోవిడత పంచాయతీ ఎన్నిక సందర్భంగా బుధవారం సమస్యత్మక పోలింగ్ కేంద్రాలను అడిషనల్ డిసిపిలు లా అండ్ అడర్, ఆడ్మిన్ ప్రసాద్‌రావు, భోజా రామానుజం వేర్వేరుగా పరిశీలించారు. తల్లాడ, క ల్లూరు, విఎం బంజర్ గ్రామాల్లోని పోలింగ్ కేం ద్రాలను లా అండ్ ఆడర్ అడిషనల్ డిసిపి ప్రసాద్‌రావు పరిశీలించగా ఏన్కూరు మండలంలోని తూటక్క, లింగన్నపేట, కోదాండరామాపురం, తి మ్మారావుపేట, సూర్యతండా, గార్లవోడ్డు, అక్కినపురం తండా, రేపల్లెవాడ, భద్రూనాయక్ తండాలను అడిషనల్ డిసిపి అడ్మిన్ రామానుజం సందర్శించారు. సందర్భంగా వారు అక్కడి పోలీసు ప హారా తీరును పరిశీలించి విధుల్లో ఉన్న





పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ ముగిసేలా చూడాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ విజయవంతం చేయాలని ఆదేశించారు. పోలీసు సెక్షన్ బిఎన్ఎస్ 163 అమలులో ఉన్నందున ఊరేగింపులకు అనుమతించ వద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఓటు వేసి వస్తూ.. గుండెపోటుతో మృతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని ఇంటికి వెళ్తున్న నాగులవంచ సత్యనారాయణ (65) గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఓటింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని రెడ్ల వాడ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్న తీరును పరిశీలించిన ఆమె, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేస్తూ శాంతియుతంగా, పారదర్శకంగా ఓటింగ్ నిర్వహించాలన్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రాన్ని చూసి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు.ప్రభుత్వం ఆశించిన విధంగా పచ్చదనాన్ని ప్రోత్స హిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కేంద్రం రూపొందిందని పేర్కొంటూ, ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## వరంగల్ కమిషనరేట్‌లో ఎన్నికలు ప్రశాంతం: సిపి



**ప్రజాపక్షం/వరంగల్‌క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు విడతలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈనెల 11వ తేదీ నుండి బుధవారం వరకు మూడు విడతల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అభ్యర్థులు,ప్రజలతో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు గాను డిసిపి నుండి హోంగార్డ్ స్థాయికి చెందిన వారు మొత్తం 2వేలకు పైగా పోలీసులు విధులు నిర్వహించారని, ఎన్నికల తేదీలు ఖరారైన నాటి నుండి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కఠినంగా ఎన్నికల నిబంధనలను అమలు చేయడం జరిగింది. ఇందులో భాగంగా కమిషనరేట్ పరిధిలో మొత్తం ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించడం జరిగింది. అలాగే గ్రామాల్లోను ముమ్మరంగా తనిఖీ నిర్వహించడం ద్వారా నేటి వరకు 6లక్షల74వేల రూపాయలతో పాటు,128 కేసుల్లో సుమారు 12లక్షల42 వేల రూపాయల విలువ గల మద్యం సీసాలు, 49కేసుల్లో ఒక లక్ష 27వేల రూపాయల విలువగల 343 లీటర్ల గుడుంబాతో పాటు ఒక లక్ష 23వేల రూపాయల విలువ గంజాయిని పోలీసులు వివిధ ప్రాంతాల్లో స్వాధీనం చేసుకోవడం జరిగిందని. ఎన్నిక సందర్బంగా లెసెన్స్ కలిగి వున్న మొత్తం 156 తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గతంలో ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు రౌడీ షీటర్లు, అనుమానస్పద వ్యక్తులకు సంబంధించి 432 కేసుల్లో మొత్తం 2,638 మందిని బైండోవర్ చేయడం జరిగిందని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పు పెడితే భూసారానికి ముప్పు



**ప్రజాపక్షం/తొర్రూరు :** పంట పొలాల్లో రైతులు వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణ కాలుష్యం ఏర్పడటంతో పాటు పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులు నశిస్తాయని మండల వ్యవసాయ అధికారి డి.రామనర్సయ్య అన్నారు. బుధవారం మండలంలోని చెర్లపాలెం గ్రామ శివారులో రైతులు వారి పొలంలో వరి కొయ్యలను కాల్చుతున్న తీరును చూసి పంట పొలాలకు చేరుకొని మంటలను ఆర్పివేశారు. అక్కడ ఉన్న రైతులతో వ్యవసాయ అధికారి రామనర్సయ్య మాట్లాడుతూ పొలంలో వరి కొయ్యలను కాల్చడం అత్యంత ప్రమాదకరమన్నారు. వరి కొయ్యలను కాల్చివేసే క్రమంలో భూమి గట్టిపడుతుందని, పొలాన్ని కలియదున్నడం వీలుకాదని చెప్పారు. వరికొయ్యలను కాల్చిన సమయంలో వచ్చిన పొగతో రైతులకు ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని, భూమిలో ఉన్న నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు నశించిపోవడంతో పాటు పంటలకు ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. రైతులంతా వరి పంట కోసిన తరువాత వరి కొయ్యలు ఉన్నా అలాగే దున్ని నీటిలో మురగబెడితే అవి పొలాలకు ఎరువుగా ఉపయోగపడుతాయని చెప్పారు. కాని వాటిని కాల్చివేస్తే వాయు కాలుష్యంతో పాటు రైతులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. రైతులంతా అవగాహన కలిగి ఉండి వరి కొయ్యలను భూమిలో కలిపి దున్నడం ద్వారా సేంద్రియ కర్బనము పెరిగి దిగుబడి పెరగడంతో పాటు మొక్కలకు నత్రజని, భాస్వరం, సూక్ష్మ పోషకాలు అంది పంటలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు

### ఓటు వేసి తిరిగి వస్తుండగా ఘటన



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి సింగరేణి ఎంవీటీసీలో పనిచేస్తున్న మెకానికల్ ఫోర్ మెన్ దేవేందర్ తన భార్య అపర్ణతో కలిసి వారి స్వగ్రామంలో ఓటు వేసి వస్తున్న క్రమంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నర్సాపూర్ మూలమలుపు వద్ద టీఎస్ 03 ఈఎన్ 0045 నెంబర్ గల కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో ఈ ప్రమాదంలో భార్య దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళితే వరంగల్ జిల్లా నర్సంపేట మండలం గురిజాల లో భార్య భర్తలు ఇద్దరు ఓటు వేసి తిరిగి వస్తున్న క్రమంలో వెంకటాపూర్ మండలం నర్సాపూర్ వద్ద కారు అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఈ ఘటనలో భార్య అపర్ణ అక్కడికక్కడే మృతిచెందగా భర్త దేవేందర్ కు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దేవేందర్ అపర్ణ దంపతులు భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని జీఎం కార్యాలయం ఎదురుగా ఉన్న సింగరేణి ఎంసీ క్వార్టర్స్ లో నివాసం ఉంటున్నారు. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేసి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.అపర్ణ మృతితో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఓటర్లను ఆకర్షిస్తున్న హరిత పోలింగ్ కేంద్రం




**ప్రజాపక్షం/నెక్కొండ :** రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సంయుక్తంగా చేపట్టిన హరిత పోలింగ్ కేంద్రాల కార్యక్రమం ఓటర్లను విశేషంగా ఆకర్షిస్తోంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో, రెడ్లవాడ గ్రామంలో తహసీల్దార్ వేముల రాజకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనంతో కళకళలాడుతోంది.మామిడి తోరణాలు, అరటి ఆకులతో పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా అలంకరించగా, మహిళా సంఘాల ప్రతినిధులు తమ సహకారంతో ఈ కార్యక్రమాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విలువను ఓటర్లకు తెలియజేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.పచ్చదనాన్ని కాపాడటం ద్వారా మానవ జీవితానికి మేలు జరుగుతుందన్న ప్రభుత్వ ఉద్దేశం ఈ హరిత పోలింగ్ కేంద్రాల ద్వారా ప్రజలకు స్పష్టంగా చేరుతోందని పలువురు ఓటర్లు అభిప్రాయపడ్డారు

# మిల్లర్ల దోపిడీని అరికట్టడంలో యంత్రాంగం విఫలం

### రైతులు నిండా మునుగుతున్నా పట్టదా?
### తరుగు పేరుతో రైతులను దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలి
### సిపిఐ, ప్రజా సంఘాల జిల్లా నాయకుల హెచ్చరిక



**ప్రజాపక్షం/హనుమకొండ :** జిల్లాలోని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే టప్పుడు కూడా తీవ్రంగా నష్టపోతున్నాడని, దీనికి జిల్లాలోని మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కొంతమంది అధికారులే కారణమని, వీరిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏదునూరి వెంకట్రాజం జిల్లా కలెక్టర్‌ను, ప్రభుత్వ యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నాయకత్వ బృందంతో కలిసి జిల్లా డీఆర్‌ఓ, సివిల్ సప్లై అధికారిని కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాజం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసే టప్పుడు తరుగు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా క్వింటాలు ధాన్యం కు 5 కిలోల పైగా తరుగు తీస్తున్నారని, ఇదికాకుండా లారీ లు మిల్లుల్లో ధాన్యాన్ని దిగుమతి చేసే టప్పుడు మరికొన్ని బస్తాలను తక్కువ లెక్కకడుతున్నారని అన్నారు.ఇలా ఒక్కో లారీ కి 50 నుండి 60 బస్తాలు తక్కువ చేసి లెక్క కడుతున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇంత బహిరంగంగా దోపిడీ చేస్తుంటే అధికారులు ఏంచేస్తున్నట్లని ప్రశ్నించారు. మిల్లర్లు అవక తవకలకు పాల్పడకుంటే ట్రక్ షీట్లు రైతులకు ఎందుకు ఇవ్వడం లేదని అన్నారు.ఇప్పటికే వందల క్వింటాళ్ల ధాన్యం ఈ విధంగా రైతుల నుంచి దోచుకున్నారని, దీన్ని మిల్లర్ల నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా రైతులకు అన్యాయం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం కదలి అన్ని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు అండగా నిలబడాలని కోరారు.పరిస్థితులు ఇలాగే కొనసాగితే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, కొట్టేపాక రవి , మునిగాల భిక్షపతి,ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినయ్, పార్టీ నాయకులు అల్వాల రాజు, జూకంటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇనుప ఖనిజ నిల్వల గుర్తింపుపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం: ఎంపి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ జిల్లాలో ఖనిజ సంపదపై స్పష్టత ఇవ్వాలని, గనుల అభివృద్ధి, పర్యావరణ అనుమతులు, స్థానిక సంస్థలకు ఆదాయ భాగస్వామ్యం, గనుల భద్రతా తనిఖీలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు.వరంగల్ జిల్లాలో సుమారు 40 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో అంగీకరించినప్పటికి అభివృద్ధి ఎందుకు ముందుకు సాగడం లేదన్న విషయాన్నీ ఎంపీ లేవనెత్తారు.ఈ మేరకు వరంగల్‌ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ గనుల బ్యూరో నిర్వహించే జాతీయ ఖనిజ జాబితా (నేషనల్ మినరల్ ఇన్వెంటరీ) ప్రకారం, 2025 ఏప్రిల్ 1 నాటికి ఈ ఇనుప ఖనిజ నిల్వలు 'రిమైనింగ్ రిసోర్సెస్' కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. అయితే, ఇప్పటివరకు వరంగల్ జిల్లాలో ఒక్క ప్రధాన ఖనిజ గని లీజు కూడా మంజూరు కాలేదని, ఒక్క ఖనిజ బ్లాక్ కూడా వేలం వేయలేదని స్పష్టం అవుతుందని, దీంతో జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ, ఉపాధి అవకాశాలు, స్థానిక అభివృద్ధి, గ్రామ పంచాయతీలకు ఆదాయం వంటి ప్రయోజనాలు ప్రజలకు దక్కని పరిస్థితి కొనసాగుతోందని ఎంపీ విమర్శించారు. కేంద్రం గనుల అభివృద్ధిపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని, తెలంగాణ ప్రాంతాల పట్ల వివక్ష చూపుతోందంటూ ఎంపీ విమర్శించారు. వరంగల్ వంటి వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని, ఖనిజ సంపదను ప్రజల సంక్షేమానికి ఉపయోగించే దిశగా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

## బలమైన ఉద్యమంతో రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ప్రాజెక్ట్ సాధిస్తాం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** బలమైన ప్రజా ఉద్యమంతో మానుకోటలో రైల్వే మెగా మెయింటెనెన్స డిపో ప్రాజెక్ట్ సాధిస్తామని మహబూబాబాద్ జిల్లా ఎనిమిది రాజకీయ పార్టీల నేతలు స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో పెరుమాండ్ల జగన్నాథం హాల్లో బుధవారం 8 రాజకీయ పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, టిడిపి,బీఎస్పీ పార్టీల నేతలు బి విజయ సారధి, సాధుల శ్రీనివాస్, ఘనపురపు అంజయ్య, మండల వెంకన్న, ఎడ్ల వేణు మాధవ్, కొండపల్లి రామచంద్ర రావు, కొత్తపల్లి రవి, ఇసంపల్లి ఉపేందర్ మాట్లాడుతూ మాట్లాడుతూ రైల్వే పరిశ్రమ సాధనకై ఐక్యంగా పోరాటం నిర్వహించాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ప్రజా ఉద్యమం ద్వారా రైల్వే పరిశ్రమ సాధిస్తామని వారు స్పంష్టం చేశారు. ఈ పరిశ్రమ సాధనలో స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ ఎంపీ బలరాం నాయక్ చొరవ చూపి బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా రేపు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ గారిని కలిసి రైల్వే పరిశ్రమ సాధనకై మాట్లాడతామని తెలిపారు. ఈ సమావేశంలో బి అజయ్ సారధి రెడ్డి, సోమయ్య. రవికుమార్. రాజు గౌడ్. లింగయ్య. సత్యం. సురేష్ నాయుడు. రాజు. రాజన్న. రాజమౌళి. పెరుగు కుమార్. వెంకన్న. శ్రావణ్. పాపయ్య. నాగన్న. హిమానాయక్. బుర్గుల వీరస్వామి. దేవేందర్ నరేష్ పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ స్నేహ

### హనుమకొండ జిల్లాలో తుది విడత 84.45 శాతం పోలింగ్



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లాలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో 84.45 శాతం పోలింగ్ నమోదు అయింది. జిల్లాలోని మొత్తం నాలుగు మండలాలైన శాయంపేట, నడికుడ, దామెర,ఆత్మకూరులలో పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. వీటిలో ఆత్మకూరులో 87.41 శాతం,దామెరలో 89.54 శాతం, నడికుడలో 85.00 శాతం,శాయంపేటలో84.74 శాతం పోలింగ్ నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లాలోని శాయంపేట,దామెర మండలాలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.శాయంపేట మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ సరళి, ఓటింగ్ శాతం గురించి ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దామెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను ఎన్నికల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆయా మండలాల్లో రెండువేలకుపైగా ఓటర్లు ఉన్న పెద్ద గ్రామపంచాయతీలు ఉన్నచోట్ల నాలుగు వేసి కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి కౌంటింగ్ కేంద్రాలలో ప్రారంభమయ్యే కౌంటింగ్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ కు సంబంధించిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డి ఆర్‌డిఓ మేన శ్రీను, పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, మండల ప్రత్యేకాధికారులు జయంతి, బాలరాజు, ఎంపీడీవోలు ఫణి చంద్ర, కల్పన, తహసిల్దార్లు ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

### భూపాలపల్లి మూడో విడత ఎన్నికల్లో 84.02 శాతం పోలింగ్ నమోదు
### కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో నిర్వహించిన సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల మూడో దశ పోలింగ్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మూడో విడత లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవ్‌పూర్, మహాముత్తారం, మల్హర్‌రావు మండలాల్లో పోలింగ్ నిర్వహించగా, ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు దశలవారీగా ఓటింగ్ శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. మూడో దశలో మొత్తం సగటు 84.02 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. కాటారంలో 82.28, మహదేవపూర్ లో 84.38, మహా ముత్తారంలో 86.42, మల్హర్ లో 83.80 పోలింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.

## 22న సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం

**ప్రజాపక్షం/జనగామ :** మూడు విడతల్లో ఎన్నుకున్న, ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాన స్వీకారం ఈ నెల 22 జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఇందు కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల వద్ద ప్రమాణ స్వీకారలు చేయించాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు 22 ననే ప్రమాణ స్వీకారాలు జరుగుతాయన్నారు.

## గెలిచిన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి

### సర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు బానోతు శ్రీను, చిదిరాల కృష్ణమూర్తి, యనమల సావిత్రి, బానోతు విద్యాసాగర్, ఎండి.మైపాషా, బానోతు బిక్షపతి, పాద్య స్వరూప, ధరావత్ విజయ, ఎర్ర వెంకట్‌రెడ్డి, జాటోతు గంగ, ధరావత్ విజయ, బంగారి రమేశ్, పయ్యావుల కళమ్మ, బానోతు రజిని, బానోతు అభిరామ్‌లను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచిన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తొర్రూరు మండలంలో మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, తొర్రూరు పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పింగిలి ఉష, నాయకులు గంజి విజయపాల్‌రెడ్డి, చాపల బాపురెడ్డి, మాలోతు సునీత రాజేందర్, మిత్తింటి హరీశ్, ఇమ్మడి శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రవీణ్ యాదవ్, పాద్య రమేశ్, సోమ్లా నాయక్, రవీందర్, శ్రీను పాల్గొన్నారు.

## విబి-జిరామ్ జీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

### బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు

**ప్రజాపక్షం/హనుమకొండ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చి దాని స్థానంలో వీబీ జీరామ్ జీ పేరుతో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్( గ్రామీణ) గా మంగళ వారం లోకసభలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించు కోవాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రధానమంత్రి కి వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ మోడీ పాలనలో పేదలకు చేసిందేమీ లేదని, ఉన్న పథకానికి నిధులలో కోత పెడుతూపేదల పొట్ట కొడుతున్నదన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గమన్నారు. 90 శాతం కేంద్ర నిధులు 10 శాతం రాష్ట్ర నిధులతో నడుస్తున్న ఉపాధి పథకాన్ని 60 శాతం కేంద్ర నిధులు 40 శాతం రాష్ట్ర నిధులు అని చట్టం చేస్తే రాష్ట్ర ప్రభుత్వాలపై పెనుబారం పడుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెలఎల్లేశ్, బిక్షపతి, కర్రె లక్ష్మణ్, వెంకట్రాజం, కొట్టెపాక రవి, అలువాల రాజు, జూకంటి పద్మ పాల్గొన్నారు.

## పెన్షనర్ల సేవలు అమూల్యమైనవి

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కాజీపేట :** పెన్షనర్ల సేవలు అమూల్యమైనవని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పెన్షనర్ డే సందర్భంగా కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ అభివృద్ధికి తమ జీవితాన్ని అంకితం చేసిన పెన్షనర్ల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ నిబద్ధతతో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగుల కృషి వల్లే నేడు వ్యవస్థలు బలంగా నిలబడ్డాయని అన్నారు. రిటైర్మెంట్ అనంతరం కూడా సమాజానికి మార్గనిర్దేశకులుగా ఉండే పెన్షనర్ల అనుభవం యువతకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ పెన్షనర్లను ఎమ్మెల్యే సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన ఆయన, తమ సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రజాలి ,డివిజన్ అధ్యక్షులు అజ్గర్ నాయకులు గుంటి కుమార్, సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, మధు, సమ్మయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటి సర్వేచేసి కుష్ట వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో ఇంటింటి సర్వే తో కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ అన్నారు. జిల్లాలో వైద్యాధికారులతో లెప్రసీ సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 18 నుంచి 31 వరకు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కుష్టి వ్యాధి చర్మానికి నరాలకు సోకుతుందన్నారు. ఎండిటి (బహుళ ఔషధ చికిత్స) ద్వారా వ్యాధి ఆరు నెలల నుండి 12 నెలలకు పూర్తిగా నయమవుతుందని వివరించారు. చర్మంపై రాగి రంగు మచ్చలు ఉండి ఉండదని చికిత్స కోసం దగ్గర్లోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దేవేందర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు పీఎంఓ మల్లయ్య, డిపిఎమ్ఓ ఏరియా నాయక్ పాల్గొన్నారు.

# రీల్

## ఓటీటీలో 'సోదర సోదరీమణులారా'..




సోషల్ డ్రామా థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన 'సోదర సోదరీమణులారా..' చిత్రం తాజాగా 'ఆహా' ఓటీటీలో విడుదలై ప్రేక్షకుల నుంచి భారీ రెస్పాన్స్‌ను అందుకుంటోంది. దర్శకుడు రఘుపతి రెడ్డి గుండా తెరకెక్కించిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, పృథిరీరాజ్, అపర్ణ, కలకేయ ప్రభాకర్ కీలక పాత్రల్లో నటించారు. కథ ఒక క్యాబ్ డ్రైవర్ చుట్టూ తిరుగుతుంది. భార్య, ఆరు సంవత్సరాల కూతురితో సంతోషంగా జీవిస్తున్న అతని జీవితంలో అకస్మాత్తుగా వచ్చిన మలుపు అతడిని తీవ్ర విషాదంలోకి నెట్టేస్తుంది. ఒక అత్యాచారం, హత్య కేసులో అతడిని తప్పుగా నిందితుడిగా నిలబెట్టి శిక్ష విధించడంతో అతని గౌరవం, స్వేచ్ఛ, కుటుంబ జీవితం అన్నీ ఛిద్రమవుతాయి. ఈ నేపథ్యంలో నిజాన్ని నిరూపించుకునేందుకు అతడు చేసే పోరాటం, అలాగే భర్త నిర్దోషిత్వాన్ని నిలబెట్టేందుకు అతని భార్య వ్యవస్థతో, సమాజపు ముద్రలతో చేసే ధైర్యమైన పోరాటం చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయి.

## 'పోలీస్ కంప్లైంట్' టీజర్ విడుదల



ఎమ్మెస్కె ప్రమిదశ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై సంజీవ్ మేగోటి రచన, దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్'. తెలుగు, కన్నడ టీజర్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. వరలక్ష్మి శరత్ కుమార్ ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా, ఆమెకు జంటగా నవీన్ చంద్ర మరో బలమైన పాత్రలో నటించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సంజీవ్ మేగోటి మాట్లాడుతూ 'ప్రేమ, పగ, తప్పు, ఒప్పు, మంచి, చెడు మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాను హారర్ థ్రిల్లర్ మాత్రమే కాకుండా అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా రూపొందించాం. కన్నడ స్టార్ హీరోయిన్ రాగిణి ద్వివేది ప్రత్యేక పాత్రలో ప్రేక్షకులకు థ్రిల్ కలిగిస్తారు. ఉత్కంఠభరితమైన స్క్రీన్‌ప్లేతో సాగే ఈ చిత్రంలో కృష్ణసాయి, బేబీ తనస్వి భిన్న పాత్రల్లో మెప్పిస్తారు. వరలక్ష్మి శరత్ కుమార్ ఈ సినిమాలో భయంతో పాటు ఎంటర్టైన్మెంట్ అందిస్తారు. 45 రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేయడానికి వరలక్ష్మి యే కారణం. తెలుగు, తమిళం, మలయాళం కన్నడం.. నాలుగు భాషల్లో సినిమాను రూపొందిస్తున్నాం' అని అన్నారు. వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ.. 'డైరెక్టర్ చెప్పిన సబ్జెక్టు నచ్చి సినిమా చేశాను. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫుల్లుగా కామెడీ చేశాను. సినిమా బాగా వచ్చింది. ఈ సినిమా ప్రతీ ఒక్కరికీ నచ్చుతుంది' అని అన్నారు. వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, రాగిణి ద్వివేది పాత్రలు వారి గత చిత్రాలకు భిన్నంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రసన్న కుమార్, హీరో కృష్ణసాయి, సీనియర్ జర్నలిస్ట్ కృష్ణమూర్తి, అడివి సాయి కిరణ్, రావుల వెంకటేశ్వర రావు ఇతరులు పాల్గొని చిత్ర యూనిట్‌కి విషెస్ తెలిపారు.

## డబ్బుల కోసం సినిమా తీయలేదు

బోయపాటి శ్రీను



నందమూరి బాలకృష్ణ ఇటీవల విడుదలైన సినిమా 'అఖండ 2: ది తాండవం'. విడుదలైన అన్ని కేంద్రాల్లో విజయవంతంగా నడుస్తున్న నేపథ్యంలో దర్శకుడు బోయపాటి శ్రీను మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ అఖండ విజయాన్ని ఎంత ఫీలైనా తక్కువే. ఇంకా కావాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా డబ్బు కోసం తీసింది కాదు. ఈ సినిమా ప్రజలకు చేరాలని తీశాం. మన తత్వం ఏమిటి? ప్రపంచంలో ఎవరైనా మనల్ని చూసి చేతులెత్తి దండం పెడతారు ఎందుకు? మనం ఆచరించే ధర్మం కోసం. మనం బిడ్డ పుట్టగానే పేగు తెంచి దేవుడికి ముడి వేస్తాం. దేవుడు పేరు పెట్టుకుంటాం. ఎదుగుతుంటే దేవుడు దయ అంటారు. చివరికి లోకాన్ని విడిచినప్పుడు కూడా దేవుడి దగ్గరికి వెళ్ళాడు అంటాం. మనకి కష్టం వచ్చినా దేవుడే ఆనందం వచ్చిన దేవుడే. అలాంటి అంశాలతో ఒక గొప్ప దారిని ఎంచుకుని తీసిన సినిమా ఇది. ఇది ప్రతి ఒక్కరికి చేరాల్సిన సినిమా. ఈ సినిమా చాలా పవర్ ఫుల్‌గా కమర్షియల్ అంశాలతో తీయడం జరిగింది. ఆడియన్స్ కూర్చుంటే ఊపిరి బిగబెట్టుకొని చూస్తున్నారు. అలాంటి అనుభూతితో తీసిన సినిమా ఇది. నేను మనిషినే. నాకు ఫీలింగ్స్ ఉంటాయి.

కొన్ని అనివార్య కారణాలవల్ల అలాంటి ఒక పరిస్థితి వచ్చింది. అయితే మా ఆలోచన అంతా బాలకృష్ణ అభిమానుల గురించే. రెండు రోజులు ముందు చెప్తే అర్థం చేసుకుంటారు. కానీ ఒక రెండు గంటలకు ముందు టికెట్లు తీసుకుని థియేటర్స్ దగ్గరకు వెళ్లిన తర్వాత ఇలా వాయిదా అని చెప్తే ఎవరికైనా కోపం వస్తుంది. అది సహజం. అయితే వచ్చిన పరిస్థితి గురించి మేము భయపడలేదు. మాకు బాలకృష్ణ ఉన్నారనే ధైర్యం ఉంది. ఆయన మాకు ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేము. అలాంటి పరిస్థితి వచ్చిన తర్వాత బాలయ్య వచ్చి సినిమా విడుదలకి ఏం కావాలో అన్నీ చేశారు. ఆ తర్వాత అన్నీ కూడా సజావుగా జరిగిపోయాయి. సినిమా రిలీజ్ విడుదలై అఖండ విజయాన్ని సాధించింది. ఒక మంచి సినిమా తీసి ఆశించాల్సిందే డబ్బు కాదు గౌరవం. అలాంటి గౌరవం వచ్చింది.మన ధర్మం మన తల్లి లాంటిది. మన తల్లి గురించి అద్భుతంగా చెప్పాము. మన ధర్మాన్ని మనం ఫాలో అయితే అద్భుతంగా ఉంటామని చెప్పాము. థియేటర్స్‌లో చిన్న పిల్లలు ఎక్కువమంది ఉన్నారు. వాళ్ళకేరింతలు చూస్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. మురళీమోహన్ క్యారెక్టర్‌తోనే మేము బిగినింగ్‌లో మొత్తం వివరంగా చెప్పడం జరిగింది. దేశానికి పెద్ద విపత్తు రాబోతుంది. దాన్ని నివారించాలంటే అష్ట సిద్ధి సాధన ఒకటే మార్గమని ఆ క్యారెక్టర్‌తో క్లియర్ చెప్పించడం జరిగింది. అష్టసిద్ధి అంటే మామూలు విషయం కాదు. ఆ సాధన చేసిన వాళ్ళు ఎలాంటి శక్తులు పొందుతారు మీరు కూడా పరిశోధన చేయవచ్చు. ఆ సాధన సాధించిన వాళ్ళు చిన్న ఆకారాన్ని పొందగలరు అదే సమయంలో విశ్వరూపాన్ని చూపించగలరు. సినిమా అంటే ఒక యజ్ఞం. ప్రతిదీ చాలా కేర్ తీసుకుంటూ చేయాలి. ప్రతి డీటెయిల్ నా స్క్రిప్ట్‌లో ఉంటుంది. పార్ట్ వన్‌లో అఘోర క్యారెక్టర్ మనందరికీ సుపరిచితం. 12 సంవత్సరాలు తర్వాత ఒక సాధనలో ఉన్న వ్యక్తి బయటకు వస్తే ఎలా మాట్లాడుతాడు? అలాంటి వేరియేషన్స్ వేసుకుని డబ్బింగ్ రూంలో బాలయ్య గారితో ప్రతిదీ వివరంగా చర్చించుకుని ప్రతి క్యారెక్టర్ ఎలా మాట్లాడాలి? దాన్ని తత్వం ఏమిటి అనేది జాగ్రత్తగా ప్రతిదీ చాలా కేర్‌తో చేయడం జరిగింది. కర్ణాటక, చెన్నై, హిందీలో సినిమా ఉర్రూతలూగుతుంది. 135 రోజుల్లో సినిమా తీశాను. కొబ్బరికాయ కొట్టిన రోజే డేట్ అనౌన్స్ చేస్తామని బాలకృష్ణకి ముందే చెప్పాను. సెప్టెంబర్ 25 సినిమా రిలీజ్ అన్నాం. మేము అనుకున్నట్టే కాపీ రెడీ అయిపోయింది. అదే సమయానికి ఓజి సినిమా ఉంది. ఇండస్ట్రీలో రెండు పెద్ద సినిమాలు ఒకేసారి రావడం అంత కరెక్ట్ కాదు. రెండు సినిమాలు బాగుండొచ్చు. కానీ థియేటర్స్ షేర్ అయిపోతాయి. మన రెవిన్యూని మనమే ఇబ్బంది పెట్టుకున్నట్టుగా ఉంటుంది. అప్పుడు బాలయ్య తమ్ముడికి దారి ఇచ్చేద్దాం, మనం తర్వాత వద్దామన్నారు. అఖండ–2 త్రీడీలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. మీరు ఈ సినిమాని త్రీడీలో పిల్లలకు చూపిస్తే మరోసారి వెళ్దామని అంటారు. మరో 10 రోజుల్లోనే నా నెక్ట్స్ సినిమాకు సంబంధించిన వివరాలు చెప్తాను.

## నేడు ఛాంపియన్ ట్రైలర్




జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలింస్‌తో కలిసి నిర్మిస్తున్న చిత్రం ఛాంపియన్. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అ ర్చన కీలక పాత్రల్లో నటించారు. నేడు ట్రైలర్ రిలీజ్ కానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ చీఫ్ గెస్ట్‌గా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన 'చిరుత ఫర్ ఛాంపియన్' స్పెషల్ వీడియోలో 'చిరుతోస్తే చిందే వేయ్యాలా' సాంగ్ అభిమానులని అలరించింది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ అల్బమ్ కంపోజ్ చేశారు. ఆర్.మధీ కెమెరా మెన్‌గా, ఆర్ట్ డైరెక్టర్‌గా తోటి తరణి పని చేశారు. ఈ చిత్రానికి ఎడిటింగ్ బాధ్యతలను లెజెండరీ కోటగిరి వెంకటేశ్వరరావు నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'శంబాల'ను పంపిణీ చేస్తున్న మైత్రి, ఉషా పిక్చర్స్




ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల : ఎ మిస్టికల్ వరల్డ్'. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి యగంధర్ ముని దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వసిక, రవి వర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన బిజినెస్ పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంపై ఉన్న క్రేజ్, బజ్, డిమాండ్ మేరకు ఫ్యాన్సీ రేటుకే మేకర్స్ అమ్మేశారు. ఈ నెల 25 రాబోతోన్న 'శంబాల' బ్లాక్ బస్టర్ అని ట్రేడ్ సర్కిళ్లలో బలంగా వినిపిస్తోంది. దీనికి తగ్గట్టుగా భారీ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు 'శంబాల'ని అన్ని ఏరియాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. నైజాం ఏరియాలో మైత్రి, ఏపీ, సీడెడ్ ఏరియాలో ఉషా పిక్చర్స్ 'శంబాల' మూవీని భారీ ఎత్తున డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి. ఇక ఓవర్సీస్లో సైతం ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. ఓవర్సీస్ బాధ్యతల్ని మూన్ షైన్ సినిమాస్ తీసుకుంది. ఇక కర్ణాటకలో ఈ సినిమాను కుమార్ బెంగళూర్ ఫిలమ్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. నిర్మాతలు రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి ఈ సినిమాను నిర్మించారు. శ్రీచరణ్ పాకాల స్వరపరిచిన అద్భుతమైన నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా మారనున్నాయి.

## సెన్సార్ పనుల్లో 'నేనెవరు'?




నట కిరీటి డా.రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్ర పోషించిన హార్ట్ టచ్చింగ్ చిత్రం 'నేనెవరు'. 'నువ్వే కావాలి', 'ప్రేమించు' చిత్రాల ఫేమ్ సాయి కిరణ్, సౌమ్య, శ్యామల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో జై చిరంజీవ ఫిల్మ్ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లికార్జున్ సమర్పణలో అండేకర్ జగదీష్ బాబు సకినాన భూలక్ష్మి సంయుక్తంగా నిర్మించారు. వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయి చెర్రీ హీరోలుగా పరిచయమవుతున్న ఈచిత్రంలో దీపిక, సోనాక్షి హీరోయిన్లు. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి చేసుకున్న ఈచిత్రం ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. తన కెరీర్‌లో చాలా గర్వంగా చెప్పుకునే చిత్రాల జాబితాలో 'నేనెవరు?' నిలుస్తుందని ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుకలో రాజేంద్రప్రసాద్ ప్రకటించిన నేపథ్యంలో ఈ చిత్రానికి బిజినెస్ పరంగా క్రేజ్ పెరిగిందని విడుదల తేది త్వరలో ప్రకటిస్తామని నిర్మాతల్లో ఒకరైన భూలక్ష్మి తెలిపారు.

## పోర్టర్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సంక్షోభంపై ప్రభుత్వం స్పందించాలి

### తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ డిమాండ్






ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది యాప్ ఆధారిత డ్రైవర్లు, డెలివరీ, హోమ్ బెస్డ్ సర్వీస్ వర్కర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) పోర్టర్ డ్రైవర్ల పని వేళలతో పాటు జీవనోపాధి పరిస్థితులు తీవ్రంగా దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, పోర్టర్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోవడంతో డ్రైవర్లు ఆర్థిక, మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ కార్మిక కమిషనర్, అదనపు కార్మిక కమిషనర్లకు టిజిపిడబ్ల్యుయు అధికారికంగా ఫిర్యాదు చేస్తూ, పోర్టర్ యాజమాన్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పోర్టర్ డ్రైవర్ల జీవనోపాధి, గౌరవాన్ని కాపాడేందుకు 7 రోజుల్లోపు అధికారిక సమావేశం నిర్వహించాలని టిజిపిడబ్ల్యుయు డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ పోర్టర్ సంస్థ అభివృద్ధి డ్రైవర్ల కష్టంపై ఆధారపడి ఉందన్నారు. కానీ ప్రస్తుతం అమలులో ఉన్న విధానాలు డ్రైవర్లను అప్పులు, అసురక్షిత పరిస్థితుల్లోకి నెట్టుతున్నాయని, ఇది కొనసాగనివ్వబోము అని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రజాపాలన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, నోడల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్‌కు టిజిపిడబ్ల్యుయు ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.

**టిజిపిడబ్ల్యుయు ప్రధాన డిమాండ్లు..**

* ట్రిప్ రేట్లలో అకస్మాత్తుగా జరిగిన భారీ తగ్గింపులు డ్రైవర్లను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టాయి. ఇంధనం, వాహన నిర్వహణ ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయమైన బేస్ ఫేర్, కిలోమీటర్ రేట్లను పునరుద్ధరించాలి.
* కస్టమర్ల క్యాన్సిలేషన్ల వల్ల డ్రైవర్ల సమయం, ఇంధనం వృథా అవుతోంది. తప్పనిసరిగా క్యాన్సిలేషన్ ఛార్జీలు డ్రైవర్ ఖాతాలో నేరుగా జమ చేయాలి. పదే పదే క్యాన్సిల్ చేసే కస్టమర్లపై చర్యలు తీసుకోవాలి.
* సరైన విచారణ లేకుండా డ్రైవర్ల అకౌంట్లు సస్పెండ్ చేయడం జరుగుతోంది. అకౌంట్ బ్లాక్ చేసే ముందు నోటీసు, ఆధారాలు చూపించి డ్రైవర్‌కు వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలి. పారదర్శక గ్రీవెన్స్ రెడ్రెస్సల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి.
* డిజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గింది. ఇతర లాజిస్టిక్స్ సంస్థల మాదిరిగా ఫ్యూయల్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్‌సిఎ) అమలు చేయాలి. టోల్ ఛార్జీలను యాప్ ద్వారా వెంటనే రీయింబర్స్ చేయాలి.
* పికప్ లొకేషన్ వద్ద ఎక్కువసేపు వేచి ఉన్నా ఎలాంటి పారితోషికం లేదు. 5 నిమిషాల తర్వాత ఆటోమేటిక్‌గా వెయిటింగ్ ఛార్జీలు జోడించాలి.
* వేధింపులు, అసురక్షిత పరిస్థితులు ఎదురవుతున్నాయని డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు. 100శాతం వెరిఫైడ్ కస్టమర్ అకౌంట్లు, ప్రతీకార భయం లేకుండా ఫిర్యాదు చేసే అవకాశం, 24/7 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.
* తక్కువ చార్జీలు, దీర్ఘదూర ట్రిప్స్ తిరస్కరించినందుకు డ్రైవర్లపై ఒత్తిడి, పెనాల్టీలు వేయరాదు. రేటింగ్ విధానం న్యాయంగా ఉండాలి.
* డ్రైవర్లపై ప్రభావం చూపే విధాన మార్పులు యూనియన్‌తో చర్చించకుండా అమలు చేయడం అన్యాయం. ప్రతి నెలా టిజిపిడబ్ల్యుయు తో సమావేశాలు నిర్వహించాలి.

## 19 నుండి 21 వరకు ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్

### వివిధ దేశాల నుంచి 704 సినిమాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈనెల 19–21 వరకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ (హిసాఫ్) నిర్వహిస్తున్నట్టు నిర్వహణ కమిటీ ప్యాట్రన్, అంకురం సినిమా దర్శకుడు, తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ జ్యూరీ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర రావు తెలిపారు. బుధవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమా ఉమామహేశ్వరరావు మాట్లాడారు. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ సహా య సహాకారాలతో దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్ ఈ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ నెల 19 నుండి 21 వరకు ప్రసాద్ మల్టీ ప్లెక్స్ థియేటర్‌లోని స్క్రీన్ నెంబర్. 4 మరియు 5లో ఈ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ చలనచిత్ర అభివృద్ధి సంస్థ, సాంస్కృతిక, యువజన, పర్యాటక శాఖలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్‌తో కలిసి నిర్వహిస్తున్నామని చెప్పారు. మొదటి ఎడిషన్లోనే 704 ఎంట్రీలు వచ్చాయని చెప్పారు. 60 లఘు చిత్రాలను అధికారిక ఎంట్రీలుగా, మరో 11 చిత్రాలను ప్రత్యేక ఈశాన్య పెవిలియన్ కోసం, ఐదు క్లాసిక్ సినిమాలను ఎంపిక చేశామని తెలిపారు. ఈ చలనచిత్ర ఉత్సవం 19న సాయంత్రం 5.30 గంటలకు ప్రసాద్స్ ఐమాక్స్ లోని స్క్రీన్ 4లో లాంఛనంగా ప్రారంభమవుతుంది. ఈ ఫిలిం ఫెస్టివల్ చివరి రోజు అవార్డుల ప్రదానోత్సవం 21న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో జరుగుతుందని తెలిపారు. సినీ ప్ర ముఖులు నాగేశ్ కుకునూర్, నాజర్, మైథిలి రావు, లీమా దాస్, అలెగ్జాండర్ లియోపో, డాల్టన్, శశి కుమార్లను ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఫెస్టివల్ ప్రారంభోత్సవం రోజు తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు హాజరవుతారని ఉమా మహేశ్వర రావు తెలిపారు.

## తెలంగాణలో దిగ్విజయంగా క్రీడా కార్యక్రమాలు

### స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో వివిధ క్రీడా కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించగలుగుతున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి అన్నారు. బేగంపేట పబ్లిక్ స్కూల్‌లో మూడు రోజుల నుంచి జరిగిన 45వ సీనియర్ జాతీయ ఆర్చరీ పోటీల్లో రికర్వ్ విభాగానికి చెందిన పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడా శాఖ ఆధ్వర్యంలో గత రెండు సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్న అనేక క్రీడా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, హైదరాబాద్ నగరం స్పోర్ట్స్ హబ్‌గా మారేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడుతున్నాయని ఆమె అన్నారు. క్రీడా శాఖ ఇస్తున్న ప్రోత్సాహక విధానాలతో మరిన్ని క్రీడా కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. 48 సంవత్సరాల తర్వాత హైదరాబాదు నగరంలో జాతీయ సీనియర్ ఆర్చరీ పోటీలు నిర్వహించడం సంతోషకరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపీనాథ్, తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి.రాజు ప్రధాన కార్యదర్శి అరవింద్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పుట్టా శంకరయ్య, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు చేతన్ కప్లేకర్, డాక్టర్ ధుద్రం, ఇ.సంజీవరెడ్డి, సిహెచ్ సత్యనారాయణలు ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పరిపాలన అధికారి గుంజన్ అబ్రహం, విద్యార్థి మధ్యప్రదేశ్ ఆర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి డీకే విదర్భ కరీంనగర్ జిల్లా ఆర్చరీ సంఘం సెక్రటరీ కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సింగరేణి నూతన సిఎండిగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణభాస్కర్ బుధవారం ఉదయం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మార్యదపూర్వకంగా కలిసిన దృశ్యం.

## దిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)

ఎగుమతి చేస్తుంది. వీటిల్లో ఎక్కువగా 80 శాతం చమురు చైనాకు ఎగుమతి అవుతుంది. 15 నుండి 17 శాతం వరకూ అమెరికాకు షెవ్రోన్ కార్పొరేషన్ ద్వారా ఎగుమతి అవుతుంది. మిగిలినదంతా క్యూబాకు ఎగుమతి అవుతుంది. దక్షిణ అమెరికా చరిత్రలో ఎన్నడూలేనివిధంగా వెనిజులాను భారీ ఎత్తున యుద్ధ నౌకలు, సైన్యం వెనిజులాను చుట్టుముట్టి ఉన్నాయని ట్రంప్ ప్రకటించారు. 'ఎన్నడూ లేనివిధంగా మా సైన్యం వెనిజులాను చుట్టుముట్టింది, ఇది మరింతగా పెరుగుతుంది, ఇది వారికి దిగ్భ్రాంతి కలిగిస్తుంది, గతంలో వారు ఇలాంటిది చూడలేదు' అని ట్రంప్ పేర్కొన్నట్లు 'ద గార్డియన్' పత్రిక వెల్లడించింది. నికోలస్ మదురో ప్రభుత్వాన్ని విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించారని, అది అమెరికా ఆస్తులను దొంగిలించిందని, అదేవిధంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా ఆరోపణలను వెనిజులా ఎదుర్కొంటోందని ట్రంప్ ఆరోపణలు చేశారు. ట్రంప్ దిగ్బంధన చర్యలను వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో తీవ్రంగా ఖండించారు. అమెరికా పాల్పడుతున్న వికారమైన చర్యలకు దీనిని పరాకాష్ఠగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వాన్ని కూల్చివేసి తమకు అనుకూలంగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేకోవడంకోసమే ట్రంప్ కుట్ర చేస్తున్నారని నికోలస్ మదురో కొద్దినెలలుగా ప్రతివిమర్శలు చేస్తున్నారు. వెనిజులా నుండి బయటకు, లోపలికి చమురు నౌకల రాకపోకలు లేకుండా దిగ్బంధనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశానని వైట్‌హౌస్ ఓవల్ కార్యాలయంలో ట్రంప్ బుధవారం పాత్రికేయులకు చెప్పారు. వెనిజులా నియంత నికొలస్ మదురోపై ఒత్తిడి మరింతగా పెంచడంకోసమే, ఆ దేశంలోకి వెళ్ళేందుకు అనుమతి పొందిన అన్ని చమురు చమురు ట్యాంకర్లను ముట్టడించాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు చెప్పారు. వెనిజులా చమురు విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును మాదక ద్రవ్యాల ముఠాలను, ఇతర నేరస్థులను పెంచిపోషించడానికి ఉపయోగిస్తోందని ట్రంప్ ఆరోపించారు. వెనిజులా తీరంగా గడచినవారంలో ఒక భారీ చమురు ట్యాంకును అక్రమంగా అమెరికా రక్షణ బలగాలు తమ వశం చేసుకున్నాయి. వెనిజులాకు చెందిన భారీ చమురు నౌకను స్వాధీనం చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. గడచిన 24 వారాలుగా కరీబియన్ జలాలలో ట్రంప్ సృష్టించిన యుద్ధ ఉద్రిక్తతలు దీంతో మరింత తీవ్రమయ్యాయి. అమెరికాలోకి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అడ్డుకునే పేరుతో 25 పడవలపై ఇటీవలికాలంలో పెంటగాన్ సైనికులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 95 మంది ఇప్పటివరకూ మరణించారు. డిసెంబరు 16న తాజాగా తూర్పు పసిఫిక్ సముద్రంలో మూడు నౌకలపై చేసిన దాడుల్లో మరో ఎనిమిది మంది హతులయ్యారు. ఈ విధంగా పడవలపై చేస్తున్న దాడుల్లో అమెరికా దళాలు మానవ హక్కులను కూడా ఉల్లంఘిస్తున్నాయని ప్రతిపక్ష డెమొక్రటిక్ సభ్యులు ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు.

**మా సంపదను కొల్లగొట్టేందుకే... ఐక్యరాజ్యసమితిని న్యాయం అడుగుతాం**

ట్రంప్ సైన్యం, నౌకలు చుట్టుముట్టి ఆంక్షలు విధించడంపై వెనిజులా ప్రభుత్వం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న వికృత చర్యలకు పరాకాష్ఠగా పేర్కొంది. మా సంపదను అమెరికా కొల్ల గొట్టాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. సైన్యం మోహరింపు, వెనిజులాలోకి చమురు నౌకలు రాకపోకలు చేయకుండా దిగ్బంధనం విధించడం అంతర్జాతీయ చట్టాలకు, స్వేచ్ఛావాణిజ్య చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. చాలా నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతరాహిత్యంగా తమదేశంపై దిగ్బంధం విధించారని పేర్కొంది. 'ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టింగ్‌లో వెనిజులా చమురు, వెనిజులా భూమి, ఖనిజాలు అన్నీ తమవే అని భావిస్తున్నారు. తమ ఆస్తిగా ఆయన భావిస్తున్నారు, కాబట్టి ఇక వాటన్నింటినీ తమకు స్వాధీనం చెయ్యమని ఆయన డిమాండ్ చేస్తున్నారు, హేతుబద్ధత లేకుండా నిబంధనలు విధిస్తున్నారు, మా వేశ సంపదను కొల్లగొట్టే ఉద్దేశంతోనే వెనిజులా చుట్టూ భారీ ఎత్తున యుద్ధ నౌకలను మోహరించారు, ఈ పరిస్థితులను మేం ఐక్యరాజ్య సమితి ముందు పెడతాం, వారినే న్యాయం అడుగుతాం' అని ప్రకటించింది. 2017 నుండే ట్రంప్ ప్రభుత్వం వెనిజులాపై చమురు ఆంక్షలు విధిస్తోంది. అమెరికాతో సంబంధాలు తెంచుకుంటున్నట్లు నికొలస్ మదురో 2019లో ప్రకటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com